అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 3-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 122 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

రాహుల్‌కు మళ్లీ నిరాశే

పరువు నష్టం కేసులో స్టేకు హైకోర్టు నిరాకరణ

- జూన్ 3 తర్వాతే విచారణ




అహ్మదాబాద్ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మరోసారి నిరాశే ఎదురైంది. ఆయనకు సూరత్ కోర్టు విధించిన జైలు శిక్షపై తాత్కాలిక స్టే ఇచ్చేందుకు గుజరాత్ హైకోర్ట్ మంగళవారం నిరాకరించింది. వేసవి సెలవుల అనంతరం కోర్టు దీనిపై ఆదేశాలు జారీ చేస్తుంది. తన పిటిషన్‌పై ఆదేశాలు ఇచ్చే వరకూ తాత్కాలిక స్టే మంజూరు చేయాలని రాహుల్ ...5లో

మతతత్వాన్ని అనుమతించం

లౌకికవాదానికి వామపక్షమే హామీ

- బీజేపీని ఓడించటమే దేశానికి రక్ష : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



కేరళ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ కేరళ అధికార బాధ్యతలు చేపట్టి ఈ నెలాఖరుకు ఏడేండ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల సమస్యలు, కేరళ అభివృద్ధికి తన ప్రణాళికలు, దేశంలో రాజకీయ పరిస్థితులపై విజయన్ ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు...

వివిధ సమస్యలపై ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు ఏకమవుతున్నారు. సీనియర్ ముఖ్యమంత్రుల్లో ఒకరిగా మీ అభిప్రాయమేంటీ?

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్రం నుంచి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సమాఖ్య సూత్రాలను పూర్తిగా విస్మరించడం ప్రధాన సమస్యల్లో ఒకటి. కేంద్రం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా అధికారాన్ని కేంద్రీకరించే ధోరణి ప్రదర్శిస్తున్నది. ఫలితంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలు వివక్ష, వేధింపులకు గురవుతున్నాయి. రాష్ట్రాల ప్రత్యేక అంశాల్లో కేంద్రం జోక్యం చేసుకునే ధోరణిని మనం చూడొచ్చు. రాష్ట్రాల హక్కులు, అధికారాలను కేంద్రం లాక్కుంటున్నది. సమాఖ్య నిర్మాణం ప్రాథమికంగా ఉన్న చోట ఇది జరగకూడదు. ఈ వైఖరిపై నిరసనలు వెల్లువెత్తుతున్నా, కేంద్రం ఇవేమీ పట్టించుకోవడంలేదు. ఆ తరువాత కేంద్రం మరోరకంగా జోక్యం చేసుకుంటున్నది. ఇందుకోసం కేంద్ర ఏజెన్సీలను వినియోగిస్తున్నారు. మేము ప్రతిపక్షంలో ఉన్నందున ఈ చర్యలు ప్రయోగిస్తున్నారు. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం లభించని సందర్భాలు అనేకం ఉన్నాయి. గవర్నర్లు కేంద్రం ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకపోవడంపై తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. కేరళ పరిస్థితి ఏమిటీ?

కేరళలో గవర్నర్ తన వైఖరి మార్చుకోవాలి. గవర్నర్ ఆ పని చేస్తారని ఆశిస్తున్నాం. అందుకే మేము ప్రస్తుతం అలాంటి మార్గాన్ని తీసుకోలేదు. అయినా ఎలాంటి ...5లో



పంటా పోయె.. పనీ పోయె!

గింజలేక వరికోతలకు రైతులు దూరం

- కొనుగోలు కేంద్రాల్లో పనిలేక హమాలీల అవస్థ
- కొత్తగా సాగు పరికరాలకు ఆర్డర్లు లేవు..
- కుదేలైన సాగుయంత్ర పరికరాల తయారీ, మరమ్మతు కేంద్రాలు
- సాగుపై ఆధారపడిన వారందరినీ ముంచిన వర్షాలు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అన్నదాత వేడుకోలు

అకాల వడగండ్ల వానలు యాసంగి ఎవుసాన్ని చేతికి రాకుండా చేశాయి. పొలంలోని వరిగొలుసుకు ధాన్యం గింజ కూడా మిగలకుండా రాల్చి, కోసిన ధాన్యం కుప్పలను నీటిపాల్జేసి ఊహించని కష్టాన్ని, నష్టాన్ని మిగిల్చాయి. పర్యవసానంగా ఆరుగాలం శ్రమించిన రైతులతో సహా సాగుపై ఆధారపడిన కూలీలు, హమాలీలు, ట్రాక్టర్, హార్వెస్టర్ల నిర్వాహకులు, సాగుయంత్రాల తయారీ, మరమ్మతు పరిశ్రమలు.. ఇలా చెప్పకుంటూపోతే అనేక మంది 'ఉపాధి' పోయింది. ఈ నేపథ్యంలో నవతెలంగాణ వారి స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. అక్కరకు పడాల్సిన వర్షాలు.. కాలం కాని వేళ పడి వారి కడుపు కొట్టిన పరిస్థితులు కన్నీరు తెప్పిస్తున్నాయి. రాష్ట్రంలో చాలా చోట్ల ఇవే పరిస్థితులు ఉన్నాయి. సాయంత్రం కాగానే వర్షం పడుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి (శ్రీకాంత్)

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 7,39,659 ఎకరాలుకాగా.. 10,21,910 ఎకరాల్లో ఆయా పంటలు సాగయ్యాయి. ఇందులో వరి విస్తీర్ణమే 9,40,067 ఎకరాలు. ప్రారంభంలో నాట్లు వేశాక మెడవిరుపు, ఎర్రబారిన నారుతో మళ్లీ కలియదున్ని కొందరు నాట్లు వేశారు. తీరా 45రోజుల తరువాత పంట చేతికొచ్చే సమయంలో నాలుగు భారీ వర్షాలు గింజ కూడా మిగలకుండా చేశాయి. ఏప్రిల్‌లో కోతలు ప్రారంభమైనా సగం విస్తీర్ణం కోత దశలోనే ఉండిపోయింది. దీంతో కోసిన వరిధాన్యం కుప్పలు తడిసి మొలకెత్తగా.. కోయని పొలాల్లో వరిగొలుసుకు గింజ కూడా మిగలకుండా రాలిపోయాయి. దాదాపుగా రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి.



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని చిన్న పల్లెటూరు బొంతకుంటపల్లిలో సుమారు 300 ఎకరాల్లో రైతులంతా వరి సాగు చేస్తే.. 250 ఎకరాల్లో వడగండ్లు గింజ కూడా మిగలకుండా రాలిపోయి తడిసి ముద్దయింది. ఇదే పరిస్థితి తెలంగాణ జిల్లాలన్నింటిలోనూ నెలకొంది. యాసంగి సీజన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చేది. ఇప్పుడు ఒక్కో సెంటర్‌లో కనీసం వెయ్యి క్వింటాళ్లు కూడా లేదు. ఒక్కో క్వింటాపై తూకం, లోడ్ చేసినందుకు హమాలీకి రూ.40 దొరికేది. ఇప్పుడు మే1 వరకు కరీంనగర్ జిల్లాలో కనీసం 16వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కూడా సేకరించలేదంటే ఒక్కో సెంటర్‌లో ఇన్ని రోజులుగా ఒక్కో హమాలీకి రూ.500 కూడా గిట్టుబాటు కాలేదు.

50గంటలైనా నడవని హార్వెస్టర్

సాధారణంగా ప్రతి సీజన్‌లో ఒక్కో హార్వెస్టర్ కనీసంగా 300గంటల వరకు కిరాయికి వెళ్లేది. ఇప్పుడు వరి కోతల్లేక 50గంటలు కూడా పని దొరకడం లేదు. రాష్ట్రంలో వేలాది హార్వెస్టర్లు ఇండ్లకే పరిమితం అయ్యాయి. పెరిగిన డీజిల్, డ్రైవర్ బత్తా, నిర్వహణ ఖర్చులతో గంటకు రూ.1800 వరకు కిరాయి ...2లో

2 వేల పడకల నిమ్స్‌కు త్వరలో భూమిపూజ



- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- ఏర్పాట్లు సత్వరం పూర్తి చేయాలి
- నెలాఖరులోగా గాంధీ సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ పూర్తి చేయాలి : మంత్రి హరీశ్ రావు

వివరాలు 5లో..

రేపు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



- నేడు ఢిల్లీకి కేసీఆర్

న్యూఢిల్లీ : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జాతీయ కార్యాలయం రేపు (గురువారం) ప్రారంభం కానుంది. కార్యాలయాన్ని ప్రారంభించేందుకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నేడు (బుధవారం) ఢిల్లీకి చేరుకోనున్నారు. ఢిల్లీలోని వసంత విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ ...5లో

'ఫ్రీ' సిలిండర్లు కర్నాటకలోనేనా.. తెలంగాణలో ఇవ్వరా?



- మోడీ ఆ రాష్ట్రానికి మాత్రమే ప్రధానా?
- బీజేపీ ఉచిత పథకాల మ్యానిఫెస్టోపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- సిరిసిల్ల నియోజకర్గంలో క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన
- వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు భరోసా

వివరాలు 5లో..

ఏప్రిల్‌లో 8 శాతానికి పెరిగిన నిరుద్యోగిత రేటు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నిరుద్యోగ రేటు పెరుగుతున్నది. చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. 2014 ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ యువతకు ఏటా రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని ...5లో

పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ అబ్జర్వర్లు

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ


- ఎంసెట్‌కు 3.20 లక్షల దరఖాస్తులు
- గతేడాది కంటే 53,873 పెరిగిన అప్లికేషన్లు
- 137 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఒకే విడతలో ఈసెట్
- ఒకేరోజు మూడు విడతల్లో లాసెట్, ఎడ్‌సెట్
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంసెట్‌కు రికార్డుస్థాయిలో 3,20,587 దరఖాస్తులొచ్చాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. గతేడాది కంటే ఈసారి 53,873 దరఖాస్తులు పెరిగాయని అన్నారు. ఎంసెట్‌కు గతేడాది 2,66,714 దరఖాస్తులొచ్చాయన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల స్థానంలో ఈసారి సిట్టింగ్ అబ్జర్వర్లను ప్రతి కేంద్రంలో సెట్ కమిటీ నియమిస్తుందని వివరించారు. వారే పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని రకాల పనులనూ పర్యవేక్షిస్తారని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన వారిలో ఇప్పటి వరకు 2.62 లక్షల మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. తెలంగాణలో 104, ఏపీలో 33 కలిపి మొత్తం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల సంఖ్య పెరిగినందున గతేడాది కంటే 28 కేంద్రాలను పెంచామని అన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ, 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. రోజూ రెండో ...5లో

అధ్యక్ష పదవికి శరద్‌పవార్ రాజీనామా




ముంబయి : నేషనలిస్ట్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు శరద్‌పవార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌సీపీ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు మంగళవారం ప్రకటించారు. ముంబయిలో జరిగిన తన ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పవార్ ఈ ప్రకటన చేశారు. బీజేపీపై పోరాటంలో, విపక్షాలను ఒకే తాటి మీదకు తేవటంలో పవార్ కృషి చేస్తున్నారు. ఇలాంటి సమయంలోనే ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. గత కొంతకాలంగా.. మహారాష్ట్రలో రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పవార్ అన్న కొడుకు, మహారాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఎన్సీపీపై తిరుగుబాటు చేస్తున్నారన్న ప్రచారం బాగా జరుగుతున్నది. కాగా, ఎన్‌సీపీ అధ్యక్ష బాధ్యతలన నుంచి పవార్ వైదొలగడాన్ని పార్టీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆయన వెంటనే రాజీనామా వెనక్కి తీసుకోవాలని ఎన్‌సీపీ కార్యకర్తలు, నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాజీనామా సమయంలో పక్కనే ఉన్న ఎమ్మెల్యే జయంత్ పాటిల్ వంటి నేతలు కన్నీటి పర్యంతమైన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. పవార్ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగిన ఆడిటోరియం నుంచి కొందరు బయటకు వెళ్లి, ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు.

మత స్వేచ్ఛకు విఘాతం

భారత్‌లో పరిస్థితి ఆందోళనకరం

- వివక్షాపూరిత విధానాలు, చట్టాలు
- మైనారిటీల గొంతు నొక్కుతున్నారు
- అమెరికా స్వతంత్ర సంస్థ నివేదిక



భారత్‌లో మతస్వేచ్ఛను పాలకులు కాలరాస్తున్నారని అమెరికాకు చెందిన స్వతంత్ర సంస్థ అభిప్రాయపడింది. మత స్వేచ్ఛ విషయంలో భారత్‌లో నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని ఆ సంస్థ 'యునైటెడ్ స్టేట్స్ ప్యానెల్' తెలిపింది. ఈ మేరకు భారత్‌ను పరిగణనలోకి తీసుకోవాలంటూ శ్వేతసౌధానికి సిఫార్సు చేసింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా ప్రభుత్వానికి చెందిన స్వతంత్ర సంస్థ నివేదికను రూపొందించింది. ఈ సంస్థ వివిధ దేశాలలో మత స్వేచ్ఛ హక్కు ఎలా పరిరక్షించబడుతున్నదో పరిశీలిస్తుంది.

న్యూఢిల్లీ : . భారత్‌లో మత స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురవుతోందని యునైటెడ్ స్టేట్స్ ప్యానెల్ తాజా అధ్యయనం చెబుతున్నది. ఈ విషయంలో భారత్‌పై ఆ సంస్థ వరుసగా నాలుగు సంవత్సరాలుగా ఇదే రకమైన సిఫార్సులు చేస్తోంది. ఈ సంస్థ నివేదికను భారత ప్రభుత్వం గత సంవత్సరం తోసిపుచ్చింది. ఇది పక్షపాతపూరితంగా, అసమగ్రంగా ఉన్నదని వ్యాఖ్యానించింది. మత స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘిస్తున్న భారత ప్రభుత్వ సంస్థలు, అధికారులపై ఆంక్షలు విధించాలని, వారి ఆస్తులను స్తంభింపజేసి, వారిని అమెరికాలో ప్రవేశించకుండా నిషేధించాలని స్వతంత్ర సంస్థ తన నివేదికలో సూచించింది. 2022లో భారత్‌లో మత స్వేచ్ఛకు సంబంధించి దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని వ్యాఖ్యానించింది. భారత ...2లో



తడిసిన ధాన్యాన్ని కొంటాం

మామూలు ధాన్యం ధరే చెల్లిస్తాం .. రైతులు ఆందోళన చెందొద్దు

- ఏటా మార్చి నాటికే కోతలు పూర్తి చేయండి.. : సీఎం కేసీఆర్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అకాలవర్షాలతో తడిసిపోయిన ధాన్యానికి కూడా మామూలు ధర ఇచ్చి ప్రతి గింజా కొంటామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. రైతులు ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భరోసా ఇచ్చారు. వ్యవసాయాన్ని కాపాడుతూ రైతుల కష్టాల్లో భాగస్వామ్యం కావడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భవిష్యత్‌లో యాసంగి వరి కోతలు మార్చి నెలలోపే జరిగే విధంగా ఎలాంటి విధానాలను అవలంబించాలో అధ్యయనం చేయాలనీ, ఆ దిశగా రైతాంగాన్ని చైతన్యం చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కొనసాగుతున్నందున రైతులు వరికోతలను మరో మూడు నాలుగు రోజులు వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారంనాడాయన అకాల వర్షాలు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులు స్మితా సబర్వాల్, రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు, పంటల కొనుగోళ్లు, నష్టాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన వడగండ్ల వానలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు అందిస్తున్న విషయాన్ని తెలిపారు. రైతుల విషయంలో రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడినా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. యాసంగి వరి ధాన్యం తడుస్తున్న నేపథ్యంలో రైతుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుందనీ, అందుకే తడిసిన వరి ధాన్యాన్ని కూడా సేకరించాలని నిర్ణయించామన్నారు. ధాన్యం సేకరణకు అకాల వర్షాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా ...2లో

రైతు బీమా తరహాలో 'గీత కార్మికుల బీమా'

మంత్రులకు సీఎం కేసీఆర్ ఆదేశం

వివరాలు 2లో..

కొండల్లో కోయిల పాటలేమాయె..?!

అడవుల్లోకి విస్తరించిన కార్పొరేట్ విషం

- అంతరిస్తున్న ఆదివాసీ కళలు, సంస్కృతి
- అడవుల కాషాయీకరణకు బీజేపీ కుట్రలు
- పరిరక్షణ దిశగా టీఏజీఎస్ ప్రయత్నాలు
- రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ కళారూపాలకు ఆహ్వానం
- నేడు, రేపు భద్రాచలంలో 'రేలా పండుగ' ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"అడవి తల్లికి దండాలో.. మా తల్లి అడవికి దండాలో.. అడవి చల్లగుంటే అన్నానికి కొదవే లేదు.." అని ఆడుకున్నాం.. "ఓ కొండల్లో కోయిల పాటలు పాడాలి.." అని పాడుకున్నాం.. అడవి ప్రాధాన్యతను చాటే ఆ పాటలు, ఆటలన్నీ నేడు అరణ్యరోదనగా మారుతున్నాయి. కార్పొరేట్ విష సంస్కృతి వలలో చిక్కుకున్న అడవులతో పాటే ఆదివాసీల పరిస్థితీ అగమ్యగోచరంగా మారింది. వారి సంస్కృతి, ఉనికి, అస్థిత్వం నేడు ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్నాయి. అడవులను, అపురూపమైన ఆదివాసీల సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునేందుకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీకేఎస్) కంకణం కట్టుకుంది. ఈ నెల 5,6 తేదీల్లో సంఘం రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా బుధ, గురువారాల్లో భద్రాచలంలో 'రేలా పండుగ' జరుగుతోంది. ఆ ఆదివాసీ కళలు, సంస్కృతిని రక్షించుకుందాం రండి.. కుటుంబసమేతంగా హాజరుకండి.. అంటూ ఆహ్వానం పలుకుతోంది.

ఆదివాసీ భాషకు ముప్పు

అడవుల్లో కార్పొరేట్ కంపెనీలు విషం చిమ్ముతున్నాయి. ఆదివాసీ సమాజాలకే ప్రత్యేకమైన సామూహికతత్వాన్ని, ప్రజాస్వామ్య స్వభావాన్ని దెబ్బతీసేలా మోడీ సర్కారు కార్పొరేట్లకు వంతపాడుతోంది. ఆదివాసీల ఏ తెగకు ఆ భాషున్నది. కోయలకు కోయ, గోండులకు గోండు, కొండరెడ్లకు కొండి, గోండులకు గోండు, సవర్లకు సవర భాష ఉన్నది. హిందీని యావత్‌భారతదేశంపై రుద్దాలనే ప్రయత్నాల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు దానికి దగ్గరగా దేవనాగరి లిపిలో ఉండే సవరభాషకు మాత్రమే లిపిని కల్పించాయనే ఆరోపణలున్నాయి. మిగతా భాషలు తెలుగు- కన్నడ లిపిని ఉపయోగిస్తుండగా ఆదిలాబాద్‌లోని గోండులు మాత్రం దేవనాగరి లిపిని వినియోగిస్తుండటం గమనార్హం. తెలుగు- తెగ భాషలతో రూపొందించిన ఉభయ భాషల వాచకాలను బోధించేందుకు గతంలో అంగన్ ప్రాథమిక పాఠశాలల్లో నియమించిన వాలంటీర్లు నేడు ప్రోత్సాహకాలు లేక కనుమరుగయ్యారని ఆదివాసీలు వాపోతున్నారు. 1985 నుంచి 1996 వరకు నెలకు రూ.1500 వేతనంతో పనిచేసిన ఈ వాలంటీర్లను ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొంత మేర చర్యలు తీసుకుని.. 1426 స్కూల్స్‌లో గొండి, కోయ, కొలామి, లంబాడీ భాషలతో పాటు నూతనంగా చెంచు భాషను కూడా ప్రవేశపెట్టినట్టు చెబుతున్నారు. వాస్తవంలో అవి ఎక్కడ ఆచరణలో లేవని ఆదివాసీ సంఘాలు అంటున్నాయి.

'హిందూ ఉత్సవ సమితి' రూపంలో ప్రమాదంలో ఆటపాటలు..

కేంద్రంలో బీజేపీ సర్కారు వచ్చినప్పటి నుంచి అడువుల కాషాయీకరణ, కార్పొరేటీకరణ ఊపందుకోవడంతో ఆదివాసీ ఆటపాటలు తమ ప్రత్యేకతను కోల్పోతున్నాయి. సమిష్టిగా ఆడుకునే థింసా, గుస్సాడి, కోయ, కొమ్ముబూర, రుంజ, రేల నృత్యాల స్థానంలో రణగొణ ధ్వనులు చేసే డీజే సిస్టమ్‌లు అడవుల్లోకి వచ్చాయి. భూమి పండుగ, కొత్తల పండుగ, ఇటుకల పండుగ అనే రకరకాల పండుగలను రూపు మాపి గిరిజన సంస్కృతికి సంబంధం లేని కొత్తకొత్త ఉత్సవాలను 'హిందు ఉత్సవ సమితి' ఆదివాసీల మధ్యకు చేర్చింది. హనుమాన్ జయంతి, వినాయక చవితి వేడుకలను ఆదివాసీలపై రుద్దుతోంది. గృహప్రవేశాల సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను సైతం ఆదివాసీల్లో వ్యాప్తి చేసిందని, ఆదివాసీ పూజారులను కూడా కమర్షియల్‌గా మార్చిందనే ఆరోపణలున్నాయి.

ప్రాజెక్టులతో సంస్కృతి చిన్నాభిన్నం

పోలవరం, కాళేశ్వరం, సీతారామ, సీతమ్మ సాగర్ తదితర ప్రాజెక్టుల నిర్మాణంతో అడవిబిడ్డల బతుకులు, సంస్కృతి చిన్నాభిన్నం అవుతున్నాయని ఆదివాసీ సంఘాలు వాపోతున్నాయి. ఇలాంటి ప్రాజెక్టుల రూపకల్పనలో అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీల సంస్కృతి, మనుగడకు ముప్పు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు ఇవేవీ పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయి. వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తుల సేకరణే ప్రధాన ఆధారంగా జీవించే ఆదివాసీల్లో సమిష్టితత్వాన్ని దేశవ్యాప్తంగా ధ్వంసం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు ఎత్తుతో గోదావరి పరివాహక ఆదివాసీలు చెట్టు కొకరు పుట్టకొకరు కావాల్సి వస్తుండగా.. దుమ్ముగూడెం, చర్ల మండలాలను సీతమ్మ సాగర్ ముంపునకు గురి చేస్తోంది. వీటిపై నిరసనలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వాలు పట్టించుకునే స్థితిలో లేవు.

ఆదివాసీలపై అనేక రకాల దాడులు

విధానాల పరంగా ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు ఆదివాసీలపై రకరకాల దాడులు చేస్తున్నాయి. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కార్పొరేట్ విష సంస్కృతిని ఆదివాసీల్లో చొప్పించే కుట్రలు కొనసాగుతున్నాయి. అటవీహక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలకు దక్కాల్సినవేవీ దక్కకపోగా.. ప్రాజెక్టుల నిర్మాణాలతో ఆదివాసీలకు బతుకుదెరువు లేకుండా చేస్తున్నారు. సమ్మేళనాలు తప్ప ఆదివాసీల సంస్కృతి పరిరక్షణకు ఎలాంటి చర్యలు లేవు.

భీమ్‌రావు, టీఏజీఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కాంట్రాక్టు అధ్యాపకుల కల సాకారం

- 3,897 మంది సర్వీసుల క్రమబద్ధీకరణ : విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల దశాబ్దాల కల సాకారమైంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలోని 3,897 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం కమబద్ధీకరించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మంగళవారం జీవో నెంబర్లు 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30 ఉత్తర్వులను విడుదల చేశారు. గత నెల 30న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల క్రమబద్ధీకరణ దస్త్రంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. తాజాగా సంబంధిత శాఖల వారీగా జీవోలు విడుదల చేయడం గమనార్హం. 2016, ఫిబ్రవరి 26 నాటికి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో సర్వీసులో ఉన్న జనరల్, ఒకేషనల్ విభాగంలోని కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరిస్తున్నామని వివరించారు.

సీఎంకు కాంట్రాక్టు అధ్యాపకుల కృతజ్ఞతలు

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను జారీ చేయడం పట్ల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టి హరీశ్‌రావు, వి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాల నాయకులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేశ్, వస్కుల శ్రీనివాస్, కనకచంద్రం, గాదె వెంకన్న, శోభన్‌బాబు, కడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ..ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లోని మున్సిపాలిటీల పరిధిల్లో ఉన్న పేదల ఇండ్ల నిర్మాణం కోసం ఇబ్బందులు లేకుండా, నిబంధనల మేరకు వారి ఇంటి స్థలాలను క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. నోటరీ స్థలాలను క్రమబద్ధీకరిండానికి 2014లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 58,59లను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ రెండు జీఓలను అమలు చేయడానికి 14ఫిబ్రవరి2022లో జీఓ నెం.14, 17మార్చి2023లో జీఓ నెం. 29లను సర్కార్ జారీచేసింది. జీఓ నెం.29 గడువు ఏప్రిల్ 30తో ముగియడంతో ఈనెల 31వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ నెం.41ని జారీచేసింది.


జూన్ 1న డీసెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2023 రాతపరీక్ష జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గతనెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 22వ తేదీ వరకు అవకాశమున్నది. ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో 50 శాతం మార్కులు వచ్చిన వారే దరఖాస్తు చేసేందుకు అర్హులని, ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులొచ్చినా దరఖాస్తు చేయొచ్చని సూచించారు. సెప్టెంబర్ నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలని వివరించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో డీసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

బిల్కిస్ బానో పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులోని 11మంది దోషులను గతేడాది నిర్దోషులుగా విడిచిపెట్టడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను మే 9వ తేదీకి సుప్రీం వాయిదా వేసింది. దోషులకు శిక్ష తగ్గింపునకు సంబంధించి ఒరిజినల్ రికార్డులను ఇవ్వాల్సిందిగా మార్చి 27న కోర్టు జారీ చేసిన ఆదేశాలను సమీక్షించడానికి ఎలాంటి పిటిషన్ వేయలేదని, కేంద్రం, గుజరాత్ తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం బెంచ్‌కు తెలిపారు. బిల్కిస్ బానో కాకుండా ఇతరులు దీనిపై పిటిషన్లు దాఖలు చేయడానికి సంబంధించి ప్రారంభంలో సొలిసిటర్ జనరల్ ప్రాథమిక అభ్యంతరాలు లేవనెత్తారు. క్రిమినల్ కేసుల్లో ప్రతీసారీ ఇలా థర్డ్ పార్టీలు కోర్టుకు వస్తే తీవ్ర పర్యవసానాలు వుంటాయని అన్నారు. బానో వేసిన పిటిషన్‌కు సమాధానాలు ఇవ్వడానికి తమకు సమయం కావాలంటూ దోషుల తరపున న్యాయవాదులు కోరడంతో దీనిపై విచారణను బెంచ్ 9వ తేదీకి వాయిదా వేసింది.



మత స్వేచ్ఛకు విఘాతం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అన్ని స్థాయిలలోనూ మతపరంగా వివక్షాపూరితమైన విధానాలు, చట్టాలు అమలు చేస్తోందని తెలిపింది. మత మార్పిడులు, మత విశ్వాసాల మధ్య సంబంధాలు, హిజాబ్, గోవధ వంటి ఉదంతాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఇవి ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, దళితులు, ఆదివాసీలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో అణగారిన వర్గాలు... ముఖ్యంగా మైనారిటీల గొంతు నొక్కుతోందని నివేదిక తెలిపింది. వారి కదలికలపై నిఘా వేయడం, వేధింపులకు పాల్పడడం, ఆస్తులు ధ్వంసం చేయడం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది.

'మత స్వేచ్ఛను, భావ ప్రకటనా స్వేచ్ఛను లక్ష్యంగా చేసుకొని మోడీ ప్రభుత్వం ఉపా, రాజద్రోహ చట్టాన్ని ప్రయోగిస్తోంది. ప్రజలను భయభ్రాంతులను చేస్తోంది. పలువురు పాత్రికేయులు, న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు, మత స్వేచ్ఛను కోరుకునే మైనారిటీలపై నిఘా వేయడం, వేధించడం, నిర్బంధించడం, విచారించడం వంటి చర్యలకు దిగుతోంది. మతోన్మాదులు గో రక్షకుల పేరిట హింసకు పాల్పడుతున్నారు. మైనారిటీల ఇళ్లను కూలగొడుతున్నారు. క్రైస్తవులపై కూడా దాడులు జరుగుతున్నాయి. మైనారిటీలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ హింసను ప్రేరేపిస్తున్నారు. ముస్లింలను అతి దారుణంగా హతమారుస్తున్నట్లు చూపిన ఓ కారికేచర్‌ను బీజేపీ గుజరాత్ కమిటీ ట్విటర్‌లో షేర్ చేసింది. దీనిని ఫిబ్రవరిలో ట్విటర్ తొలగించింది' అని ఆ నివేదిక తెలిపింది. భారత్ సహా మొత్తం 17 దేశాలు మత స్వేచ్ఛను కాలరాస్తున్నాయని అమెరికా సంస్థ ప్రస్తావించింది. అయితే ఈ నివేదిక పరిపూర్ణం కాదని అమెరికా విదేశాంగ శాఖ ఉప ప్రతినిధి వేదాంత్ పటేల్ చెప్పారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆ సంస్థను సంప్రదించ వచ్చునని తెలిపారు. నివేదికను ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ స్వాగతించింది.

రైతు బీమా తరహాలో 'గీత కార్మికుల బీమా'

- మంత్రులకు సీఎం కేసీఆర్ ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రైతు బీమా అమలు చేస్తున్న తీరులోనే కల్లుగీత కార్మికుల కోసం 'గీత కార్మికుల బీమా'ను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా కల్లుగీస్తూ ప్రమాదంలో ప్రాణాలను కోల్పోయిన గీత కార్మికుని కుటుంబానికి రూ. 5లక్షల బీమా సాయాన్ని నేరుగా వారి ఖాతాలో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును సీఎం కేసీఆర్ ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గీత కార్మికులపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తూ జారిపడి ప్రాణాలు కోల్పోతున్న దురదృష్ట సంఘటనలు జరుగుతుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి ఊహించని దురదృష్టకర సందర్భాల్లో మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఇప్పటికే ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నా బాధితులకు అందడంలో ఆలస్యమవుతున్నదనీ, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతన్నల కుటుంబాల కోసం అమలు చేస్తున్న రైతుబీమా తరహాలో కల్లుగీతను వృత్తిగా కొనసాగిస్తున్న గౌడన్నల కుటుంబాలకు వారం రోజుల్లోనే బీమా నగదు అందేలా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని మంత్రులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

తడిసిన ధాన్యాన్నీ కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మూడు, నాలుగు రోజులపాటు వానలు కొనసాగుతాయని అధికారులు ఇచ్చిన వివరాలను ఆయన పరిశీలించారు. వర్షాలు తగ్గేదాకా రైతులు వరిపంటను కోయకుండా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఏటా మార్చి నెలాఖరు నాటికి యాసంగి వరికోతలు పూర్తయ్యేలా రైతాంగం వరిని ముందస్తుగానే నాటుకోవాలనీ, తద్వారా అకాల వర్షాల ముప్పును తప్పించుకోవచ్చని చెప్పారు. ఏప్రిల్, మే నెలలు వచ్చేదాకా వరిపంట నూర్చుకుంటే ఎండలు ఎక్కువయ్యి ధాన్యంలో నూకశాతం పెరుగుతుందన్నారు. అయితే దీనిపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని ఆయన వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఎరువుల వాడకంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో తలెత్తే మార్పులను ఎప్పటికప్పుడు రైతాంగానికి అర్థమయ్యే రీతిలో కరపత్రాలు, పోస్టర్లు, ప్రకటనల రూపంలో ప్రచారం చేయాలని చెప్పారు. రైతు వేదికలను కేంద్రంగా చేసుకొని వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. అధికారులు పనితీరును మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులకు కృతజ్ఞతలు

- తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐదేండ్ల నిరీక్షణ తర్వాత వైద్యవిద్య విభాగంలో వైద్యుల బదిలీలకు జీవో నెంబర్ 48 ద్వారా మార్గదర్శకాలు జారీ చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అన్వర్, జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షులు కిరణ్ మాదాల ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు కొత్త వైద్య కళాశాలలకు శ్రీకారం చుడుతూనే, మరోవైపు మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న ఖాళీల ఆధారంగా కొత్త వైద్య కళాశాలలకు వెళ్లే వెసులుబాటు కల్పించారని వారు కొనియాడారు.

పంటా పోయె..పనీ పోయె..!


(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న హార్వెస్టర్ నిర్వాహకులు ఇప్పుడు ఖాళీగా ఉండలేక రూ.వెయ్యికే వచ్చేందుకు సిద్ధపడినా ధాన్యం రాలిన వరిని కోసేందుకు రైతులు సిద్ధపడటం లేదు. దీంతో అప్పుజేసి కొన్న హార్వెస్టర్‌కు బ్యాంకు కిస్తీ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నెళ్లకోసారి కనీసం రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు కిస్తీ కట్టాల్సిన హార్వెస్టర్ నిర్వాహకులు తల పట్టుకుంటున్నారు. మరోవైపు ట్రాక్టర్లను అగ్రికల్చర్ విభాగం కింద రిజిస్ట్రేషన్ చేస్తున్న ప్రభుత్వం హార్వెస్టర్లను మాత్రం కమర్షియల్ వాహనం కింద జమ కడుతోంది. దీంతో నెలవారీగా ట్యాక్స్‌లు భారంగా మారాయని మానకొండూర్ నియోజకవర్గంలోని బెజ్జంకి మండలానికి చెందిన నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు బాగుంటేనే.. పరిశ్రమలకు పని

వానాకాలం, యాసంగి సీజన్లలో మరమ్మతులకు వచ్చే ట్రాక్టర్లు, హార్వెస్టర్లతో ఆయా వెల్డింగ్, గ్యారేజ్‌ల కేంద్రాలు నిత్యం కళకళలాడేవి. ఇప్పుడు నెల రోజులుగా పనుల్లేక.. కనీసం మరమ్మతుకు వచ్చేందుకు ఒక్క వాహనమూ లేక నిర్మానుష్యంగా మారాయి. హార్వెస్టర్ మరమ్మతులు చేసే గ్యారేజీలు, ఫ్రంట్‌బ్లేడ్, ఫ్లవ్, ట్రాక్టర్ ట్రాలీ, కల్టివేటర్, కేజీ వీల్స్, ఇనుప నాగళ్లు, దుంపలు, వాటర్ ట్యాంకర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు తయారీ, మరమ్మతు చేసే చిన్నపాటి పరిశ్రమలు దివాలతీసే పరిస్థితికి వచ్చాయి. అందులోని వర్కర్లకు జీతాలివ్వలేక ఆయా పరిశ్రమలు, గ్యారేజీల నిర్వహణ ఖర్చులకు యజమానులు అప్పుల్జేసి ఎదురుపెట్టుబడి పెడుతున్నారు.


పగబట్టినట్టే పనిలేకుండా చేసిన వానలు



వర్షాలు పగబట్టినట్టే వచ్చి వ్యవసాయాన్ని నిండా ముంచాయి. మొన్నటి వరకు ఒక్కో సీజన్‌లో నా హార్వెస్టర్ కనీసం 300గంటలకుపైగా నడిచింది. ఇప్పుడు కనీసం 30గంటలు కూడా వరి కోతలు దొరకలేదు. పెరిగిన డీజిల్ ధరలు, డ్రైవర్ బత్తా, హార్వెస్టర్ నిర్వహణ ఖర్చులతో పోల్చితే తక్కువ కిరాయికి కోతలకు వెళ్లలేం. అలాగని తక్కువ కిరాయితో ఉన్నా కొద్దిపాటి వరికోతలకు వెళ్తే డ్రైవర్ ఖర్చులూ మిగలవు. ఇప్పటికే హార్వెస్టర్‌పై తీసుకున్న రుణానికి బ్యాంకు కిస్తీకి కష్టంగా మారింది.

కొట్టె దామోదర్- శనిగరం

ఏడాదిగా ఎదురు పెట్టుబడే..!



వానాకాలం, యాసంగి సీజన్లలో కనీసం 30 ట్రాక్టర్ ట్రాలీలు తయారు చేసేవాళ్లం. ఇప్పుడు కనీసం ఐదుకు మించి ఆర్డర్లు రావడం లేదు. పంట పండక, చేతిలో డబ్బుల్లేక ట్రాలీల మరమ్మతుకూ రైతులు రావడం లేదు. ఒక్క ట్రాలీ తయారు చేస్తే రూ.5వేల నుంచి రూ.7వేలు మిగులుతుంది. అలాంటిది నెలలో రెండు కూడా ఆర్డర్లు వస్తలేవు. నా గ్యారేజీలో వర్కర్లకు జీతాలు, నిర్వహణ ఖర్చులే నెలకు రూ.1.50లక్షలవుతోంది. ఏడాది కాలంగా వచ్చే నష్టాలతో ఎదురుపెట్టుబడి పెడుతూ వస్తున్నాను.

చిలగాని కనకయ్య, గ్యారేజీ నిర్వాహకుడు

సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఏ చంద్రన్ కన్నుమూత

పాలక్కాడ్ : తరితలకి చెందిన సీనియర్ సిపిఎం నేత, అలతూర్ మాజీ ఎంఎల్ఏ ఎం.చంద్రన్ సోమవారం సాయంత్రం కోచిలో ప్రైవేటు ఆస్పత్రిలో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. ప్రస్తుతం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడుగా వున్న చంద్రన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగా కూడా వున్నారు. పాలక్కాడ్ జిల్లా కార్యదర్శిగా మూడుసార్లు చేశారు. కాన్నూర్ గ్రామ పంచాయితీ అధ్యక్షుడిగా, కుమరనల్లూర్ సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

తరితలలో పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాజేష్ విజయంలో ముఖ్య పాత్ర పోషించారు. 2006 నుండి 2016 వరకు పదేళ్ళ పాటు అసెంబ్లీలో అలతూర్ సీటుకు ప్రాతినిధ్యం వహించారు. ఎమర్జన్సీ సమయంలో నెల రోజులు జైలు శిక్ష అనుభవించారు. 1987లో జిల్లా కార్యదర్శి కావడానికి ముందు పార్టీ లోకల్, ఏరియా, తాలుకా కమిటీల కార్యదర్శిగా కూడా పనిచేశారు. జిల్లా కార్యదర్శిగా మూడుసార్లు పనిచేశారు. చంద్రన్ మృతికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, రాష్ట్ర కార్యదర్శి ఎం.గోవిందన్, మంత్రి ఎం.బి.రాజేష్‌లతో పాటూ పలువురు పార్టీ నేతలు సంతాపం ప్రకటించారు.

వెయ్యి మంది అమిత్‌షాలొచ్చినా ఖర్గేను కదిలించలేరు

మళ్లీ బీజేపీకి అధికారమిస్తే 50 శాతం కమీషన్

- మోడీ, అమిత్‌షాకు దిమ్మతిరిగే తీర్పునివ్వండి : కర్నాటక ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెయ్యి మంది అమిత్‌షాలొచ్చినా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కదలించలేదరని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేసి ఆనాడు ఖర్గే లక్ష్యంగా కుట్ర చేసి ఓడించారనీ, ఇప్పుడు దానికి ప్రతీకారం తీర్చుకునే సమయం వచ్చిందని కర్నాటక ప్రజలకు గుర్తు చేశారు. మోడీ, అమిత్‌షాకు దిమ్మతిరిగే తీర్పును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే కాంట్రాక్టుల్లో కమీషన్ 40శాతం నుంచి 50 శాతానికి చేరుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీదర్, బాల్కీ, బసవ కళ్యాణ్, హుమాబాద్ ప్రాంతాల్లో జరిగిన నాలుగు ఎన్నికల ప్రచార సభల్లో రేవంత్ ప్రసంగించారు. ఖర్గే లాంటి ఒక యోధుడిని ఓడించేందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఇంచార్జిగా నియమించి కుట్రను చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ కుట్రల కారణంగా ఓడిపోయిన ఖర్గే చేతిని కాంగ్రెస్ వదల్లేదన్నారు. రాజ్యసభ సభ్యున్ని చేసిందనీ, ఏఐసీసీ అధ్యక్షున్ని చేసిందని గుర్తు చేశారు. ఖర్గే నేతృత్వంలో 150 సీట్లతో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. సోనియా గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కర్నాటకను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. గుజరాత్ ఎన్నికలు జరిగినప్పుడు అప్పుడు మోడీ, అమిత్ షా ఇవి గుజరాత్ ఆత్మ గౌరవానికి సంబంధించిన ఎన్నికలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

డిజిటల్ విప్లవంలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలి

ఫ్లిప్‌కార్ట్ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలు బలంగా ఉన్నాయని, ఇలాంటి ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల నిర్వహణలో సంఘాలను, స్థానిక కమ్యూనిటీలను భాగస్వామ్యం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సంగారెడ్డిలోని ఫ్లిప్‌కార్ట్ నూతన ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాన్ని హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వర్చువల్‌గా మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడంతోపాటు వేగంగా మెగరుపడేందుకు డిజిటలీకరణ తోడ్పడుతున్నదని, ఈ-కామర్స్ మరింత బలోపేతం చేసిందని అన్నారు. ఎంఎస్ఎంఈల వృద్ధికి తగిన వాతావరణం సృష్టించేందుకు ఫ్లిప్‌కార్ట్ కృషి చేస్తున్నదని తెలిపారు. ఆ సంస్థ పెట్టుబడులను స్వాగతిస్తున్నామని, ఈ నూతన ఫెసిలిటీతో స్థానిక విక్రేతలకు మార్కెట్ అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ-కామర్స్ సంస్థలు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కల్యాణ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న నూతన ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ఫ్లిప్‌కార్ట్ సరఫరా చైన్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నదని అన్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 40వేల ఉద్యోగాలు కల్పించడంలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. వేలాది స్థానిక వ్యాపారులు, లక్షలాది మంది వినియోగదారులతో అనుసంధానం చేయనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నీరా కేఫ్ ప్రారంభించడం అభినందనీయం...

- కల్లు గీత కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో బుధవారం నీరా కేఫ్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికీ, ప్రత్యేక కృషి చేసిన ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌కు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నీరా విధానాన్ని అమలు చేయాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘంతో పాటు వివిధ సంఘాలు, సంస్థలు, వ్యక్తులు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నీరా, పల్మేర ప్రొడ్యూసర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత ఐదు ఏండ్ల నుంచి ఎగ్జిబిషన్లు నిర్వహించామని తెలిపారు. అందరి కృషి ఫలితంగా ప్రకృతి పానీయం, ఆరోగ్యానికి ఉపయోగమైన నీరాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలకు అందుబాటులోకి తెవడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాల్లో కూడా నీరా స్టాళ్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్, బహుళ జాతి కంపెనీల ఉత్పత్తులను తట్టుకుని నిలబడే విధంగా నీరాకు మార్కెట్ కల్పించాలని కోరారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ద్వారా గౌడ యువతీ, యువకులకు, గీత కార్మికులకు ఉపాధి కలిగే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

8న ప్రియాంక గాంధీ హైదరాబాద్‌కు రాక

- నిరుద్యోగుల బహిరంగ సభలో ప్రసంగం
- శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరుద్యోగుల బహిరంగ సభలో పాల్గొనేందుకు ఈనెల 8న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్‌కు రానున్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభలో ఆమె ప్రసంగించనున్నారు. అంతకు ముందు ఎల్బీనగర్ చౌరస్తాలోని శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. అక్కడి నుంచి సరూర్‌నగర్ స్టేడియానికి కాలినడన రానున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులతో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. అనంతరం వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పుష్పలీల, అద్దంకి దయాకర్, ప్రీతం, మెట్టు సాయి కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రియాంకగాంధీ కర్నాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొని నేరుగా హైదరాబాద్ వస్తారని తెలిపారు. బహిరంగ సభ విజయవంతం చేసేందుకు నాయ కులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అందుకోసం అనేక కమిటీలు వేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ మేడే సందర్భంగా సీఎం కేసీఆర్ కార్మికులకు శుభ వార్త చెపుతారనుకుంటే నిరాశ పరిచారని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తానం టూ మాట తప్పారని తెలిపారు. పదేండ్ల అయినా కూడా ఇంతవరకు కార్మికులకు న్యాయం చేయలేదన్నారు. ఆర్టీసీ, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. పనిగంటలు, కనీస వేతనాలు కూడా ఇవ్వలేదన్నారు.

నేడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, వంటావార్పు

- వీఓఏలంతా జయప్రదం చేయాలి : ఎస్వీ.రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, తదితర సమస్యల్ని పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, వంటావార్పు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ తెలిపారు. ఆ కార్యక్రమాల్లో వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మె చేస్తున్నా సర్కారుకు పట్టదా? అని ప్రశ్నించారు. సెర్ప్ సీఈఓ సందీప్‌కుమార్ సుల్తానియా జోక్యం చేసుకుని వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వీఓఏలు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వ అనుకూల సంఘాలు అసత్య ప్రచారాలు చేయడాన్ని ఖండించారు. 18 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆ సంఘాలకు పట్టవా అని ప్రశ్నించారు. రూ.3,900 వేతనంతో ఎలా బతకాలో చెప్పాలని నిలదీశారు. వీఏఓల మేలు కోసం తాము చేస్తున్న పోరాటంలో కలిసిరావాలని కోరారు.

డీఎంఈ పరిధిలో బోధనా సిబ్బంది బదిలీలుమార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు డీఎంఈ పరిధిలోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలకు వైద్యారోగ్య శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్గదర్శకాలివే...

- ప్రస్తుతం పని చేస్తున్న చోట కనీసం రెండేండ్ల సర్వీస్ పూర్తయిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను మాత్రమే బదిలీల ద్వారా భర్తీ చేస్తారు.
- ఒకవేళ బదిలీ కోసం పెట్టుకున్న దరఖాస్తులు 17 కాలేజీల్లోని ఖాళీల కన్నా ఎక్కువగా ఉంటే.. నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఖాళీల్లో భర్తీ చేస్తారు.
- కౌన్సిలింగ్ సందర్భంగా ఉస్మానియా, గాంధీ, కాకతీయ (వరంగల్), నిజామాబాద్ మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రదర్శించరు.
- ఒక పోస్టుకు ఒకరికన్నా ఎక్కువ మంది దరఖాస్తు చేస్తే స్పౌజ్, అంగవైకల్యం, బుద్ధిమాంద్యులైన పిల్లలు, కారుణ్య నియామకాలు, కుటుంబ సభ్యుల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు వంటి అంశాల ఆధారంగా ప్రాధాన్యతను నిర్ణయిస్తారు.

పారిశుధ్య కార్మికులకు లివింగ్ వేతనం అమలు చేయాలి: ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెట్రో వాటర్ వర్కర్స్, గ్రామ పంచాయితి పారిశుధ్య కార్మికులకు మేడే కానుకగా వెయ్యి రూపాయలు పెంచడంతో సరిపెట్టుకోకుండా వారికి లివింగ్ వేతనం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణ, సూర్యం మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా సీఎం ప్రకటన చూస్తే.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉన్నదని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలతో అనేక రంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. వెయ్యి రూపాయల కానుక ఈనాటి ధరలకు సరిపడేది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే పీఆర్‌సీ జీవో 60ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష రద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో గందరగోళం నెలకొంది. మంగళవారం నిర్వహించాల్సిన ఇంటర్ ఎకనామిక్స్ సబ్జెక్టుకు తెలుగు మాధ్యమంకు బదులుగా ఇంగ్లీష్ మీడియం ప్రశ్నాపత్రం రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆ పరీక్షను ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గతనెల 25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 13న ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ రాతపరీక్షను తిరిగి నిర్వహిస్తామని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు.

సంపాదకీయం

వన్ వే ట్రాఫిక్

'జనతా జనార్దన్... వ్యష్టి నుంచి సమిష్టి... నా నుంచి మనం' ప్రధాని నోట ఆదివారంనాటి మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌లో ఈ పదాలు జాలువారుతుంటే మాటలకు చేతలకు ఎంత తేడా అని ఆశ్చర్యపోతున్నారు. భావోద్వేగ భాషకు, ఆవేశం ఉట్టిపడే హావభావాలకు పెట్టింది పేరు మన

'మాన్‌కీ బాత్'లో భారంగా మారిన ధరల గురించో, ప్రభుత్వ రంగ అమ్మకాల గురించో, మహిళలు, దళితులు, మైనార్టీలపై హిందూ మతోన్మాదుల కిరాతకాలపై మోడీ మాట్లాడతారెమో అని వంద ఎపిసోడ్లుగా దేశం నిరీక్షిస్తూనే ఉంది. కనీసం కార్మికులకు 'మేడే' శుభాకాంక్షలు చెప్పడానికి ప్రధానికి నోరు రాలేదు. శ్రమ జీవుల పట్ల వారి దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు. కరోనా లాక్‌డౌన్లు, వలస కూలీల అవస్థలు, కరోనా వైఫల్యంతో లక్షల మరణాలకు ఇందులో చోటు లేదు. కార్పొరేట్-హిందూ మతతత్వ ఎజెండా, ప్రచారార్భాటం ఆ ఎపిసోడ్స్ ఆంతర్యం అన్నది స్పష్టం.

ప్రధానమంత్రి... మోడీ వక్తృత్వ పటిమ నిజంగానే గొప్పది. గొంతు చించుకుని మాట్లాడే మోడీ "మన్ కీ బాత్" ప్రసంగాలలో మాత్రం చాలా మంద్రంగా మాట్లాడతారు. ఆ ప్రసంగాలలో సారం కన్నా ప్రసంగించే తీరుకే అధిక ప్రాధాన్యం. ప్రతి నెలా తాను నిర్వహించే ఈ కార్యక్రమం మహిళల సాధికారత అంశాన్ని ముందుకు తెచ్చిందన్నారు. వివిధ సామాజిక సమస్యలపై జన చైతన్యాన్ని రగిలించడానికి కారణమయ్యిందన్నారు. రేడియో ద్వారా నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ స్వచ్ఛత నుంచి బేటీ బచావో, బేటీ పడావో వరకు అనేక ప్రజా ఉద్యమాలకు ప్రేరణనిచ్చిందన్నారు. ఆయన మాటలు చేతలైతే సామాన్యుల జీవితాలు బాగుపడి ఉండేవి. కానీ వారి తొమ్మిదేండ్ల పాలనలో అదానీల, అంబానీల ఆస్తులు ఆకాశానికి ఎగబాకాయి. కర్నాటక ఎన్నికల వేళ నూరవ మన్‌కీ బాత్‌లో భారత ప్రజలతో తనకున్న గాఢానుబంధాన్ని వేనోళ్ల తలచుకొంటూ మోడీ పరవశించిపోయారు. దానినొక ప్రచార విన్యాసంగా, స్వీయ కీర్తి కండూతిలకు ఉపయోగించుకున్నారు.



ప్రపంచంలో ఏ దేశంలోనూ ఏ నాయకుడూ ఇలాంటి గొప్ప ప్రయోగం చేయలేదని వత్తాసు పలికే గోడి మీడియా మచ్చుకైనా వారి పాలన గురించి ప్రస్తావించదు. ప్రజాస్వామ్య దేశంలో పాలకుల మనసులో మాటలు ప్రజలు వినడమే కాదు. ప్రజల మనసులో మాటలు కూడా పాలకులు వినగలగాలి. కానీ, మన ప్రధానమంత్రి మోడీ గారిదంతా 'వన్ వే ట్రాఫికే' తప్ప ఎన్నడూ ప్రజా సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదు.

చాలా చిన్న చిన్న విషయాలను కూడా మహా నాటకీయంగా చెప్పగల నేర్పరి ఆయన. మంత్రసానిగా ఎందరో గర్భిణీలకు సేవలందించిన కర్నాటక నరసమ్మ గురించి ప్రధాని మన్‌కి బాత్‌లో చెబుతుంటే... పేదల ఆరోగ్యం పట్టని ప్రభుత్వమిదని అర్థంకాలేదు. విజయనగరం జిల్లాలోని ద్వారపూడి పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలు తమ తల్లిదండ్రులకు రాత్రిపూట చదువు చెబుతున్న విషయం చెబుతుంటే నూతన విద్యావిధానం పేరుతో పేదలను చదువులకు దూరం చేసే ఎత్తుగడ మీ మనసులో ఉందన్న సంగతే మేం గుర్తించలేదు. న్యూజిలాండ్ ఎంపీగా గౌరవ్ శర్మ సంస్కృతంలో ప్రమాణ స్వీకారం చేసిన విషయం పలుకుతుంటే రానున్న రోజుల్లో వేదాధ్యయనం తప్పనిసరన్న మీ అంతరంగాన్ని ఎరుక చేసుకోలేకపోయాము. ఆసియాలో తొలి మహిళా లోకో పైలట్ సురేఖ యాదవ్ గురించి చెప్పినప్పుడు బిల్కిస్ బానో గురించో, ఉన్నావ్ మైనర్ బాలిక గురించో, ఢిల్లీ వీధుల్లో పోరాడుతున్న రైజర్ల గురించో ఎందుకు మాట్లాడలేదని మిమ్ముల్ని అప్పుడే నిలదీయాలని ఉన్నా... మాకెక్కడ అవకాశం ఇస్తారు. మీదంతా 'వన్ వే ట్రాఫిక్' విన్యాసం కదా!

ఎక్కడో ఏదో చిన్న సంఘటపై మన్ కీ బాత్‌లో లెక్చర్లిచ్చే మోడీ, అదానీపై మూగనోము ఎందుకు పట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు పుల్వామా వీర జవాన్ల మరణాలను ప్రచారాస్త్రంగా చేసుకొని మన్ కీ బాత్‌లో భావోద్వేగం చెందిన ప్రధాని, దానికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నప్పుడు నోరెందుకు మెదపడం లేదని వాపోతున్నారు. మత ఘర్షణలు, యూపీలో విచక్షణారహిత ఎన్‌కౌంటర్లు, ఫెడరలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం చివరకు రాజ్యాంగంపై కూడా దాడుల జరుగుతున్నా దేశాధినేత మౌనానికి కారణమేంటని నిలదీస్తున్నారు. 'మాన్‌కీ బాత్'లో భారంగా మారిన ధరల గురించో, ప్రభుత్వ రంగ అమ్మకాల గురించో, మహిళలు, దళితులు, మైనార్టీలపై హిందూ మతోన్మాదుల కిరాతకాలపై మోడీ మాట్లాడతారెమో అని వంద ఎపిసోడ్లుగా దేశం నిరీక్షిస్తూనే ఉంది. కనీసం కార్మికులకు 'మేడే' శుభాకాంక్షలు చెప్పడానికి ప్రధానికి నోరు రాలేదు. శ్రమ జీవుల పట్ల వారి దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు. కరోనా లాక్‌డౌన్లు, వలస కూలీల అవస్థలు, కరోనా వైఫల్యంతో లక్షల మరణాలకు ఇందులో చోటు లేదు. కార్పొరేట్-హిందూ మతతత్వ ఎజెండా, ప్రచారార్భాటం ఆ ఎపిసోడ్స్ ఆంతర్యం అన్నది స్పష్టం. ప్రజల ప్రస్తావనలేని, వారికి జవాబులు దొరకని కార్యక్రమం ఏదైనా ఎంత గొప్పదైనా ప్రజల మన్నన పొందజాలదు.

ఇలా చెప్పుకుంటూపోతే మోడీ-షా నేతృత్వంలో దేశంలో మతోన్మాదుల దురాగతాలకు అంతే లేదు. హిందూత్వ ఎజెండాతో రక్తపుటేరులు పారిస్తున్న మోడీ, నిత్యం కార్పొరేట్ల సేవలో తరించే మోడీ సామాన్యులకు చేసిందేమిటి? 'మాన్‌కీ బాత్'లో వినసొంపైన ప్రసంగాలు, నీతి బోధనలు తప్ప. ఇదంతా 'పులి-బాటసారి' కథ బాపతే. అందుకే ప్రజలారా..! తస్మాత్ జాగ్రత్త..!

తెల్ల బంగారం లిథియంపై కార్పొరేట్ల కన్ను!

పెట్టుబడిదారులు తమకు ఏది లాభసాటిగా ఉంటే దానికోసం ఎంతకైనా తెగిస్తారన్నది చరిత్ర చెప్పిన సత్యం. కొలంబస్ అమెరికాను కనుగొనటంలోనే అది తొలిసారిగా స్పష్టమైంది. ఆ పరంపరలో ఓడలు, సముద్ర మార్గాలు, దేశాల ఆక్రమణ, వలసపాలన, ముడి చమురు, విలువైన ఖనిజ సంపదలను ఆక్రమించుకొనేందుకు, వాటినుంచి లాభాలను పిండుకొనేందుకు జరిపిన దాడులు, యుద్ధాల చరిత్ర తెలిసింది. ఆ జాబితాలో ఇప్పుడు తెల్లబంగారంగా భావిస్తున్న లిథియం అనే ఖనిజం చేరనుందా? రానున్న రోజుల్లో చమురుతో పాటు అది కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. కాలుష్య ఉద్గారాలను 2050నాటికి సున్నా స్థాయికి తగ్గించే విధంగా శుద్ధమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనేది ఒక లక్ష్యం. తద్వారా పర్యావరణాన్ని రక్షించేందుకు పూనుకోవాలని ప్రపంచం చూస్తోంది. దీనికి గాను వాహన రంగంలో రెండువందల కోట్ల ఎలక్ట్రిక్ లేదా ఎలక్ట్రిక్‌తో పాటు అవసరమైతే చమురు ఇంధనాన్ని వినియోగించే వాహనాలను తయారు చేయాల్సి ఉంటుందని అంచనా. ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైది పెద్ద మొత్తంలో విద్యుత్ నిలువ చేయగలిగిన బ్యాటరీలు. వాటికి అవసరమైనది లిథియం. ఇప్పటివరకు కనుగొన్నమేరకు ఆ ఖనిజ నిల్వలు 250 కోట్ల బ్యాటరీల తయారీకి మాత్రమే సరిపోతాయట. సముద్రాల్లో, రాతి శిలల ప్రాంతాల్లో కూడా ఇది భారీగా దొరుకుతుంది.



ఎం. కోటేశ్వరరావు
8331013288

ఈ పూర్వరంగంలో ఎంతో విలువైన లిథియం నిల్వలను కొత్తగా కనుగొనేందుకు, ఉన్న వాటిని తమ స్వంతం చేసుకొనేందుకు బహుళజాతి గుత్త కంపెనీలు చూస్తున్నాయి. వాటికి అమెరికా, ఇతర ధనిక దేశాలు తమ పలుకుబడి, అధికారాన్ని ఉపయోగించేందుకు పూనుకున్నాయి. షరతులు వర్తిస్తాయి అన్నట్లుగా అందుకోసం కుట్రలు ఉంటాయని చెప్పనవసరం లేదు. బహుళజాతి కంపెనీల కోసం పని చేసే పత్రికల్లో ఒకటైన టైమ్స్ పత్రిక ఏప్రిల్ చివరి వారంలో " లిథియం కోసం ఒకవేళ దక్షిణ అమెరికా ఒక ఓపెక్‌ను ఏర్పాటు చేస్తే ఏం జరుగుతుంది " అంటూ ఒక విశ్లేషణా హెచ్చరికను ప్రచురించింది. ఒపెక్ అంటే చమురు ఉత్పత్తి ఎగుమతి దేశాల సంస్థ. అలాంటి దానినే లిథియం ఖనిజానికీ ఏర్పాటు చేస్తే అనేది దాని భయం. ప్రపంచంలో 2020 నాటికి కనుగొన్న మేరకు ఉన్న నిల్వలు రెండు కోట్ల పదిలక్షల టన్నులు. ఈ మొత్తంలో ఒక్క చిలీలోనే 92లక్షల టన్నులు ఉంది. తరువాత మన దేశంలోని జమ్మూ-కాశ్మీరు ప్రాంతంలో 59లక్షల టన్నులు, ఆస్ట్రేలియా 47, అర్జెంటీనా 19, చైనా 15, అమెరికాలో 7.5, కెనడాలో 5.3లక్షల టన్నుల నిల్వలున్నాయి. వీటి నుంచి 82వేల టన్నులు అదే ఏడాది వెలికి తీయగా ఒక్క ఆస్ట్రేలియాలోనే 40, చిలీ 18, చైనా 14, అర్జెంటీనా 6.2 వేల టన్నులు వెలికి తీశారు. మరుసటి ఏడాది లక్ష టన్నులకు పెరిగింది. దీనిలో అమెరికా వాటా కేవలం ఒక్కశాతమే ఉంది.

గతంలో గ్లాసును కరిగించే ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు, అల్యూమినియం ఆక్సైడ్ కరిగింపు, సిరామిక్స్ వంటివాటిలో లిథియంను వాడేవారు. రెండువేల సంవత్సరం తరువాత బ్యాటరీల తయారీకి ఉపయోగించటంతో దాని డిమాండ్ విపరీతంగా పెరుగుతూ వస్తోంది. ఇప్పుడది భౌగోళిక రాజకీయాలనే ప్రభావితం చేసేదిగా మారుతోందంటే అతిశయోక్తి కాదు. 2020లో ప్రపంచమంతటా 30లక్షల విద్యుత్ వాహనాలను కొనుగోలు చేస్తే మరుసటి ఏడాదికి 66లక్షలకు పెరిగాయి. మార్కెట్‌లో వీటి వాటా 9శాతం. రానున్న పది సంవత్సరాల్లో పెట్రోలు, డీజిలు మోటారు వాహనాల కొనుగోలును క్రమంగా తగ్గిస్తామని అనేక దేశాల ప్రభుత్వాలు ప్రకటించాయి. చమురు ధరలు పెరగటంతో సాధారణ పౌరులు కూడా వాటివైపే మొగ్గుతున్నారు. మోటారు వాహనాలు, ఇతర రంగాల్లో చిప్స్ ప్రాధాన్యత ఎలా పెరిగిందో లిథియ బ్యాటరీలు కూడా అంతే ప్రాధాన్యవహించనున్నాయి. అందుకే ఆరు దశాబ్దాల క్రితం చమురు దేశాలు మార్కెట్‌ను అదుపు చేసేందుకు ఒపెక్ సంస్థను ఏర్పాటు చేసినట్లుగా లిథియం ఖనిజం ఉన్న దేశాలు కూడా ఒక్కటైతే అమెరికా, జపాన్, ఐరోపాలోని వాహన తయారీ కంపెనీలు విద్యుత్ వాహన రంగంలో అడుగుపెట్టాలంటే ఇబ్బందులు తలెత్తుతాయి. టైమ్ పత్రిక విశ్లేషణలో వెల్లడించిన భయమదే.

లాటిన్ అమెరికా దేశాల్లో లిథియం నిల్వలున్నాయి. పెరూ ఎన్నికల్లో గెలిచిన వామపక్ష నేత పెడ్రో కాస్టిలో ప్రభుత్వాన్ని కుట్రతో కూల్చివేసి అధికారానికి వచ్చిన అమెరికా అనుకూల ప్రభుత్వం ఏప్రిల్ 10న ఒక ప్రకటన చేస్తూ అమెరికా లిథియం కంపెనీ అనుబంధ కెనడా కంపెనీకి లిథియం ఖనిజ గనులను అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. దాన్ని వ్యతిరేకిస్తూ పెరూవియన్లు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేస్తున్నారు. కుట్ర పూరితంగా అధికారానికి వచ్చిన ప్రభుత్వానికి తెలుపుతున్న నిరసనలో భాగంగా ఈ డిమాండ్‌ను కూడా చేర్చారు. కార్పొరేట్ల లాభాలు, ఇతర లబ్ధి గురించి చూపుతున్న శ్రద్ధ ఆ ప్రాంత పౌరుల పట్ల లేదని, తమ డిమాండ్లను విస్మరిస్తే ఖనిజ తవ్వకాలను అనుమతించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. ఖనిజమున్న పూనో ప్రాంతంలోని స్థానిక తెగలకు చెందిన మూడువేల మంది ప్రతినిధులు సమావేశమై ఆ ఖనిజం మీద సంపూర్ణ హక్కు తమదేనని, తమ సంక్షేమానికే వనరులను వినియోగించాలని, తమను సంప్రదించకుండా నిర్ణయాలు చేస్తే కుదరదని స్పష్టం చేశారు. ముడిసరకులను ఎగుమతి చేసే ప్రాంతంగా, దేశంగా మారిస్తే సహించేది లేదని పరిశ్రమలను పెట్టి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

నిజానికి ఇది ఒక్క పెరూ సమస్య మాత్రమే కాదు, ప్రపంచంలో సహజ సంపదలున్న ప్రతి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. లిథియంను కార్పొరేట్ల పరం చేసేందుకు పెరూ కుట్రదారులు చూస్తున్నారు, ప్రజల పరం



చేయాలని తాను కోరుతున్నట్లు పెడ్రో కాస్టిలో చెప్పారు. దీనిలో భాగంగానే బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్సీ లాటిన్ అమెరికా లిథియం ఉత్పత్తి, ఎగుమతులకు ఓపెక్ మాదిరి సంస్థ ఏర్పాటును ప్రతిపాదించినట్లు చెప్పాడు. అర్జెంటీనా సర్కార్ కూడా దీనిపట్ల ఆసక్తి వెల్లడించింది. మెక్సికో, చిలీ అధినేతలు కూడా ఇటీవల లిథియం గనులను జాతీయం చేయాలని ప్రకటించారు. తమ ప్రాంత సంపదలను తమ పౌరుల సంక్షేమానికే అన్న అంశం దీనివెనుక ఉంది. పెరటిగా తోటగా చేసుకొని నిరంకుశ, మిలిటరీ పాలకులను గద్దె మీద కూర్చోపెట్టిన అమెరికా ముడిసరకుల ఎగుమతి ప్రాంతంగా దీన్ని చూసింది తప్ప పరిశ్రమలను వృద్ధి చేయలేదు. అనేక దేశాల్లో అధికారానికి వచ్చిన వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఈ పరిస్థితిని మార్చాలని చూస్తున్నాయి.

టైమ్ వంటి కార్పొరేట్ మీడియాకు జన ఆకాంక్షలు పట్టవు. కొద్ది రోజుల క్రితం చిలీ ప్రభుత్వం లిథియం గనులను ప్రభుత్వ అదుపులోకి తేవాలని ఒక ప్రణాళికను ప్రకటించింది. ప్రస్తుతం అక్కడ తవ్వకాలు సాగిస్తున్న రెండు అమెరికన్ కంపెనీలను కొన్ని సంవత్సరాల తరువాత అంతిమంగా ప్రభుత్వ రంగ సంస్థకు అప్పగించటం, కొత్తగా జరిపే తవ్వకాలను ఆధునిక పరిజ్ఞానంతో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంలో చేపట్టాలని ప్రతిపాదించారు. అనేక దేశాల్లో ఈ పాక్షిక జాతీయకరణ ప్రతిపాదనలను ముందుకు తెస్తున్నారు. చమురు దేశాల్లో ఒపెక్ ఏర్పాటును కూడా నాడు బహుళజాతి గుత్త సంస్థలు అంగీకరించలేదు, విఫలం చేసేందుకు చూశారు. మన దేశంతో సహా అనేక దేశాలు చమురు ఉత్పత్తి, మార్కెటింగ్ విదేశీ కంపెనీలను జాతీయం చేశారు.

ప్రపంచంలో సహజ సంపదలున్న ప్రతి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. లిథియంను కార్పొరేట్ల పరం చేసేందుకు పెరూ కుట్రదారులు చూస్తున్నారు, ప్రజల పరం చేయాలని తాను కోరుతున్నట్లు పెడ్రో కాస్టిలో చెప్పారు. దీనిలో భాగంగానే బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్సీ లాటిన్ అమెరికా లిథియం ఉత్పత్తి, ఎగుమతులకు ఓపెక్ మాదిరి సంస్థ ఏర్పాటును ప్రతిపాదించినట్లు చెప్పాడు. అర్జెంటీనా సర్కార్ కూడా దీనిపట్ల ఆసక్తి వెల్లడించింది. మెక్సికో, చిలీ అధినేతలు కూడా ఇటీవల లిథియం గనులను జాతీయం చేయాలని ప్రకటించారు.

ఒపెక్ ఇప్పుడు రష్యాతో సహా 40శాతం చమురు సరఫరాను అదుపు చేస్తున్నది. లిథియం అంశంలో కూడా అదే జరిగితే లాభాలు తెచ్చే మరో గంగిగోవు తమకు దక్కదని బహుళజాతి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. 2010లో కేవలం 23,500 టన్నుల డిమాండ్ మాత్రమే ఉన్న ఈ ఖనిజం 2030నాటికి 40లక్షల టన్నులకు పెరుగుతుందని అంచనా. లాటిన్ అమెరికాలోని ఉప్పునీటి కయ్యలలో ఇది ఎక్కువగా దొరుకుతుంది. అయితే శుద్ధి ఎంతో సంక్లిష్టమైనదిగా, ఖర్చుతో కూడినదిగా మారటంతో అనేక దేశాల్లో వినియోగంలోకి రాలేదు. లాటిన్ అమెరికా దేశాలకు పెట్టుబడులు సమస్య కూడా ఉంది. సంయుక్తరంగంలో తామెందుకు పెట్టుబడులు పెట్టాలని కార్పొరేట్లు పెదవి విరుస్తున్నాయి. చైనా, ఆస్ట్రేలియాలలో కఠిన శిలలు ఉండే ప్రాంతంలో ఈ నిక్షేపాలు ఉన్నాయి. పాక్షిక జాతీయం, ప్రయివేటు రంగ భాగస్వామ్యం అన్న తమ విధానం పెట్టుబడులకు దోహదం చేస్తుందని చిలీ వామపక్ష అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ చెబుతున్నాడు. పర్యావరణానికి హాని జరగకుండా, కాలుష్యం పెంచని ఆధునిక పరిజ్ఞానంతో పెట్టుబడులు పెట్టే వారికి 49.99 శాతం వాటా ఇస్తామని చెప్పాడు. ఖనిజ తవ్వకం స్థానికులకు, దేశ పౌరులకు లబ్ధి కలిగించేదిగా ఉండాలన్నాడు.

1995లో ప్రపంచ లిథియం ఉత్పత్తిలో మూడో వంతు వాటా కలిగి ఉన్న అమెరికా ఇప్పుడు ఒక శాతానికి పడిపోయింది. దాని గనుల్లో ఉన్న నిల్వలు కూడా తగ్గినట్లు చెబుతున్నారు. ఈ ఖనిజానికి డిమాండ్ పెరుగుతున్న దశలో తమ ఆటో రంగానికి అవసరమైన దానిని చేజిక్కించుకొనేందుకు అక్కడి కంపెనీలు తప్పకుండా చూస్తాయి. చైనాలో ఉన్న గనులతో పాటు విదేశాల్లో కూడా దాని కంపెనీలకు 5.6బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి. బాటరీలకు అవసరమైన ప్రపంచ ముడి ఖనిజంలో 60శాతం మేరకు చైనాలో శుద్ధి చేస్తున్నారు. డిమాండ్ పెరిగే కొద్దీ చిలీ ప్రపంచ కేంద్రంగా మారే అవకాశం ఉంది. ప్రపంచంలోని లిథియం నిల్వల్లో 60శాతం చిలీ, బొలీవియా, అర్జెంటీనా త్రికోణ ప్రాంతంలో ఉన్నట్లు ప్రపంచ ఆర్థికవేదిక చెబుతున్నది. ఫోన్లు, కార్లకు అవసరమైన బ్యాటరీలకు ఇది అనువుగా ఉండటంతో ఒక దశంలో డిమాండ్ విపరీతంగా పెరిగింది. గతేడాది నవంబరులో టన్ను ధర 14 నుంచి 80వేల డాలర్లకు చేరి తరువాత తగ్గింది. 2040 నాటికి ఇప్పుడున్న డిమాండ్ 40 రెట్లు పెరుగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. ఇప్పటికే ప్రయివేటురంగంలో ఉన్న చిలీ అమెరికన్ కంపెనీల అనుమతి గడువు 2030లో ముగియనున్నది. దానిని పొడిగిస్తారా లేక సంయుక్త భాగస్వామ్యంలోకి మారుస్తారా అన్న అనుమానాలతో ఆ కంపెనీల వాటాల ధరలు పడిపోయాయి. ప్రభుత్వ రంగంలోని చిలీ రాగి కంపెనీ ప్రపంచంలో అతి పెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. అదే మాదిరి లిథియం కంపెనీని కూడా ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. ఈ పూర్వరంగంలో అది తెచ్చే లాభాల కోసం సామ్రాజ్యవాదులు ఎన్ని కుట్రలకైనా పాల్పడే అవకాశం ఉంది. చిలీ రాగి గనులకూ ప్రసిద్ధి అన్నది తెలిసిందే. ప్రపంచంలో అతి పెద్ద పరిశ్రమను అక్కడ 1973లో అధికారానికి వచ్చిన వామపక్ష నేత సాల్వెడార్ అలెండీ జాతీయం చేయటాన్ని అమెరికా, కార్పొరేట్ సంస్థలు సహించలేక కుట్ర చేసి ప్రభుత్వాన్ని కూల్చివేశారు. మిలిటరీ తిరుగుబాటుతో అలెండీని హత్య చేశారు. ఇప్పుడు లిథియం పాక్షిక జాతీయకరణ నిర్ణయం నాటి పరిణామాలను గుర్తుకు తెచ్చిందని కొందరు పేర్కొన్నారు. •

ప్రజ్వలించిన ప్రజాగీతం పీట్ సీగర్

2012లో ఆక్యుపై వాల్‌స్ట్రీట్ ఉద్యమంలోనూ పాల్గొని పాడాదంటే ఆయన చైతన్యం, శక్తి అర్థమవుతాయి. తన తొలినాటి సహచరుడైన గాయకుడు బాబీ డైలాన్‌కు నివాళు లర్పిస్తూ 2012లో ఫార్ ఎవర్ యంగ్ గీతం ఆలపించారు. ఆయన రచనలు పాటల ఆల్బంలు విపరీతంగా ప్రచారంలోకి వచ్చాయి. అత్యంత ఉత్తేజ కరమైన కళాత్మకమైన ఆయన జీవితంలో చెప్పుకోదగిన ఘట్టాలు, సృజనాత్మక విజయాలు, ధిక్కార గాథలు లెక్కలేనన్ని. ఈ శతజయంతి సందర్భంలో వాటిని తల్చుకోవడం ప్రపంచ వ్యాపితంగా ప్రగతిశీల వాదుల ముఖ్యంగా కళాకారుల కర్తవ్యం.

పద పదవే గీతమా... పదవే సంగీతమా... తోరణాలు తీరి జనం బారులుగా నిలిచిరే అంటూ తన గీతాలతో సంగీతంతో శ్రామిక జన సందోహాన్ని ఉర్రూతలూపిన ప్రపంచ ప్రజాగాయకుడు పీట్ సీగర్. ప్రపంచాధిపత్య దేశంలో ఆఫ్రికన్ అమెరికన్ల తరపున నిషేధాలు నిర్బంధాలు తట్టుకుంటూ అశేష కష్టజీవుల తరపున గొంతెత్తి పాడిన పౌరహక్కుల యోధుడు సీగర్. సంగీత ప్రపంచలో అధునాతన సాంకేతికతనూ జానపద కళాకారుల అపురూప సంప్రదాయాలనూ మేళవించి పదండి ముందుకూ అంటూ కదం తొక్కించిన ప్రజా గాయకుడు. ఈ రోజు ఆయన శతజయంతి. ప్రజా కళాకారులు ఆలోచనా పరులు ఎక్కడున్నా తన జీవితాన్ని కృషినీ స్మరించుకునే సందర్భం. దేశంలో మతతత్వ అభివృద్ధి నిరోధకత్వం, అంతర్జాతీయంగా మితవాద మతవాద భావజాలం చెలరేగిపోతున్న తరుణంలో స్ఫూర్తినిచ్చే వారసత్వం. పీట్ సీగర్ రాసి పాడిన పాటలు ప్రపంచ మంతా ప్రతిధ్వనిస్తున్నాయి. పౌర హక్కుల ఉద్యమానికి సంకేతమే గాక మానవ ప్రస్థానానికి ఉత్తేజమిచ్చే వుయ్‌షల్ ఓవర్ కమ్ సరే సరి. వేర్‌హావ్ ఆల్‌ద ఫ్లవర్స్ గాన్ ఐ హాడ్ ఎ హ్యామర్, టర్న్ టర్న్ టర్న్ ఎవరీ థింగ్ కిసెస్ స్వీటర్ దాన్‌వైన్ తదితర గీతాలు కూడా అమెరికాలో అద్భుతమైన ఆదరణ పొందాయి



తెలకపల్లి రవి

తలిదండ్రుల అడుగుల్లో పాటల బాటసారిగా...

ఛార్లెస్ సీగర్, కాన్‌స్టన్స్ దంపతుల సంతానమైన పీట్ సీగర్ బాల్యం నుంచే గానవిద్యలో ఆరితేరారు. 1919 మే 3న పుట్టారు. తల్లివయోలిన్ కళాకారిణి కాగా తండ్రి సంగీత శాస్త్ర నిపుణుడు (మ్యూజికాలజిస్ట్), ఆయన జాతుల ఉపజాతుల సంగీత సంప్రదాయాలను నిక్షిప్తం చేసే పరిశోధకుడు. అమెరికాలో మొట్టమొదటి సంగీత కళాశాల స్థాపించింది తనే. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా వైఖరికి భిన్నంగా ఆయన శాంతి ఉద్యమ వాదన చేయడంతో రాజీనామా చేయాల్సి వచ్చింది. 1932లో అతను భార్య నుంచి విడాకులు తీసుకుని మరో పెళ్లిచేసుకున్నాడు. 1938లోవారు న్యూయార్క్ చేరుకున్నారు. అప్పుడు మళ్లీ చార్లెస్‌కు సంగీత పరంగానూ ఇతరత్రా కూడా చాలా పదవులు లభించాయి. తలిదండ్రుల ప్రేరణతో పీట్ సీగర్ చిన్నప్పుడే పాడటం ప్రారంభించారు. ఏదో అనారోగ్యం కారణంగా పీట్ సీగర్ ప్రాథమిక విద్య సరిగ్గా సాగలేదు. అయితే అమ్మానాన్నతో కలసి అన్నదమ్ములిద్దరూ గ్రామాలు తిరిగేవారు. రకరకాల సంగీతాలు జానపదాలు ఆస్వాదించడం అభ్యసించడం అలవాటైంది. తనకు పదహారేళ్ల వయసునాటికి ఉత్తర కరోలినా జిల్లాలో ఆషేనిలో పర్వత ప్రాంత జానపద సమ్మేళనానికి వెళ్లినప్పుడు ఆ పాటలతో ఎంతో అనుబంధం ఏర్పడింది. పాత కాలపు తంబూరా లాంటి బాంజోతో తన పాటల పయనం అప్పుడే ఊపందకుంది.

వాస్తవంగా పీట్ సీగర్ పాత్రికేయుడు కావాలని కోరుకున్నాడు, కాని పాటల బాటసారిగా మారాడు. 1936లో క్యాప్ రైజింగ్ సన్ పాటల శిబిరానికి హాజరైనారు. మరుసటి ఏడాది పట్టభద్రుడైనాడు. స్కాలర్‌షిప్‌తో హార్వర్డ్ కాలేజీలో చేరాడు గాని రాజకీయ కార్యకలాపాలు జానపద సాహిత్యంలో పూర్తిగా నిమగ్నమైనాడు, వాగాబాండ్ పప్పెటీర్స్, తదితర బృందాలతో కలసి ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమం నాటి మెక్సికో డెయిరీ రైతుల సమ్మెకు సంఘీభావంగా సాగింది. 1939 నాటి డైలీ వర్కర్ దీనిపై వివరమైన కథనం ఇచ్చింది. అమెరికన్ కాంగ్రెస్ గ్రంథాలయంలో జానపద చరిత్ర గ్రంథస్తం చేస్తున్న తండ్రి స్నేహితుడు అలెన్ మాక్స్‌తో కలసి పనిచేశాడు.

అలెన్ మాక్స్ వూడీ గూత్రీ జోష్‌వైట్ తదితరులతో కలసి కలసి 'ఆల్మనాక్ సింగర్స్' బృందాన్ని 1940లో స్థాపించారు. వారంతా ఆల్మనాక్ హౌస్‌లో సమిష్టిగా జీవించేవారు. ఎక్కడ జనంవుంటే అక్కడకువెళ్లి పాడేవారు. జనసమూహాలు చేరే ప్రతిచోటా సామాజిక కార్యక్రమాలు జరిగే ప్రతిచోటా ఆల్మనాక్ సింగర్స్ ప్రత్యక్షమయ్యేవారు. రెండో ప్రపంచ యుద్ధం తనపై చాలా ప్రభావం చూపింది. శాంతి ఉద్యమంలో చేరాడు. ఎల్ రాబ్సన్‌తో 'లోన్‌సమ్ ట్రైన్' గానంలో పాలుపంచుకున్నాడు. కొలంబియా బ్రాడ్ కాస్టింగ్‌లో ఈ షో బాగా ప్రచారమైంది. మోడీ జెస్ ఆష్‌కు చెందిన లిటిల్ స్టూడియో స్పెయిన్ అంతర్యుద్ధ గీతాలు గానం చేశాడు. వీరి సహచర్యం జీవితాంతం సాగింది.

యుద్ధకాలంలో గూఢచారుల కన్ను

ఆ యుద్ధం నేపథ్యంలోనే అమెరికాలోని జపాన్ మూలాలు గలవారిని పంపించేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తే పీట్ సీగర్ దానిపై నిరసన లేఖ రాశాడు. ఆ విధంగా ఆయనపై గూఢచారి సంస్థ ఎఫ్‌బిఐ కన్ను పడింది. అప్పటికే ఆయన బాగా ప్రసిద్ధిలో ఉన్నాడు. 1940లోనే డైలీ వర్కర్ పత్రిక మేడే సందర్భంగా సభా కార్యక్రమం ప్రకటిస్తూ ఏప్రిల్ 30వ తేదీ సంచికలో పీట్ సీగర్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రకటించడం చూస్తాం. "మీరు పోరాటానికి సిద్ధంగా ఉన్నారా? అయితే ఈ సభకు రండి" అని ఆహ్వానించడం ఆసక్తి కలిగిస్తుంది. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో యూరప్ అమెరికాలలో రచయితలు, కళాకారులు వామపక్ష భావజాలంవైపు ఆకర్షితులై శాంతి సందేశం వినిపించడం, కార్మిక సంఘాల చొరవ పాలకులకు బొత్తిగా మింగుడు పడలేదు. మరోవైపున యుద్ధంలో పాల్గొనడం కోసం యువతను సామూహికంగా సైన్యంలో చేరుస్తున్నారు. ఆ కోవలో పీట్ సీగర్ బృందాన్ని సైనికులను ఉత్సాహపరిచడం కోసం తీసుకోవాలనుకున్నారు. అయితే ఆయన జపాన్ మూలాలు గల అమెరికన్లను పంపేయడంపై నిరసన లేఖ రాసిన సంగతి బయిటకు వచ్చింది. డైలీవర్కర్‌తో సహా అనేక పత్రికలలో తన గురించిన కథనాలూ వార్తలు ఉన్నాయని గూఢచారి వర్గాలు సమాచారమిచ్చాయి. జాతిద్వేషం కరుడుగట్టిన అమెరికా గూఢచారులు అతన్ని నీగ్రోహంతకుడుగా అభివర్ణించారు. సామాన్య ప్రజలను అమోఘంగా ఆకర్షించగల గాయకుడని నివేదించారు. కనెక్టికట్‌కూ హార్వర్డ్‌లలో ఆయన చదివిన స్కూళ్లకు కూడా వెళ్లి అప్పుడతని వేషభాషలు కార్యకలాపాలు ఎలా ఉండేవో విచారించారు. చిన్నప్పుడే సీగర్ విద్యార్థి సంఘ కార్యదర్శిగా పనిచేశారని తెలుసుకున్నారు. అప్పటికే అతనిపై విచారణ నివేదికలు అందాయి. ముందు ముందు ప్రభుత్వ వ్యతిరేక కుట్రదారుడుగా మారే ఆదర్శవాదిలా ఉన్నారని సీగర్‌ను అభివర్ణించారు. ఇన్ని ఫిర్యాదులున్నా తనను సైన్యంలోకి తీసుకున్నారు. 1942 నుంచి 1945వరకూవ అక్కడ వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వూడిగ్రాథీ తనకు తోడైనాడు. వూడీ గిటార్‌పైన 'ఇది ఫాసిస్టులను హతమారుస్తుంది' అని రాసివుండేదట. అప్పుడే సీగర్ బాబీ డైలాన్ నిర్వహించే న్యూపోర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొన్నాడు. 1943లో తోషి ఆలీన్ ఓహ్తాను పెళ్లి చేసుకున్నాడు. సైన్యం నుంచి వచ్చేశాక పీపుల్స్ సాంగ్స్ స్థాపించారు. అది దేశవ్యాపితంగా ఎంతో ప్రభావం చూపింది. యుద్ధకాలమంతా ఆయన కమ్యూనిస్టు భావజాలంతోనూ సోవియట్ యూనియన్ విధానాలతోనూ పనిచేశారు. 1948లో అధ్యక్ష ఎన్నికలలో ప్రోగ్రెసివ్ పార్టీ తరపున ఉపాధ్యక్షుడుగా పోటీ చేసిన హెన్రీ వ్యాలస్ తరపున ప్రచారం చేశారు. అప్పుడే మరో ప్రసిద్ధ ప్రజా గాయకుడైన పాల్‌రాబ్సన్‌తో కలసి పనిచేశాడు.



నిర్బంధంలోనూ ఆశయాలతో

1949లో న్యూయార్క్‌లో ప్రోగ్రెసివ్ సిటీస అండ్ కంట్రీ స్కూల్‌లో సంగీతం బోధించారు. 1950లో అమెరికాలో కమ్యూనిస్టులు నల్లజాతి ఉద్యమకారులపై ఘోరమైన వేట సాగింది. డేవిడ్ కార్గ్ అనే సిఐడి 1800 పేజీల రహస్య నివేదిక తయారు చేశారు. (ఇటీవలనే దాన్ని బహిర్గతం చేశారు. గాని 90 పేజీలు రహస్యంగానే అట్టిపెట్టారు.) ఆ వేట నుంచి తప్పించుకోవడం కోసం ఆల్మనాక్ సింగర్స్‌ను వీవర్స్‌గా మార్చారు. తంత్రి ఉన్నతవిద్యావేత్త గనక పీటర్ మరో పేరుతో కూడా ప్రదర్శనలిచ్చేవాడు. ఏదేమైనా ఇక భరించడం అనే పాట అప్పటిదే. అయితే అంతకుముందు పద్ధతులను పాటలను వేషాలను కూడా మార్చేశారు. ఆ కాలంలో ఆన్ టాప్ ఓల్డ్ స్మోకీ, గుడ్‌నైట్ ఇర్నే వంటి పాటలు రికార్డు సృష్టించాయి. 13వారాలు అగ్రస్థానంలో నిలిచాయట. పాప్ గాయకులంతా దాన్ని పాడటం మొదలెట్టారు. అయితే పైనే చెప్పినట్టు ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అది వరకూ వీరిని ఆదరించిన ప్రదర్శించిన టీవీ కేంద్రాలు ఇప్పుడు అవకాశమివ్వడం మానేవాయి. మెకార్తిజంగా పేరొందిన ఆ కాలంలోనూ పీట్ సీగర్ తన పోరాటం ప్రదర్శనలు మానలేదు. పైగా పౌరహక్కుల కోసం ప్రత్యేకంగా కేంద్రీకరించాల్సి వచ్చింది. 1955 ఆగస్టులో తనను అమెరికా వ్యతిరేక కార్యకలాపాల విచారణ కమిటీ పిలిపించింది. కమిటీ ముందు ఏమీ చెప్పడానికి ఆయన నిరాకరించారు. అమెరికాలో ప్రసిద్ధమైన ఫిఫ్త్ అమెండ్‌మెంట్ కింద తన సహచరుల కార్యకలాపాల వివరాలు చెప్పజాలనని ప్రకటించాడు. కమ్యూనిస్టు ఉద్యమంతో సంబంధాలపైనా సూటిగా జవాబివ్వలేదు. పార్లమెంటును ధిక్కరించారనే నేరంపై ఏడేండ్లు జైలుశిక్ష విధించారు గాని న్యాయపోరాటంతో ఏడాడిలోనే తిరిగివచ్చారు.

కడదాకా అదే బాట

తర్వాత దశలో పీట్‌సీగర్ జీవితమంతా ప్రజలతోనూ వారిని ఉత్తేజ పరిచే పాటలతోనూ సాగింది. 1960లో శాండియాగోస్కూలు బోర్డు ఉత్సవంలో పాడటానికి తన కమ్యూనిస్టు భావాలు పాడబోనని ప్రమాణం చేయమంటే నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. పౌరహక్కుల సంఘం కోర్టు ఉత్తర్వు తేవడంతో ఆ కార్యక్రమం యథాతథంగా సాగింది. యాభై ఏండ్ల తర్వాత 2009లో ఈ ఘటనకు గాను ఆ స్కూలు ఆయనకు క్షమాపణ చెప్పింది. అయితే ఈ అగ్నిపరీక్షా కాలంలో జీవితం కోసం స్కూళ్లలోనూ వేసవి శిబిరాల్లోనూ తను సంగీతబోధకుడుగా పనిచేశారు. 50, 60 దశాబ్దాల్లో పీట్ సీగర్ యుద్ధ వ్యతిరేక గీతాలు మార్మోగాయి. వేర్ హావ్ ఆల్ ఫ్లవర్స్‌గాన్, టర్న్ టర్న్ టర్న్, లాస్ట్‌నైట్ ఐ హాడ్ ది స్ట్రేంజెస్ట్ డ్రీమ్ వంటివి గొప్పపేరు తెచ్చాయి. 1963లో నల్లజాతి వీరుడు మార్టిన్ లూథర్ కింగ్‌తో కలసి వాషింగ్టన్‌లో మహాప్రస్థానంలో ఆయన పాల్గొన్నారు. అప్పుడే వుయ్‌షల్ ఓవర్‌కమ్ అనే గీతాన్ని కాస్త సవరణలతో పాడి ప్రఖ్యాతిలోకి తెచ్చారు. ఇప్పుడు అంతర్జాతీయ మానవహక్కుల గీతంగా ఉంది. పోలీసు వేట నిర్బంధం కాస్త తగ్గగానే ఆయన రేడియోలు టీవీ స్టేషన్లలో జానపదగీతాలు ఇతర పాటలు నేర్పడం మొదలెట్టాడు. ఓ సందర్భంలో 39గంటల పాటు కార్యక్రమం నిర్వహించాడు. వియత్నాం యుద్ధ వ్యతిరేక పోరాట తూటాగా మారాడు. 1972లో ఉత్తర వియత్నాం సందర్శించాడు, మరణశిక్షను నిరసిస్తూ 1979లో డెల్బర్ట్ తెగకు చెందిన ఖైదీని ఉద్దేశించి డెల్బర్ట్‌టిబ్స్ పాట రాసి పాడాడు. 1980, 90దశకాలలో ఈ కృషి కొనసాగింది. అన్ని రకాల ప్రజాపోరాటాలకు ఉద్యమాలకు తోడు నిలిచారు. చివరి దశలో పర్యావరణంపై ఎక్కువ కృషి చేశారు. దిస్ ల్యాండ్ మైల్యాండ్ అన్న పాట అందులో ఒకటి.

2012లో ఆక్యుపై వాల్‌స్ట్రీట్ ఉద్యమం లోనూ పాల్గొని పాడాడంటే ఆయన చైతన్యం శక్తి అర్థమవుతాయి. తన తొలినాటి సహచరుడైన గాయకుడు బాబీ డైలాన్‌కు నివాళులర్పిస్తూ 2012లో ఫార్ ఎవర్ యంగ్ గీతం ఆలపించారు. ఆయన రచనలు పాటల ఆల్బంలు విపరీతంగా ప్రచారంలోకి వచ్చాయి. అత్యంత ఉత్తేజ కరమైన కళాత్మకమైన ఆయన జీవితంలో చెప్పుకోదగిన ఘట్టాలు, సృజనాత్మక విజయాలు, ధిక్కార గాథలు లెక్కలేనన్ని. ఈ శతజయంతి సందర్భంలో వాటిని తల్చుకోవడం ప్రపంచ వ్యాపితంగా ప్రగతిశీల వాదుల ముఖ్యంగా కళాకారుల కర్తవ్యం. ఇంత మహత్తర సంపూర్ణ జీవితం గడిపిన పీటర్ సీగర్ 2014 జనవరి 27న కన్నుమూశారు. అయితే ఆయన జీవితమూ కృషి మాత్రం వుయ్ షల్ ఓవర్ కం అనే ఆయన గీతం ప్రతి పాఠశాలలో వినిపిస్తూనే ఉంది.

(నేడు పీట్ సీగర్ శతజయంతి)

కాసిని కబుర్లు చెప్పకుందాం రండి

రండి... ఇలా
అందరం కూర్చొని
కాసిని కబుర్లు చెప్పకుందాం...
జ్ఞాపకాల్ని నెమరువేసుకొందాం..!!

కులాల్ని వదలి... మతాలను విడిచి...
ఆస్తి అంతస్తులను దూరంగానెట్టి...
ఆత్మీయతతో అల్లుకుపోదాం...
ఒకొక్కరి జీవన స్థితిగతులను చెప్పకుందాం...
మనసులోని మర్మాలను
బయటపెట్టుకుందాం
రండి... ఇలా
అందరం కూర్చొని



కాసిని కబుర్లు చెప్పకుందాం...

రేపటి భవిష్యత్తు గురించి
చర్చించుకుందాం..!!
ఒకరికొకరం బతుకుమీద
భరోసా కల్పించుకుకొని...
ఒకరికోసం మరొకరం కలిసి
జీవించేదారిని వెతుక్కుందాం..!!
మానవ సంబంధాల్ని...
శాశ్వతమైన విశ్వాసాన్ని నిలుపుకొందాం...
రండి... ఇలా
అందరం కూర్చొని
కాసిని కబుర్లు చెప్పకుందాం...

- అనంతోజు మోహన్ కృష్ణ
సెల్:8897765417

నిమ్మతో శుభ్రం...



ఇల్లు, దుస్తులు, వంట పాత్రలు.. ఒక్కోదాని శుభ్రతకు ఒక్కోటి వాడుతుంటాం. క్లీనర్లు వగైరా ఒక్కోసారి అయిపో తుంటాయి. అప్పుడు నిమ్మ ప్రయత్నించి చూడండి. పైగా రసాయనాల బెడదా ఉండదు.

❍ కిటికీలు, గాజు ఉపరితలాలు మిలమిలా మెరవాలని స్ప్రేలు వాడుతుంటాం కదా! కప్పు గోరువెచ్చని నీటికి వైట్ వెనిగర్ ఒక స్పూను, అర చెక్క నిమ్మరసం కలిపి దాంతో తుడిచి చూడండి.. సులువుగా శుభ్రపడతాయి, సూక్ష్మజీవులూ పోతాయి.

❍ కడగాల్సిన వంటపాత్రలు సింకులో ఎక్కువ సేపు ఉంచితే దుర్వాసన ప్రారంభమవుతుంది. పాత్రలు కడిగేసినా ఆ వాసన మాత్రం కొద్దిసేపు అలానే ఉంటుంది. అలాంటప్పుడు రసం తీసిన నిమ్మ చెక్కలు ముక్కలుగా కోయాలి. వాటిలో కొద్దిగా వంటసోడా కలిపి సింకులో వేయండి. తర్వాత కొద్దిసేపు నీటిని తిప్పితే సరి. వాసన త్వరగా వదులుతుంది. తర్వాత ఆ ముక్కల్ని తీసేస్తే చాలు.

❍ దిండు కవర్లు తలలోని నూనెలు, క్రీములు పీల్చుకొని మాసినట్లుగా కనిపిస్తుంటాయి. వదలగొట్టడం ఇబ్బందిగా ఉందా? నిమ్మ చెక్కతో ఆ ప్రాంతంలో రుద్దండి. తర్వాత గోరువెచ్చని నీటిలో వెనిగర్ వేసి, కాసేపు నానబెట్టి, ఆపై ఉతికేయండి. మరీ మొండివైతే మరోసారి ప్రయత్నించండి. మరకలు వదలడమే కాదు.. మెరుపూ వస్తుంది.

❍ ట్యాపులు నీళ్ల, సబ్బు మరకలతో నిర్జీవంగా కనిపిస్తున్నాయా? నిమ్మ చెక్కతో రుద్ది కాసేపు వదిలేయండి. తర్వాత నీటితో కడిగేస్తే శుభ్రంగా కనిపిస్తాయి. మరీ మొండిగా తయారైతే కాస్త బేకింగ్ సోడాలో అద్ది రుద్ది చూడండి. కాపర్, ఇత్తడి పాత్రలు త్వరగా నలుపెక్కుతుంటాయి. అప్పుడు నిమ్మచెక్కకు కళ్లుప్పు అద్ది రుద్దితే తళతళ మెరుస్తాయి.

కళ తగ్గుతుందా..?

ఎంత జాగ్రత్త తీసుకున్నా చర్మం పొడిబారటం, గరుకుచర్మం వంటి సమస్యలు ముఖంలో కళ లేకుండా చేస్తుంటాయి. అలాంటప్పుడు ఫేషియల్ ఆయిల్‌తో మర్దనా చేస్తే బోలెడన్ని ప్రయోజనాలు..



❍ ఫేషియల్ ఆయిల్స్‌లోని ఫ్యాటీ యాసిడ్స్ చర్మం మృదువుగా ఉండేందుకు దోహదపడతాయి. ముఖ్యంగా పొడి చర్మం ఉన్న వారిలో తేమను పదిలపరచి పొడిబారకుండా చేస్తుంది.

❍ వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మం పాడవకుండా చేస్తాయి. ముడతలు, మచ్చలు లేకుండా లేకుండా చేయటమే కాదు వృద్ధాప్య ఛాయలు కూడా రాకుండా చేస్తాయి.

❍ ఫేషియల్ ఆయిల్‌ని మేకప్ వేసుకునే ముందు ప్రైమర్‌లా కూడా రాసుకోవచ్చు. తర్వాత మేకప్ వేసుకుంటే మనం వాడే ఇతర సౌందర్య ఉత్పత్తులు చర్మంలోకి చొచ్చుకుపోయేలా చేసి మంచి ఫలితం వచ్చేలా చేస్తుంది. ఈ నూనెలు చర్మాన్ని నునుపుగా చేసి మోము కాంతులీనేలా చేయగలవు.

వివక్షపై అక్షర పోరాటం

పెండ్లి తర్వాత చాలా మంది ఇక తమ ఆశలు, ఆశయాలు, కోర్కెలు వదిలేసుకుంటారు. కుటుంబమే జీవితంగా బతికేస్తారు. తమకంటూ సొంత ఆలోచనలు కోల్పోతారు. కానీ కొందరు మాత్రం ఎన్ని బాధ్యతలు వచ్చి పడినా తామేంటో నిరూపించుకోవాలని తపిస్తారు. దాని కోసం నిరంతరం శ్రమిస్తారు. తమకంటూ సమాజంలో ఓ గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వారిలో ఎమ్మె.రాజమల్లమ్మ ఒకరు. కుటుంబం అండగా నిలబడితే మహిళలు విజయాలు సాధించడం పెద్ద కష్టమేమి కాదని నిరూపించిన ఆమె పరిచయం నేటి మానవిలో...



మాది మాడుగుల గ్రామం, రంగారెడ్డి జిల్లా (పాత పాలమూరు). నా అమ్మానాన్నలు ఎమ్మె. బాలమ్మ, ఎమ్మె. రాములు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. మాది వ్యవసాయ కూలీ కుటుంబం. మా అమ్మానాన్నలు కొద్ది పాటి భూమిలో వ్యవసాయం చేసేవారు. దానిపై వచ్చే ఆదాయం సరిపోక కూలి పనులు కూడా చేసేవారు. ఎంతో కష్టపడి నన్నూ నా ఇద్దరు తమ్ముళ్లను చదివించారు. మగపిల్లలతో పాటు నన్ను చదివిస్తుంటే చాలా మంది అమ్మ నాన్నలను 'ఆడపిల్లకు ఇంటి పని, పొలంపని నేర్పించకుండ ఎచ్చులకు చదువు నేర్పిస్తున్నారు' అని అనేవారు. అయినా వాళ్ళ మాటను మా అమ్మా నాన్నలు పట్టించుకోలేదు. మా ముగ్గురిని సమానంగా పెంచారు.

కుటుంబ బాధ్యతలు మోస్తూ...


ఒకటో తరగతి నుండి 10వ తరగతి వరకు మాసొంత ఊరు మాడుగులలో చదువుకున్నాను. హైదరాబాద్‌లోని మహబూబియా కళాశాలలో ఇంటర్, ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో డిగ్రీ, కోఠి మహిళా కళాశాలలో పీజీ, ఆంధ్ర మహిళా సభలో టి.పి.టి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "పాలమూరు జిల్లా తీర్థ క్షేత్ర సాహిత్యం - సమగ్ర పరిశీలన" అనే సిద్ధాంత వ్యాసం సమర్పించి పీహెచ్‌డి పట్టాన్నీ పొందాను. అయితే నాకు 9వ తరగతిలో పెండ్లి చేశారు. అయినా జీవన పోరాటం చేస్తూనే పీహెచ్ డీ పూర్తిచేశాను. మా భర్త బీరయ్య, లాబ్ టెక్నీషియన్. మాకు ఇద్దరు పిల్లలు. పిల్లలను కొన్ని రోజులు మా అమ్మానాన్నలు చూసుకున్నారు. తర్వాత ఇంటి పక్కన వాళ్ళు చూసుకునేవారు. సాయంత్రం వచ్చిన తర్వాత మావారు చూసుకునేవారు. ఇలా కుటుంబ బాధ్యతలు మోస్తూ, పిల్లల్ని చూసుకుంటూ చదువుకున్నాను. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అప్పుడప్పుడు పత్రికలకు వ్యాసాలు, కవితలు రాస్తుంటాను. వివిధ కవి సమ్మేళనాలలో పాల్గొని కవితా గానం చేస్తుంటాను.

స్నేహంపై మొదటి కవిత

ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు మొట్టమొదటి సారిగా స్నేహంపై కవిత రాశాను. అది అప్పటి మా తెలుగు మాస్టారుకు చూపించాను. ఆయన బాగుందని మెచ్చుకున్నారు. ఇక అప్పటి నుండి ఆయన ప్రోత్సాహంతో రాయడం మొదలు పెట్టాను. 2005లో వందేమాతరం శతజయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ సాహిత్య పరిషత్ వారు నిర్వహించిన కవిసమ్మేలనంలో మొట్ట మొదటి సారిగా 'స్వాతంత్ర్యం అంటే' అనే కవిత రాసి చదివాను. పాలమూరులో, హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కవిసమ్మేళనంలో పాల్గొన్నాను. ఆ తర్వాత గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వారు నిర్వహించిన గాంధీ విశ్వకవి సమ్మేళనం, జల పరిరక్షణ కవితోత్సవం, ఆజాదికా అమృతోత్సవం, శ్రీ విశ్వభారతి వారి ఉగాది కవిసమ్మేళనం మొదలైన కవిసమ్మేళనాలలో పాల్గొని కవితా గానం చేశాను.

అమ్మ మనసు...

జాతీయ సాహిత్య సదస్సులలో పాల్గొని పరిశోధన పత్ర సమర్పణలు చేశాను. నన్ను తెలుగు సాహిత్యపై మక్కువ కలిగేలా చేసి వ్యాస, కవితా, పద్య రచన మెళకువలు నేర్పించిన నా గురువు, అభిమాన కవి ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి. నామొదటి పుస్తకం 'అమ్మ మనసు' వ్యాస సంకలనం ఆయనకే అంకితంగా ఇచ్చాను. నా పరిశోధన సిద్ధాంత వ్యాసం 'పాలమూరు జిల్లా తీర్థ క్షేత్రాల సాహిత్యం - సమగ్ర పరిశీలన' తెలుగు విశ్వ విద్యాలయం వారి ఆర్థిక సహాయంతో ముద్రించాను. అది నా అమ్మానాన్నలకు అంకితం ఇచ్చాను. ఆచార్య ఎన్. గోపి సార్ ప్రోత్సాహంతో వారు ప్రవేశ పెట్టిన నానీల ప్రక్రియలో 'నానీల మాణిక్యాలు' (అముద్రితం) అనే నానీలను రాశాను. 2017 తెలుగు మహసభల సందర్భంగా తెలుగు అకాడమీ వారి పిలుపు మేరకు 'గంగాపురం హనుమచ్ఛర్మ' మోనో గ్రాఫ్ రాశాను.



నాకు 9వ తరగతిలో పెండ్లి చేశారు. అయినా జీవన పోరాటం చేస్తూనే పీహెచ్ డీ పూర్తి చేశాను. మా భర్త బీరయ్య, లాబ్ టెక్నీషియన్. మాకు ఇద్దరు పిల్లలు. పిల్లలను కొన్ని రోజులు మా అమ్మానాన్నలు చూసుకున్నారు. తర్వాత ఇంటి పక్కన వాళ్ళు చూసుకునేవారు. సాయంత్రం వచ్చిన తర్వాత మావారు చూసుకునేవారు. ఇలా కుటుంబ బాధ్యతలు మోస్తూ, పిల్లల్ని చూసుకుంటూ చదువుకున్నాను.

ఎక్కడ అన్యాయం జరిగినా...

'బంగారు తెలంగాణ భవ్య వాణి' అనే ఆటవెలది శతకం(అముద్రితం) రాశాను. డా.భీంపల్లి శ్రీకాంత్ ప్రవేశ పెట్టిన 'మొగ్గలు', వడిచర్ల సత్యం ప్రవేశ పెట్టిన 'మణిపూసలు' రాశాను. అలాగే మరికొన్ని నూతన ప్రక్రియల్లో కూడా కవితలు రాశాను. నేను ఏది రాసినా, ఏమి చేసినా నాకు జన్మ నిచ్చినా తల్లి దండ్రులు, ఓనమాల నుండి సాహిత్య పాఠాలు, జీవిత పాఠాలు నేర్పిన గురువుల ప్రోత్సాహం మాత్రమే. ఎక్కడ అన్యాయం జరిగినా నా అక్షరాలతో ప్రశ్నిస్తాను. ఏదో ఒక ప్రక్రియలో నేను చెప్పాలనుకున్నది చెప్తాను. కుల వివక్ష, మహిళల పట్ల జరిగిన అన్యాయం, కులదురహంకార హత్యలపైన ఓ రచయిత్రిగా కచ్చితంగా నా కలాన్ని కదిలిస్తాను.



'ఫ్రీ' సిలిండర్లు కర్నాటకలోనేనా.. తెలంగాణలో ఇవ్వరా?

నవతెలంగాణ - సిరిసిల్ల/ ఎల్లారెడ్డిపేట

"ఉచిత పథకాలపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు.. కర్నాటక రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం పాలు, పెరుగు, గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని హామీలివ్వడం విడ్డూరంగా ఉంది.. ఉచిత సిలిండర్లు తెలంగాణలో ఇవ్వరా.. మోడీ కర్నాటకకు మాత్రమే ప్రధానా?.." అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పలు మండలాల్లో పర్యటించిన మంత్రి కేటీఆర్.. క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశంలో మంత్రి మాట్లాడారు. అకాల వర్షాలకు నష్టపోయిన అన్నదాతల కష్టాలు, పరిస్థితులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎంతో కలచివేశాయని, ఐదు జిల్లాల్లో పరిస్థితులను సీఎం స్వయంగా పరిశీలించారని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 33నుంచి 50శాతం వరకు వడగండ్ల వానకు ధాన్యం చేనుల్లోనే రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 19వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారుల నివేదికలు తెలుపుతున్నాయన్నారు. తడిసిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటికే మంత్రి గంగుల కమలాకర్‌తో చర్చించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు భరోసాగా నిలుస్తూ ఎకరాకు రూ.10వేల పరిహారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

కర్నాటక రాష్ట్ర ఎన్నికలపై స్పందించిన మంత్రి కేటీఆర్.. మొన్నటివరకు ఉచిత పథకాలు మంచివి కాదన్న మోడీ,, ఓట్ల కోసం కర్నాటక రాష్ట్రంలో ఏడాదికి మూడు సిలిండర్లు ఫ్రీ, పాలు ఫ్రీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. మోడీ కర్నాటక రాష్ట్రానికి మాత్రమే ప్రధానా..? దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎందుకని ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వరు? తెలంగాణ రాష్ట్రానికి ఎందుకు ఫ్రీ సిలిండర్లు ఇవ్వరు? అని ప్రశ్నించారు. మిగతా రాష్ట్రాల్లో ఎన్నికలు లేవని పట్టించుకోవడం లేదా అని ప్రశ్నించారు. రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200కు పెంచిన మోడీ సర్కారు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే నష్టపరిహారం అయిపోదన్నారు. అదానీ కొనే ఎయిర్‌పోర్టుపై జీఎస్టీ వేయకుండా సామాన్యుడు వాడే మందులు, పాలు, పెరుగు, ఇతర నిత్యావసరాలపై జీఎస్టీ వేసిన ఖరీదైన ప్రధాని మోడీకి రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్రావు, పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

మంత్రి కేటీఆర్ వెళ్లే దారిలో.. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలతో నిరసన తెలపగా.. పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి సమస్యను వినకపోవడం సరికాదని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.25వేల చొప్పున నష్టపరిహరం ఇవ్వాలని నినాదాలు చేశారు.

ఏప్రిల్‌లో 8 శాతానికి పెరిగిన నిరుద్యోగిత రేటు

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ నోటిమాటగానే మిగిలిపోయింది తప్ప.. ఆచరణలో అమలుకాలేదు. రెండోవిడత ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత తాత్కాలికంగా అగ్నిపథ్ స్కీమ్ కింద కొన్ని ఉద్యోగ నియామకాలకు ఆదేశాలు జారీచేసినా.. అవి కూడా పూర్తి స్థాయిలో యువతకు ఉద్యోగాల్ని కల్పించలేదు. ఒకపక్క దేశ జనాభాలో ప్రపంచవ్యాప్తంగా నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన భారత్... ఉపాధి కల్పనలో మాత్రం మిగతా దేశాలతో పోటీపడలేకపోతోంది. ఈ ఏడాది మార్చిలో దేశవ్యాప్తంగా నిరుద్యోగిత రేటు 7.8గా ఉంది. ఇక ఏప్రిల్ నెలకు 8.11 శాతానికి నిరుద్యోగిత రేటు పెరిగింది. అదే సమయంలో మార్చిలో 8.51 శాతంగా పట్టణ నిరుద్యోగ రేటు ఏప్రిల్‌కి 9.81 శాతానికి పెరిగింది. అయితే గ్రామీణ నిరుద్యోగం మాత్రం స్వల్పంగా తగ్గింది. మార్చిలో 7.47గా ఉన్న నిరుద్యోగ రేటు ఏప్రిల్ నెలకు 7.34 శాతం నమోదైనట్టు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియా ఎకనామీ పరిశోధనా సంస్థ వెల్లడించిన తాజా సమాచారం తెలిపింది.

2 వేల పడకల నిమ్స్‌కు త్వరలో భూమిపూజ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ ఆస్పత్రి విస్తరణలో భాగంగా నిర్మించబోతున్న రెండు వేల పడకల నూతన నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా త్వరలో భూమి పూజ చేసుకోబోతున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. దీనికి సంబంధించి త్వరగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం మూడు బ్లాకుల్లో ఓపీ, ఐపీ, ఎమర్జెన్సీ సేవలు అందించే విధంగా ఉండే ఈ నూతన నిర్మాణానికి అవసరమైన అన్ని విభాగాల అనుమతులు పూర్తి చేసుకునీ, నిర్మాణం మొదలు పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉన్నతాధికారులతో తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ ఈ నిర్మాణం పూర్తయితే పడకల సంఖ్య 3,500కు చేరుతుందనీ, నిమ్స్‌లో ఇటీవల ప్రారంభించిన మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ (ఎంసీహెచ్) నిర్మాణం పూర్తయితే 3,700కు చేరుతాయని తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో నిర్మిస్తున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇది ప్రారంభిస్తే దేశంలోనే తొలి సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ తెలంగాణలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గాంధీలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ సంతాన సాఫల్య కేంద్రాన్ని, స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. బ్రెయిన్‌డెడ్ డిక్లరేషన్లు జరిపి, అవసరమైన వారికి అవయవాలు అందించి పునర్జన్మ పొందేలా చూడాలన్నారు.

కేంద్రం వ్యాక్సిన్లు సరఫరా చేయకున్నా...

రాష్ట్ర ప్రజల అవసరాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్లు సరఫరా చేయకున్నా, రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కొవిడ్ సహ అన్ని రకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉండేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్టాఫ్ నర్స్ పరీక్ష ఆన్ లైన్ ద్వారా....

వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో భర్తీ చేసే 5,204 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ల తుది ఫలితాలు విడుదల కంటే ముందే, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

రెండు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాఫ్ నర్స్ పరీక్షల కోసం ఇప్పటి వరకు 40,936 మంది దరఖాస్తు చేసుకోగా, హైదరాబాద్‌తో పాటు, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు అధికారులు మంత్రికి తెలిపారు.

ప్రతి రోజు రెండు గంటలు రౌండ్స్....

ఆస్పత్రుల డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు ప్రతి రోజు రెండు గంటల పాటు ఆయా ఆస్పత్రుల్లో రౌండ్స్ వేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఇలా రౌండ్స్ వేసి అన్ని విభాగాలు సందర్శిస్తే మెజార్టీ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాచ్చి, డీఎంఈ డాక్టర్ కె.రమేష్ రెడ్డి, డీహెచ్ డాక్టర్ జి.శ్రీనివాస రావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ గంగాధర్, నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ బీరప్ప, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వాన్ని అనుమతించం

(మొదటిపేజీ తరువాయి)

మార్పు కనిపించడం లేదు. కాబట్టి ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో ఆలోచిస్తాం.

కేరళపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. గతంలో ప్రధాని మోడీ కేరళను సోమాలియాతో పోల్చారు. ఇటీవల రోడ్ షో కూడా నిర్వహించారు. బీజేపీకి మంచి అవకాశం ఉందని భావిస్తున్నారా?

కేరళలో అధికార పార్టీగా ఎదగడానికి బీజేపీ కొన్ని వ్యూహాత్మక మార్గాలను అనుసరిస్తున్నది. కానీ, కేరళకు తనదైన ప్రత్యేకత ఉంది. అందుకే మలయాళీలు బీజేపీ సిద్ధాంతాన్ని స్వాగతించరు. ఈ విషయాన్ని బీజేపీ కూడా అర్థం చేసుకుంది. వారు ఇప్పటికే చాలా ప్రయత్నించారు. కానీ కేరళలో ప్రవేశించలేకపోయారు. కనుక ఇప్పుడు తమ ప్రయత్నాలను మైనార్టీ వర్గంపై కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే మనమందరం గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం కనుసన్నల్లో బీజేపీ పని చేస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ విధానాలనే బీజేపీ అమలు చేస్తున్నది. అనేక రాష్ట్రాల్లో మైనార్టీలు దాడులను ఎదుర్కొంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ దాడులు పెరిగాయి. అక్కడ మైనార్టీలను ఎలా చూస్తారో అందరికీ తెలిసిందే. అది ఆర్‌ఎస్‌ఎస్ భావాజాలాన్ని అమలు చేయడంలో భాగం. దీన్ని కేరళ వ్యతిరేకిస్తుంది. కేరళలో ఏ మైనార్టీ వర్గం కూడా అభద్రతగా భావించడం లేదు.

సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్షాలు దీన్ని ఎలా ఎదుర్కోవాలి? కేరళలో బీజేపీ దాడిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నారు?

ప్రత్యేక ప్రణాళిక అవసరం లేదు. ఎందుకంటే మేము చాలా కాలంగా అనుసరిస్తున్న విధానం ఉంది. ఆ విధానం, వైఖరి కారణంగానే కేరళ వేరుగా నిలుస్తోంది. కేరళలో వామపక్షాల బలం అదే. అదే కేరళలో లౌకికవాదానానికి అతిపెద్ద హామీ. వామపక్షాలను బలహీనపరిచేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఇంతకు ముందు కూడా చేశారు. కానీ అది అంత సులభం కాదు. సెక్యులరిజాన్ని కాపాడతామని ప్రజలకు తెలుసు. ప్రజలు ఎలాంటి మతతత్వ ఎజెండాలోకి వెళ్లరు.

కేరళలో కాంగ్రెస్‌కు బీజేపీతో పోరాడే సత్తా ఉందని భావిస్తున్నారా?

కేరళలో బీజేపీతో కాంగ్రెస్ కలిసి ఉంది. ఎల్‌డీఎఫ్‌ను ఎదుర్కోవడానికి బీజేపీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటున్నదని కేరళను గమనిస్తున్న వారికి తెలుస్తుంది. జాతీయ పరిస్థితులతో పోల్చినప్పుడు కేరళలో కాంగ్రెస్, యూడీఎఫ్‌లు బీజేపీతో కలిసి పని చేస్తున్నాయి. ఇది నిజానికి కాంగ్రెస్ జాతీయ వైఖరికి విరుద్ధం. కేరళలోని లౌకిక భావాజాలం గల ప్రజలు బీజేపీని కాంగ్రెస్ ఎదుర్కోగలదని భావించడం లేదు.

లోక్‌సభ ఎన్నికలకు ఏడాది సమయం ఉంది. ప్రతిపక్షాల ఐక్యతపై మీరేమంటారు?

జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యత అంటే ఏమిటీ? జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యత అనేది ఉమ్మడి అభ్యర్థిని కలిగి ఉండటమే కాదు. బీజేపీని ఓడించేందుకు ఏకం కావడమే. బీజేపీని ఓడించేందుకు రాష్ట్ర స్థాయిల్లో వ్యూహం రచించాలని సీపీఐ(ఎం) భావిస్తున్నది. ఇందుకు భావసారూప్యత గల పార్టీలు సహకరించాలి. కేరళ విషయానికి వస్తే బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకునే అవకాశం లేదు. కాబట్టి కేరళలో ఉమ్మడి అభ్యర్థి అనే ప్రశ్నే తలెత్తదు.

మిగిలిన మీ మూడేళ్లలో మీ ఎజెండాలో ఏముంది?

రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఈ మూడేండ్లు మాత్రమే కాదు, రాబోయే పదేండ్లు, 25 ఏండ్లకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా కేరళను ఎలా తీర్చిదిద్దగలం? ఇందుకోసం అన్ని మూలలను తాకే అభివృద్ధి కావాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలి. వీటితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కూడా కావాలి.

లవ్ జిహాద్ సిద్ధాంతం గురించి చెప్పే వివాదాస్పద కేరళ స్టోరీ చిత్రంపై ఏం చర్యలు ఆలోచిస్తున్నారు?

ఈ చిత్రానికి వాస్తవాలతో సంబంధం లేదు. ఇది పూర్తిగా చెత్త చిత్రం. లవ్ జిహాద్ అంశాన్ని సుప్రీంకోర్టు స్వయంగా పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సిద్ధాంతాన్ని కొట్టిపారేసింది. లవ్ జిహాద్ లేదని స్వయంగా కేంద్ర మంత్రి పార్లమెంట్‌లో చెప్పారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించటమే లక్ష్యంగా ఈ సినిమా తెరకెక్కుతున్నది. సమాజాన్ని వర్గీకరించడమే దీని లక్ష్యం. ఫిర్యాదులు లేకపోయినా విద్వేషపూరిత ప్రసంగాలపై కేసులు నమోదు చేయాలని సుప్రీం కోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించింది. ఈ ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని మేం చట్టబద్ధంగా ఏం చేయాలో అన్వేషిస్తాం.

రేపు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

12న నిర్మాణ పనులను పరిశీలించిన కేసీఆర్, పనుల పురోగతిని సమీక్షించారు. 1,100 చదరపు మీటర్లలో మూడు అంతస్తుల భవనం నిర్మించారు. మూడు అంతస్తుల భవనంలో 14 రూమ్‌లు, కాన్ఫరెన్స్ హాల్, లైబ్రరీ, ఆడియో విజువల్ థియేటర్ ఉంటాయి. బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తుది పనులను రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ తో కలిసి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు.

రాహుల్‌కు మళ్లీ నిరాశే

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థించారు. రాహుల్ పిటిషన్‌పై వెంటనే విచారణ జరపాలని, తాత్కాలిక లేదా తుది ఆదేశాలు జారీ చేయాలని ఆయన తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోరారు. అయితే ఈ దశలో తాత్కాలిక రక్షణ ఇవ్వలేమని కోర్టు స్పష్టం చేసింది. రికార్డులు, కోర్టు ప్రొసీడింగ్స్‌ను పరిశీలించిన తర్వాతే తుది ఆదేశాలు జారీ చేస్తానని జస్టిస్ ప్రచాక్ తెలిపారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 3న కోర్టు తిరిగి ప్రారంభమైనప్పుడు పిటిషన్‌ను విచారిస్తానని చెప్పారు. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు రెండేండ్లు జైలు శిక్ష విధించగా ఆయన దానిని సూరత్ సెషన్స్ కోర్టులో సవాలు చేసిన విషయం తెలిసిందే. అయితే అక్కడ కూడా ఆయనకు నిరాశ తప్పలేదు. దీంతో రాహుల్ హైకోర్టును ఆశ్రయించారు.

పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ అబ్జర్వర్లు

(మొదటిపేజీ తరువాయి)

విడతల్లో పరీక్షలుంటాయని, ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటలకు నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్‌పై ఉన్న నియమ, నిబంధనలు పాటించాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగితే వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే పారదర్శకంగా, పటిష్టంగా ఈ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. ఎంసెట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సజావుగా జరుపుతామని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేక బస్సులను నడపాలంటూ ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సంప్రదించామని చెప్పారు. ఈనెల 20న ఒకేవిడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈసెట్ రాతపరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 18న ఎడ్‌సెట్, ఈనెల 25న లాసెట్ రాతపరీక్షలను ఒకేరోజు మూడు విడతల్లో నిర్వహిస్తామన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలు పెరగడం, ఇంజినీరింగ్, నర్సింగ్ కోర్సుల్లో చదవాలన్న కోరికతోనే ఎక్కువ మంది అభ్యర్థులు ఎంసెట్‌కు దరఖాస్తు చేశారని విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహ్మారెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఎంసెట్ కన్వీనర్ డీన్ కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ శ్రీరాంవెంకటేశ్, లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కోకన్వీనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశపరీక్షల దరఖాస్తుల వివరాలు

సెట్	పరీక్ష తేది	దరఖాస్తులు
ఎంసెట్	మే 10,11 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ	3,20,587
	మే 12,13,14 తేదీల్లో ఇంజనీరింగ్	
ఎడ్‌సెట్	మే 18న	29,390
ఈసెట్	మే 20న	21,586
లాసెట్	మే 25న	41,439
ఐసెట్	మే 26,27 తేదీల్లో	43,242
పీజీఈసెట్	మే 29 నుంచి జూన్ 1 వరకు	13,636

పార్కు ప్రహరీ గోడ పనుల పరిశీలన



నవతెలంగాణ- వనస్థలిపురం

బీ.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో నిర్మిస్తున్న పార్కు ప్రహరీ గోడ పనులను మంగళవారం డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జీహెచ్ఎంసీ డీఈ దామోదర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కట్టడాల్లో ఎలాంటి లోపం ఉన్నా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డీఈని కోరారు. కార్యక్రమంలో అనంత వేణి కాలనీ ప్రధాన కార్యదర్శి బాలనరసింహ, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో

మారిన అన్ని పోలీస్ శాఖ అధికారుల నెంబర్లు

నవతెలంగాణ- వనస్థలిపురం

డీజీపీ అంజనీ కుమార్ ఆదేశాల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉన్న అన్ని పోలీస్ శాఖ అధికారుల నెంబర్లు మారాయి. అధికారుల ఫోన్ నెంబర్లు బీఎస్ఎన్ఎల్ అనుసంధానంలో కొనసాగా..ప్రస్తుతం ఎయిర్టెల్‌లోకి మారారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ జలంధర్ రెడ్డి ఫోన్ నెంబర్ 8712662300, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ 8712596938, ఎస్ఐ సిహెచ్. వెంకటేశ్వర్లు 8712580083, ఎస్ఐ కే. వెంకటరెడ్డి 9052527453, ఎస్ఐ బి.పరమేష్ 8712580048, ఎస్ఐ వి.రవి 8712580137, ఎస్ఐ ఏ.మాధవరెడ్డి 8712580022, ఎస్ఐ జగన్ 8712579988, ఎస్ఐ కే. స్వామి 8712580223 ఫోన్ నెంబర్లలో ఈ అధికారులు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు.

ఏసీబీ వలలో అవినీతి అధికారి

- లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన బోడుప్పల్ విద్యుత్ ఏఈ ప్రసాద్ బాబు
- సహకరించిన లైన్‌మెన్‌తో పాటు మరొకరి అరెస్ట్



నవతెలంగాణ-బోడుప్పల్

విద్యుత్ శాఖ నుంచి ప్యానల్ బోర్డు కాంట్రాక్టర్‌కు లైసెన్స్ జారీ చేసే నిమిత్తం పదివేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏఈ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఈ సంఘటన బోడుప్పల్ విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం జరిగింది. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం నవీన్ కుమార్ అనే వ్యక్తి ప్యానల్ బోర్డు కాంట్రాక్ట్ లైసెన్స్ నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అవసరమైన ఎస్టిమెట్ తయారుచేసి దరఖాస్తును ఫార్వర్డ్ చేసేందుకు ఏఈ ప్రసాద్ బాబు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారన్నారు. ఏఈ అడిగిన మొత్తాన్ని ఇచ్చేందుకు నవీన్ కుమార్ మంగళవారం ఉదయం ఏఈ కార్యాలయానికి వచ్చి ఏఈని కలువగా అతను డైరెక్టుగా డీల్ చేయకుండా అక్కడే ఉన్న లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావుకు డీల్ చేయాలని సూచించారు. లైన్ మెన్ శ్రీనివాస్ రావు, ఏఈ వ్యక్తిగత సహాయకుడు గౌతమ్‌కు డబ్బులు ఇవ్వాలని సూచించాడు. దీంతో నవీన్ కుమార్ ఏఈ సహాయకుడు గౌతమ్ కు డబ్బులిస్తుండగా నిఘా ఉంచి పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ వివరించారు. పూర్తి స్థాయి విచారణ జరిపి ఏఈ ప్రసాద్ బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, ఏఈ వ్యక్తిగత సహాయకుడు గౌతమ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు పంపించామని తెలిపారు. అంతేకాకుండా ఏసీబీకి పట్టుబడ్డ ఏఈ ప్రసాద్ బాబు నివాసం ఉంటున్న సఫిల్ గూడాలోని ఇంటిపై కూడా ఏకకాలంలో దాడులు జరుగుతున్నాయని వెల్లడించారు.

ఇదిలా ఉండగా బోడుప్పల్ ఏఈ ప్రసాద్ బాబు పనికోసం వచ్చే ప్రతీ ఒక్కరిని లంచాలు అడిగేవారని ఆరోపణలు వస్తున్నాయి. ఎవరి అండతో ఏఈ విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారన్నది సందేహాస్పదంగా మారింది. ట్రాన్స్ కోలో ఉద్యోగుల సంఘం నేతగా వ్యవహరిస్తున్న ప్రసాద్ బాబుకు ఉన్నతాధికారుల అండ మెండుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏఈ వ్యవహార శైలిపై కూడా ఏసీబీకి వందల సంఖ్యలో ఫిర్యాదులు అందాయని ఏసీబీకి చెందిన ఓ అధికారి విలేకర్లకు వివరించారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌లు ఆజాద్, జగన్నాథ్ రెడ్డిలు పాల్గొన్నారు. కేసును ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో.. చతుర్ముఖ పోటీ



అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో మేడ్చల్ లో రాజకీయం రోజు రోజుకూ వేడెక్కుతుంది. ఏ పార్టీ నుండి ఎవరెవ్వరు పోటీ చేస్తారో అని నియోజకవర్గంలో ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న క్రమంలో కారులో అసమ్మతి సెగ పెరుగుతోంది.. కాంగ్రెస్ లో టికెట్ కోసం నాయకులు వారి బలాలతో పోటీ పడుతున్నారు. అటు బీజేపీ అభ్యర్థిగా ఎవరు పోటీలో దిగనున్నారో అని ప్రజల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.. ఇటు తీన్మార్ మల్లన్న కూడా ఇక్కడి నుండే బరిలోకి దిగనున్నారు. దీంతో మేడ్చల్ లో చతుర్ముఖ పోటీ ఉండబోయేలా ఉంది..

- కారులో అసమ్మతి సెగలు
- హస్తం టికెట్ కోసం తీవ్ర పోటీ
- బీజేపీ అభ్యర్థి ఎవరో..
- తీన్మార్ మల్లన్న ఇక్కడే పోటీ
- ఎన్నికలు సమీపిస్తుండడంతో వేడెక్కిన రాజకీయం

నవతెలంగాణ - బోడుప్పల్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ లో చతుర్ముఖ పోటీ ఉండనుంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్ పెద్ద నియోజకవర్గం కావాడం.. అటు మహానగరం హైదరాబాదుకు.. ఇటు గ్రామీణ ప్రాంతాలతో మమేకమై ఉన్న నియోజకవర్గం కావడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తుందనే చెప్పాలి.

కారులో అసమ్మతి సెగలు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన మొదటి ఎన్నికల్లో తొలిసారి అసెంబ్లీలో ప్రాతినిధ్యం సాధించిన బీఆర్ఎస్(టీఆర్ఎస్) 2018లో జరిగిన సాధారణ ఎన్నికలలోనూ రెండో సారి విజయం సాధించింది. 2014లో మలిపెద్ది సుధీర్ రెడ్డి విజయం సాధించాడు. మొదటి దఫా ఆయన పనితీరులో మెరుగైన ఫలితాలు లేకపోవడం, సుధీర్ రెడ్డి వివాదస్పద వాక్యాలతో నిత్యం వార్తల్లో ఉండడం మూలంగా 2018 ఎన్నికల్లో గులాబీ బాస్ ఆయనకు సీటు ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించాడు. అప్పటికే మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న విద్యా సంస్థల వ్యాపార వేత్తగా పేరు గాంచిన చామకూర మల్లారెడ్డికి ఎమ్మెల్యే సీటు కేటాయించడంతో సుమారు 90 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. దీంతో మంత్రివర్గంలో తొలిసారిగా కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పటికే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గులాబీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించారు. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అంగ బలం, అర్థబలం ఉన్న ఎంపీ అభ్యర్థిగా మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి పోటీలో నిలిచినా.. ఇప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేతిలో ఓడిపోయాడు. ఈ క్రమంలోనే 2020లో జరిగిన స్థానిక సంస్థలైన మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా నోట్ల కట్టలు ఇచ్చిన వారికే పార్టీ బీ ఫాం లు అమ్ముకున్నారంటూ మల్లారెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అక్కడక్కడా బీఆర్ఎస్ కు కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చినా.. అన్ని మున్సిపాలటీలు, కార్పొరేషన్లలో చైర్మన్లు,మేయర్లుగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే ఎన్నికయ్యారు. తదనంతరం వివిధ సందర్భాలలో జరిగిన పార్టీ సమావేశాల వేదికలపై మల్లారెడ్డి, సుధీర్ రెడ్డిల మధ్య వర్గ విభేదాలు బయట పడ్డాయి. ప్రస్తుతానికి నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఇంకా ముదిరితే మాత్రం పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం ఉండే ప్రమాదం ఉంది.

హస్తంలో నయా జోష్.. టికెట్ కోసం తీవ్ర పోటీ

గత రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చతికిలా పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సిట్టింగ్ అభ్యర్థిగా పోటీచేసి 2014 మూడో స్థానంలో నిలిచాడు. 2018లో జరిగిన ఎన్నికల్లో కేవలం డిపాజిట్ దక్కించుకుని పరువు నిలుపుకున్నాడు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు రేవంత్ రెడ్డి నియమాకాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ పదవులకు రాజీనామా చేసి దూరంగా ఉంటున్నాడు. కేఎల్లాఆర్ రాజీనామాతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్తలుగా టీడీపీ నుండి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ లో చేరిన తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు, మూడుచింతలపల్లి జడ్పీటీసీ సభ్యుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డిలను నియమించారు. మూడు చింతపల్లి వేదికగా రేవంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత గిరిజన ఆత్మగౌరవ దీక్షలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మల్లారెడ్డిపై రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలు ఇరు పార్టీల మధ్య సవాలుకు ప్రతి సవాలుగా మారి ఒకరినొకరు దూషించుకునే వరకు వెళ్లాయి. అనంతరం వివిధ సందర్భాలలో అధికార బీఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బాగానే పనిచేసింది. అయితే ఈ దఫా ఎమ్మెల్యే సీటు ఎవరికి కేటాయిస్తారనే సందేహం అందరిలోనూ ఉంది. సమన్వయ కర్తలుగా ఉన్న వజ్రేష్ యాదవ్ లేదా హరి వర్ధన్ రెడ్డి లలో ఒకరికి ఇస్తారా లేదా వేరే పార్టీ నుండి వలస వచ్చే నేతలకు ఇస్తారా అనేది వేచి చూడాలి.

అనూహ్యంగా తెరపైకి తీన్మార్ మల్లన్న..

జర్నలిస్టుగా పనిచేసి తీన్మార్ మల్లన్న... తెలంగాణ మాండలికాన్ని వార్తల్లోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కోసం యూ ట్యూబ్ ఛానల్ ను ఏర్పాటు చేశారు. నిత్యం అధికార పార్టీ నేతల అక్రమాలపై తనదైన శైలిలో వార్తలు చదువుతూ, ప్రశ్నించే తీన్మార్ మల్లన్న అలియస్ చింతపండు నవీన్ కుమార్ తెలంగాణ నిర్మాణ సమితి పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. అంతేకాదు మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించడంతో అందరిలోనూ ఆసక్తి కలిగించింది. ఎందుకంటే 2021లో జరిగిన ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి తృటిలో ఓటమి పాలయ్యాడు. అప్పుడు జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి నోట్ల కట్టలు పంపిణీ చేసి అక్రమంగా గెలిచాడని కూడా అనేక ఆరోపణలు వచ్చాయి. అనంతరం చోటు చేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో మల్లన్న బీజేపీలోకి వెళ్లడం మరలా బయటకు రావడం.. మరోసారి జైలుకు వెళ్ళాడం.. లాంటి పరిణామాల నేపథ్యంలో తానే స్వంతంగా పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాడు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి తానే బరిలో ఉంటున్నట్టు ప్రకటించడంతో జనాలలో ఆసక్తి నెలకొంది. యూ ట్యూబ్ వేదికగా అధికార పార్టీ నేతలైన కేసీఆర్, కేటీఆర్ లాంటి వారితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇలా ఎవరైనా సరే లైవ్ లోనే ఫోన్ చేసి మాట్లాడే తీరుతో మల్లకు జనాల్లో క్రేజ్ వచ్చింది. మరీ ఆ ఆదరణ ఓట్ల రూపంలో ఎలా ఉంటుందో చూడాలి.

బీజేపీ సంగతి ఏంటో ..

కేంద్రంలో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఈ సారి తెలంగాణలో అధికారంలోకి రాకపోయినా కనీసం బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా మారాలని తహతహలాడుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన పెద్ది మోహన్ రెడ్డి ఓట్లు సాధించడంలో విఫలమయ్యడనే చెప్పాలి. కేవలం 25 వేల లోపే ఓట్లు లభించాయి. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఎక్కడ కూడా మంచి ప్రదర్శన చేయలేకపోయింది. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన ప్రజలు అనేకమంది ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అందులో అనేకమంది ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడమో లేక వామపక్ష భావజాలం ఉండడంతో ఇక్కడ బీజేపీకి ఆదరణ కష్టమనే అని చెప్పవచ్చు.

వామపక్షాలు ఎటువైపు..

వామపక్షాల పార్టీలకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉందనే చెప్పవచ్చు. బలమైన బీజేపీని ఎదుర్కోవడానికి గత మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ కు మద్దతు ఇచ్చింది. అక్కడ బీజేపీని ఓడించడంలో కీలక పాత్ర పోషించిన లెఫ్ట్ పార్టీలు ఈ సారి కూడా బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తాయని ఇప్పటికే ప్రకటించాయి. ఏది ఏమైనా ఈ ప్రాంతంలో ఉన్న ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లా ప్రజలతో పాటు అత్యధికంగా కార్మిక రంగానికి చెందిన ప్రజలు నివాసం ఉంటుండడం, కార్మిక చట్టాలను రద్దు చేసిన బీజేపీపై వ్యతిరేకతతో ఓట్లు చాలా వరకు బీజేపీకి వ్యతిరేకంగా పడతాయనే చెప్పాలి. ఇక బీఎస్పీ అభ్యర్థిగా 2018లో పోటి చేసిన నక్క ప్రభాకర్ గౌడ్ మరలా బీఆర్ఎస్ లో చేరడంతో ఇప్పుడు ఆ పార్టీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారో చూడాలి.

ఏది ఏమైనా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం ఎన్నికలకు ముందే రాజకీయ వేడి మొదలైంది. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తుండగా, హత్ సే హత్ జోడో యాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీ నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుంది. కార్నర్ మీటింగ్ ల పేరుతో బీజేపీ, 7200పేరుతో తీన్మార్ మల్లన్న తమ తమ ప్రచారాలను మొదలు పెట్టడంతో చతుర్ముఖ పోటీ నెలకొందనే చెప్పాలి.

నియోజకవర్గంలోని మండలాలు

మేడ్చల్, శామీర్ పేట్, మూడుచింతలపల్లి, కీసర, ఘట్ కేసర్ , మేడిపల్లి, కాప్రా

కార్పొరేషన్లు...

బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్ నగర్

మున్సిపాలిటీలు..

మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్ కేసర్, పోచారం

2018లో వివిధ పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు

మొత్తం ఓట్ల సంఖ్య- 5,94,600

బీఆర్ఎస్	- మల్లారెడ్డి	1,67,324
కాంగ్రెస్	- కేఎల్లాఆర్	79,334
బీజేపీ	- మోహన్ రెడ్డి	23,041
బీఎస్పీ	- ప్రభాకర్ గౌడ్	25,829
నోటా	-	3402
మొత్తం పోలైన ఓట్లు		3,04,361

భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట

భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో బడంగ్‌పేట్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాపూర్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ళ శ్రీనివాస్ గుప్తలుతో పాటు మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయంలో మేయర్ ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కోరిన కోర్కెలు తీరాలంటే దైవ భక్తి కల్గి ఉండాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పచిపులుసు శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి ఇరువెంటి సురేష్ గుప్త, నాయకులు తెరేటి శ్రీనివాస్ గుప్త, అన్నారం సురేష్ గుప్త, మహిళా అధ్యక్షురాలు మంచన లక్ష్మి ప్రేమ కుమార్, ఆర్య వైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవ తెలంగాణ - సంతోష్ నగర్

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం చౌని డివిజన్ పరిధిలోని మౌలానా హోటల్ నుండి చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్, అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ డీఈతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడడానికి ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న బీజేపీ

ఏఐటీసీయూ ఆటో యూనియన్ హైదరాబాద్ డిప్యూటీ కార్యదర్శి జంగయ్య



నవతెలంగాణ - సంతోష్ నగర్

బీజేపీ ప్రభుత్వం విదేశీ, స్వదేశీ పెట్టుబడి దారుల కోసం కార్మిక వర్గంపై దాడి చేస్తూ.. వారి హక్కులను హరిస్తుందని ఏఐటీసీయూ ఆటో యూనియన్ హైదరాబాద్ డిప్యూటీ కార్యదర్శి సిహెచ్.జంగయ్య విమర్శించారు. సీపీఐ నాయకులు శంకర్ నాయక్ తో కలిసి ఆయన మే డే జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి.. 4 కోడ్ లుగా మార్చి పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ ఏడేండ్ల పాలనలో కార్మిక వర్గాలు 8 సార్లు సార్వత్రిక సమ్మెలు చేశాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, దశరథ్ నాయక్, శ్యామ్ నాయక్, శ్రీను, రవి నాయక్, వెంకటేష్, జహంగీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

8న సరూర్‌నగర్‌లో నిరుద్యోగ నిరసన సభ



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం సరూర్ నగర్ మైదానంలో ఈ నెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి కోరారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు బాధ్యులు మల్లు రవి ఆదేశాల మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతున్నట్టు తెలిపారు. నగరంలోని డివిజన్ అధ్యక్షులు జన సమీకరణ చేయాలని ఆదేశించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న నిరుద్యోగులను సమీకరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సదాశివుడు, లింగాల కిశోర్, నర్సింహా యాదవ్, వేణు యాదవ్, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మంజులారెడ్డి, సత్యనారాయణ, ఫ్రెంటల్ చైర్మన్ రమేష్ నాయక్, రాజశేఖర్, సురేందర్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, మతిన్ షరీఫ్, మాక్సుద్, షరీఫ్, జానీ బాబా, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రవ్యాప్తంగా నీరా కేఫ్‌లను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యం'

నవ తెలంగాణ - చైతన్యపురి

రాష్ట్రవ్యాప్తంగా నీరా కేఫ్‌లను విస్తరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ రామ్ నర్సింహ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏండ్లు పైబడిన గీత కార్మికులకు రూ.158 కోట్లతో ఆసరా పింఛన్లు, వైన్ షాపుల్లో 15 శాతం రిజర్వేషన్, చెట్టుపైనుంచి పడి మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. 8,128 కల్లు దుకాణాలకు అనుమతి ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. రేపు గౌడకులస్తుల నీరా కేఫ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రూ.12.20 కోట్లతో హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో నీరా కేఫ్‌ను సుందరంగా నిర్మించింది అని అన్నారు.

64వ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హయత్ నగర్

64వ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పోలోజు లక్ష్మణాచారి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత జాతీయ సమగ్రత కోసం పాటుపడాలని సూచించారు. మతతత్వ విద్వేషాలను రూపుమాపాలని కోరారు. మే 3న 64వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గోడ పత్రికను హయత్ నగర్ మండలం సీపీఐ కార్యాలయంలో విడుదల చేసినట్టు చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. నేటి పాలకుల స్వార్థ రాజకీయాల కోసం యువతను చెడు మార్గాల్లో పయనించేలా చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ విధానాలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, గ్రామాల్లో ఘనంగా జెండా ఆవిష్కరణలు చేసి, సదస్సు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హయత్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్, మర్రి శోభన్, మందుల వేణు, యనమల శ్రీకాంత్, రాయి అశోక్, ఇరువు సురేష్, రాయి శ్రావణ్, డి.మల్సార్, ఎన్. కృష్ణ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ హయాంలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట



నవతెలంగాణ- ఉప్పల్

సీఎం కేసీఆర్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని సుమారు 3వేల మంది ముస్లింలకు, మసీద్ కమిటీ నాయకులు, ఇమామ్లకు ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో ఇచ్చిన ఈద్ మిలాప్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హోంమంత్రి మహమూద్ అలీ, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ముస్లింలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రంజాన్ పండుగ గురించి పట్టించుకోలేదన్నారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందన్నారు. నాలుగు లక్షల మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉచితంగా బట్టలను పంపిణీ చేస్తుందన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ముస్లింలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ, ముస్లింల, క్రైస్తవుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ సమప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, గీతా ప్రవీణ్, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, గంధం జ్యోత్స్న నాగేశ్వరరావు, సరస్వతీ సదానంద్, మేకల అనలా హన్మంతరెడ్డి, ఉద్యమకారులు నంది కంటి శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ నాయకులు బద్రు ద్దీన్, ఖాజా మొయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెండ్లికి

ఉప్పల ఫౌండేషన్ సాయం



నవతెలంగాణ -నాగోల్

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఓ ఆడబిడ్డ పెండ్లికి మంగళసూత్రం, మెట్టెలు, చీరె, గాజులను మంగళవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త సాయం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి తట్టి అన్నారంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నందిని తన వివాహానికి సాయం చేయాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి వచ్చింది. వెంటనే స్పందించిన ఆయన వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివాహానికి కావాల్సిన వాటిని ఆ పెండ్లి కూతురుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెండ్లి కూతురు తల్లీదండ్రులు సంధ్య, శంకర్, కరీంనగర్ జిల్లా, హుజురాబాద్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు రాజయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

శివ శంకర్‌కు శ్రమ శక్తి అవార్డు



నవతెలంగాణ-హయత్ నగర్

భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.శివ శంకర్‌కు శ్రమ శక్తి అవార్డు లభించింది. ఈ మేరకు కార్మిక శాఖ మంత్రి చామ కూర మల్లారెడ్డి చేతుల మీదుగా మే డే సందర్భంగా ఆ అవార్డును శివ శంకర్ అందుకున్నారు.

వెంకటాపూర్ శ్రీ బాలాజీ ఆలయ ఈవోగా రమాదేవి

నవతెలంగాణ - ఘట్కేసర్

వెంకటాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్. భాగ్యలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఎ.రమాదేవిని నియమించినట్లు దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వు జారీ చేశారు.

ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్‌గా బోడ రవికుమార్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



హైదరాబాద్ జిల్లా మాదిగ రాజకీయ పోరాట సమితి కన్వీనర్‌గా జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ బోడ రవికుమార్‌ను నియమిస్తూ, జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎన్ రమేష్ కుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాల హక్కులు, అభివృద్ధి కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలన్నారు. మన హక్కుల కోసం ఉద్యమాలు చేయాలని బోడ రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ సర్కిల్-15 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా మంజులా సింగ్

నవతెలంగాణ-అడిక్‌మెట్



జీహెచ్ఎంసీ సర్కిల్-15 పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గం టౌన్ ప్లానింగ్ ఏసీపీగా బి.మంజులాసింగ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పని చేసిన పావని యూసుఫ్‌గూడ సర్కిల్‌కు బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో మంజుల నియమితులయ్యారు. గతంలో సర్కిల్ -15లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేసిన మంజుల ఏసీపీగా పదోన్నతి పొంది చార్మినార్ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ముషీరాబాద్ నియోజక వర్గానికి వచ్చిన మంజులా సింగ్ ఏసీపీగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నిర్మాణదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

సరదాగా సమ్మర్ క్యాంపులు



- గురుకులాల్లో విద్యార్థుల కేరింతలు
- ఈ నెల 6న సమ్మర్ క్యాంపు ముగింపు





నవతెలంగాణ-సిటీబ్యూరో

పుస్తకాలతో కుస్తీలు పట్టిన విద్యార్థులు సమ్మర్ క్యాంపుల్లో ఆటపాటలతో హాయిగా గడిపేస్తున్నారు. బెత్తంపట్టే టీచర్ పక్కన లేకున్నా ఇష్టంగా ఇతర యాక్టివిటీస్ చేసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. తమకిష్టమైన ఆటపాటల్లో మునిగితేలుతున్నారు. పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ, డిజైన్ థింకింగ్‌లో ఆవిష్కరణల కోసం ఆలోచనలకు పదును పెట్టుకుంటూ, థియేటర్ ఆర్ట్స్‌లో ఆయా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి తమ అభిరుచులను నెరవేర్చుకుంటున్నారు. వేసవి సెలవులు ప్రారంభం కాగానే రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ, ఈఎంఆర్ఎస్ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలం శిబిరాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

ఏప్రిల్ 22న ప్రారంభమైన ఈ శిబిరాలు మే ఆరున ముగియనున్నాయి. 15 రోజుల పాటు కొనసాగనున్న శిబిరంలో ఆయా క్యాంపుల వారీగా వివిధ అంశాలను ఎంపిక చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన బాలికల కోసం ఫలక్ నుమా సోషల్ వెల్ఫేర్ స్కూల్, కాలేజీ (సీఓఈ)లో శిబిరం కొనసాగుతున్నది. ఈ శిబిరంలో మహేంద్రహిల్స్ విద్యార్థినీలతో పాటు రంగారెడ్డి, వికారాబాద్, తాండూరు, పరిగి, జంగమ్మెట్ తదితర ప్రాంతాలు, పాఠశాలలకు చెందిన 200 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.

సంగీతం, థియేటర్ ఆర్ట్స్, డిజైన్ థింకింగ్, లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు) అనే నాలుగు అంశాల్లో ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు విద్యార్థులు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న చిన్నారుల్లో ఆసక్తి కలిగిన వారిని గుర్తించి శిబిరం కోసం ఎంపిక చేశారు. శిబిరాన్ని రీజినల్ కో ఆర్డినేటర్ నాగకళ్యాణి పర్యవేక్షిస్తున్నారు. క్యాంప్ కో ఆర్డినేటర్‌గా ఫలక్‌నుమా టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.జయంతి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్‌గా ఎస్.హేమమాలిని, సంగీతం కో-ఆర్డినేటర్‌గా అన్నపూర్ణ మార్గనిర్దేశనంలో 14 మంది ట్రైనర్స్ చిన్నారులను ఆయా విషయాల్లో తీర్చిదిద్దుతున్నారు.

కార్మికుల హక్కులను కాల రాస్తున్న కేంద్రం




- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్
- గౌలిగూడ చమన్ వద్ద కార్మికులకు బహుమతుల పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కార్మిక హక్కులను కాలరాసేలా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తొలగించి పసలేని నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గౌలిగూడ చమాన్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే బహిరంగ సభలో వారు మాట్లాడారు. మే డే రోజు చేసిన వీరోచిత పోరాటంతో కార్మికులు హక్కులు సాధించుకున్న హక్కులను కాల రాసేలా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తొలగించి పసలేని నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. మే డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. 30 కార్మిక కూడళ్లలో ర్యాలీలు, జెండాలను ఎగురవేసి బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, గోషామహల్ జోన్ కార్యదర్శి కె.జంగయ్య, నాయకులు టి.ఆంజనేయులు, జి.గంగాపురి, జి.నర్సింహ, ఎన్.వెంకటేశ్, ఎన్.గోపాల్, ఎన్.కిరణ్, జి.నర్సింహ, పి.కుర్మయ్య, భీమయ్య, రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ అగ్రగామి

నవతెలంగాణ-అంబర్‌పేట



సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కల్యాణలక్ష్మి, రైతుబంధు, దళితబంధు లాంటి అనేక ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టినట్టు తెలి పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు కానీ ఎన్నో సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నా యని తెలిపారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ నిత్యావసర సరుకుల ధరలను పెంచి సామాన్య జనంపై పెనుభారం మోపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.పద్మ వెంకటరెడ్డి, వై.అమృత, నాయకులు లింగంగౌడ్, నర్సింగ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పీహెచ్‌డీ ఫీజు తగ్గించే వరకు విద్యార్థులకు మద్దతు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో హేతుబద్ధత లేకుండా అమానవీయంగా పెంచిన పీహెచ్‌డీ కోర్స్ ఫీజులు తగ్గించాలని పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో "ప్రొఫెసర్ల, పరిశోధక విద్యార్థుల సదస్సు" నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ.గాలి వినోద్ కుమార్, ప్రొ.కాశీం, ప్రొ.కొండ నాగేశ్వరరావు, ప్రొ.సమున్నత, ప్రొ.ఆమంచి నాగేశ్వరరావు, రీసెర్చ్ స్కాలర్స్ కోట శ్రీనివాస్, మందాల భాస్కర్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో రూ.వేలు ఉన్న పీహెచ్డీ కోర్స్ ఫీజుని రూ.1,25,000కు పెంచడం హేతుబద్ధత లేదన్నారు. అమానవీయంగా ఉందనీ, ఈ ఫీజు పెంపు ఉపరితల అంశమనీ, ఇందులో గ్రామీణ ప్రాంత, పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రను పునాది అంశంగా భావించాలన్నారు. పీహెచ్‌డీ కోర్స్ ఫీజులు ఏ ప్రాతిపదికన పెంచారు.. యూనివర్సిటీ ఫీజులు పెంచాలని ఏమైనా కమిటీ నియమించిందా..? ఆ కమిటీ రిపోర్టుని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. స్టాండింగ్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఈ ఫీజుల పెంచారనీ, అదే స్టాండింగ్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఈ ఫీజుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హేతుబద్ధత లేకుండా అమానవీయంగా పెంచిన పీహెచ్‌డీ కోర్స్ ఫీజులను వెంటనే తగ్గించి, పీహెచ్డీ అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్, మెస్ సౌకర్యం కల్పించాలనీ, ప్రతి విద్యార్థికీ సూపర్వైజర్‌ను అలాట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య, ఫిలాసఫీ రీసర్చ్ స్కాలర్ ఆజాద్, తెలుగు రీసెర్చ్ స్కాలర్ బొడ్డుపల్లి అఖిల్, ఎకనామిక్స్ రీసెర్చ్ స్కాలర్, శ్రీవాస్తవ వెంకట్, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్పత్తి శక్తులకు సంకెళ్లు వేస్తున్న కేంద్రం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలు, రైతు చట్టాలను మార్చి దోపిడీదారులకు అండగా నిలబడి ఉత్పత్తి శక్తులకు సంకెళ్లు వేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక విషయాల్లో ఒకే దేశం, ఒకే విధానమని ప్రచారం చేస్తూ ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే రకమైన శ్రమకు ఒకే రకమైన వేతనం కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం ఆధీనంలో పని చేస్తున్న వారికి ఎక్కువ వేతనాలు, రాష్ట్రంలో అదేశ్రమ చేస్తున్న వారికి తక్కువ వేతనాలు, ప్రైవేటు సంస్థల్లో అదే శ్రమ చేస్తున్న వారికి ఒకే వేతనం చెల్లించకపోవడం బీజేపీ పరిభాషలో అన్యాయం కాదా అని ప్రశ్నించారు.

జెఈఈ మెయిన్స్ లో ఆకాష్ బైజూష్ విద్యార్థుల ప్రతిభ

- 32మందికి 99 పర్సంటేజ్

నవతెలంగాణ-హైదరాబాద్



ఆకాష్ బైజూస్ హైదరాబాద్ విద్యార్థులు 32మంది జెఈఈ- 2023 మెయిన్స్ లో 99 పర్సంటేజ్, ఆపైన సాధించారు. ఈ 32 మంది విద్యార్థుల్లో 99.96 పర్సంటేజ్‌ను గుంజి మణిదీప్, పూర్వీ సడగోపన్ సాధించగా, సిద్ధార్థ్ ఎస్ 99.95, బి సిద్దార్థ్ 99.94, అల్లాడి లోహిత్ కుమార్ 99.90 పర్సంటైల్ సాధించి తల్లిదండ్రులతో పాటుగా ఇనిస్టిట్యూట్‌కు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆకాష్ బైజూస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అభిషేక్ మహేశ్వరి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అసాధారణ ప్రతిభకనబరిచిన విద్యార్థుల విజయం వెనుక వారు పడిన కష్టం, అంకితభావం, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్సు పోలీసుల దాడి

నవతెలంగాణ-సిటీబ్యూరో



గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై మంగళవారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి హుక్కా పాట్స్, వివిధ రకాల ఫ్లేవర్స్‌తోపాటు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.60 వేలుంటుందని పోలీసులు తెలిపారు. మంగళవారం డీసీపీ రాధాకిషన్ రావు తెలిపిన వివరాల మేరకు గొల్కొండకు చెందిన మీర్జా ఇబ్రహీమ్ అహ్మద్, పాతబస్తీకి చెందిన మహ్మద్ వాజీద్, మీర్జా ఫుర్కాన్ బేగ్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని బడాబజార్‌లో 'ది పాస్ హౌజ్ ఎన్ మోర్' పేరుతో హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు హుక్కాసెంటర్‌పై దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిర్జా ఫుర్కాన్ బేగ్ కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ కలీల్‌పాషా,ఎస్ఐ ఎండీ ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ టీచర్లను కాంట్రాక్టు టీచర్లుగా విధుల్లోకి తీసుకోవాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్
- విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 937 మంది కస్తూర్బా గాంధీ పాఠశాల టీచర్లను కాంట్రాక్టు టీచర్లుగా విధుల్లోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయాన్ని వందలాది మంది టీచర్లు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2021 నవంబరు 17వ తేదీన ప్రభుత్వ నిబంధనల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించిన 937 మంది టీచర్స్ రెండేండ్లుగా చిత్తశుద్ధితో ఇతర సిబ్బందితో సహా విధులు నిర్వహిస్తున్నారనీ, ప్రభుత్వం హఠాత్తుగా గతేడాది మార్చి 9వ తేదీన వీరిని, పీఈటీలను, ఏప్రిల్ 23న పీజీ టీచర్స్, స్కూల్ టీచర్స్ లను విధులకు హాజరు కావద్దని అధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు టీచర్లను తొలగించడం లేదనీ, ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుకునే పాఠశాలలో టీచర్లను తొలగించడం చూస్తుంటే ప్రభుత్వానికి విద్య పట్ల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 937 మంది టీచర్లను విధుల్లోకి కొనసాగించాలనీ, వీరిని తొలగించి కొత్త వారిని నియమిస్తే కోర్టు తీర్పును ధిక్కరించడమే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేయాలనీ, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలనీ, విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు, బీసీ నాయకులు అనంతయ్య, గుజ్జ సత్యం, వేముల రామకృష్ణ, గూడూరి నాని, పృథ్వీగౌడ్, జి.అంజి, సురేందర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నెక్స్ట్ జన్ స్టోర్‌ను ప్రారంభించిన అమేజాన్ ఫ్యాషన్

నవతెలంగాణ-హైదరాబాద్

అమేజాన్ ఫ్యాషన్ నెక్స్ట్ జన్ స్టోర్ ప్రారంభోత్సవాన్ని ప్రకటించింది. జనరేషన్ జడ్ షాపర్స్ విలక్షణమైన ఫ్యాషన్ అవసరాలకు సాధికారత కల్పించడానికి, వారి అవసరాలు తీర్చడానికి రూపొందించబడింది. ఈ సందర్భంగా అమేజాన్ ఫ్యాషన్ ఇండియా డైరెక్టర్ అండ్ ప్రధాన అధికారి సౌరభ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ...90 మధ్యలో 2000 ఆరంభంలో పుట్టిన, ఈ యువ, భవిష్య యువత శక్తివంతమైన యువదళంగా ముందుకు దూసుకుపోతోం దన్నారు. జన్-జడ్ ఫ్యాషన్ ఆర్భాటం మంత్రాన్ని ప్రకాశింపజేస్తున్నారన్నారు. ఈ విలక్షణమైన స్టోర్ ఫ్రంట్ జన్ జడ్ ఇష్టపడే 200 ప్లస్ బ్రాండ్స్‌ను ప్రదర్శిస్తుందన్నారు.

ఫాస్ట్ ఎక్స్ రెండవ ట్రైలర్ ఆవిష్కరించిన యూనివర్సల్ పిక్చర్స్

నవతెలంగాణ-హైదరాబాద్

యూనివర్సల్ పిక్చర్స్ వారి హై ఆక్టేన్ చిత్రం-ఫాస్ట్ ఎక్స్ రెండవ ట్రైలర్ ను ఆవిష్కరించింది. ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ ఫ్రాంచైజీలో పదవ విడతగా వచ్చిన యాక్షన్ డ్రామా చిత్రం. ఫాస్ట్ ఎక్స్ 10ఎక్స్ యాక్షన్, 10ఎక్స్ డ్రామాతో తిరిగి వచ్చింది. అడ్రినలిన్ నిండిన ప్రయాణంలో మీ హృదయాలను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధంగా ఉంది. జాసన్ మోమోవా తన ప్రతీకారం కోసం డొమినిక్ టోరెట్టో కుటుంబాన్ని ముక్కలుగా విడగొట్టాలనుకునే విలన్‌గా నటించాడు. లూయిస్ లెటె రియర్ దర్శకత్వం వహించారు. జస్టిన్ లిన్ అండ్ డాన్ మజి యో రచించారు. ఈ చిత్రం మే 19న విడుదలవుతోంది.



సాఫ్ట్ వేర్ కెరీర్ కోసం నెక్ట్స్ వేవ్..

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సాఫ్ట్‌వేర్ కెరీర్‌ల కోసం ప్రముఖ అప్‌స్కిల్లింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన నెక్స్ట్ వేవ్, రెండేండ్ల కాలంలో 1,300 కంటే ఎక్కువ కంపెనీలు తమ అభ్యాసకులను నియమించుకున్నాయని నెక్స్ట్ వేవ్ సీఈఓ రాహుల్ అట్లూరి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది అత్యుత్తమ నైపుణ్యం కోరుకునే కంపెనీలకు గో-టు డెస్టినేషన్‌గా దాని స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందనీ, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫుల్ స్టాక్ డెవలపర్ నుండి డేటా ఇంజనీర్, డేటా అనలిస్ట్ వరకు బహుళ ఉద్యోగ పాత్రల్లో విద్యార్థులు నియమించబడ్డారని ఆయన పేర్కొన్నారు. దాని ప్రత్యేకమైన సిసిబిపి 4.0 ప్రోగ్రామ్‌ల ద్వారా, నెక్స్ట్ వేవ్ యువతకు డిమాండ్‌లో ఉన్న సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుస్తుందనీ, భారతదేశం డిజిటల్ అవసరాలను తీర్చడానికి వర్క్‌ఫోర్స్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను కంపెనీలకు కనెక్ట్ చేయడం ద్వారా, నెక్స్ట్ వేవ్ దేశంలోని ఐటీ పరిశ్రమకు శిక్షణ పొందిన ప్రతిభను సరఫరా చేయడం ద్వారా అవసరాలను తీరుస్తుందనీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌ల నుండి యాక్సెంచర్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఒరాకిల్, కాగ్నిజెంట్, గోల్డ్‌మన్ సాక్స్ వంటి ఫార్చ్యూన్ 500 దిగ్గజాల వరకు కంపెనీలు నెక్స్ట్ వేవ్ విద్యార్థులను నియమించుకున్నాయని తెలిపారు. ఈ దశాబ్దంలో భారతదేశ ఐటీ పరిశ్రమ 3 రెట్లు వృద్ధి చెందుతుందనీ, పరిశ్రమకు అనుగుణమైన శిక్షణ ద్వారా యువతను ఈ బహత్తర అవకాశం కోసం సిద్ధం చేయడంపై తమ సంస్థ దృష్టి కేంద్రీకరించబడిందని ఆయన పేర్కొన్నారు.

కార్మికుల పక్షపాతి సీఎం : నగర మేయర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల పక్షపాతని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. మే డే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులకు రూ.1000 పెంచిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంగళవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మేడే సందర్భంగా రాష్ట్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు వేతనం పెంచడం సాహెూసపేత నిర్ణయమన్నారు. జీహెచ్ఎంసీలో పని చేస్తున్న కార్మికులు చేస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఇతర శాఖలైన మెట్రో, వాటర్ వర్క్స్‌తో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో పని చేస్తున్న మొత్తం 1,06,474 మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు మే డే గిఫ్ట్‌గా రూ.వెయ్యి వేతన పెంపు అన్యాయం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్, ఐఎన్‌టీయూసీ అనుబంధ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను సీఎం కేసీఆర్ పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చి తొమ్మిదేండ్లు గడుస్తున్నా నేటికీ హామీ నెరవేరకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులకు కలగానే మిగిలిపోయిందన్నారు..పారిశుద్ధ్య కార్మికులకు రూ.1000 మాత్రమే పెంచుతామని సీఎం ప్రకటించడం దురదృష్టకరమ న్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.17వేలు మాత్రమే లభిస్తుండగా, పెంచిన వెయ్యితో కార్మికులకు నెలకు రూ.18వేలు మాత్రమే అందనుంది అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు రూ.22 వేలు ఇస్తున్నాయనీ, తెలంగాణలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్-2

నవతెలంగాణ-అడిక్‌మెట్



తెలంగాణ తొలితరం ఉద్యమ కారుడు, మాజీ హెూంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని వారం రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే నాయిని నర్సింహా రెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్ -2 ఘనంగా నిర్వహిస్తామని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయిని నర్సింహారెడ్డి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారనీ, సీఎం కేసీఆర్‌తో కలిసి రాష్ట్రాన్ని సాధించి తొలి రాష్ట్ర హెూం శాఖ, కార్మిక శాఖమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన నాయిని ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని కొనియాడారు. గతేడాది ఎన్టీఆర్ స్టేడియంలో నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్-1 ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. గతేడాది నగరవ్యాప్తంగా ఉన్న క్రికెట్ క్రీడాకారులు ఈ టోర్నమెంటులో 80 క్రికెట్ జట్లు పాల్గొన్నాయని వివరించారు. ఈ సారి కూడా గతంలో కంటే ఈ టోర్నమెంటులో ఆడేందుకు అత్యధికంగా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మెమోరియల్ క్రికెట్ లీగ్-2 బ్రోచర్‌ను మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని పేర్కొన్నారు. క్రీడలను వీక్షించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించామని తెలిపారు. వారంరోజుల పాటు జరిగే ఈ క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఈ నెల 12వ తేదీ నాయిని నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా జరగబోయే ఫైనల్ పోటీల్లో విజేతలకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ మెమోరియల్ పోటీల్లో పాల్గొనే క్రీడాజట్లు ఈ నెల 3వ తేదీన సాయంత్రం వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలనీ, 4వ తేదీన డ్రా నిర్వహిస్తామనీ, మరిన్ని వివరాలకోసం 8801885570, 9866666718 నెంబర్లలో సంప్రదించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర నాయకులు కల్వ గోపి, నేత శ్రీను, కార్తీక్ యాదవ్, సిద్దిక్, బి.వెంకటేశ్వర్లు, రాములు, శివ, సాయియాదవ్ పాల్గొన్నారు.

సెక్రెడ్ పాత్స్ ప్రారంభం

నవతెలంగాణ-అంబర్‌పేట



పదిహేనవ శతాబ్దానికి చెందిన ఆధ్యాత్మికలు, రచయితలు కబీర్‌తో పాటు మరెంతో మంది కవితలను హృద్యంగా షబ్నం విర్మానీ, శ్రీపర్ణ మిత్రుందయ్ ఆలపిస్తుండగా నగరంలోని గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వద్ద ఉన్న మ్యెస్కేప్ కోర్టియార్డ్ వద్ద సెక్రెడ్ పాత్స్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సెలబ్రిటీలు గీతా ఆర్ట్స్ వ్యవస్థాపకులు అల్లు అరవింద్, నటులు రకుల్ ప్రీత్‌సింగ్, లక్ష్మీ మంచు పాల్గొన్నారు. సహజసిద్ధమైన, అనువంశిక వైద్యురాలు అనురాధ రమేష్ (ఉష) ఈ సెక్రెడ్ పాత్స్‌ను జూబ్లీహిల్స్ వద్ద ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక స్వస్థత కేంద్రం ఈ సెక్రెడ్ పాత్స్. ఈ కేంద్రం ప్రారంభం సందర్భంగా ఉష మాట్లాడుతూ తాను నిబద్ధతతో కూడిన అన్వేషకురాలినన్నారు. సెక్రెడ్ పాత్స్ ఆధ్యాత్మిక స్వస్థత కేంద్రంగా వెల్లడించిన ఆమె, స్వీయ స్వస్థత, సాధికారిత దిశగా అంతర్గత మార్గాల్లో నడవడానికి ఇది మద్దతు అందిస్తుందన్నారు. దశాబ్దాల అధ్యయనాలు, శిక్షణ, చికిత్సతో ఇక్కడ బోధన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వారు స్వశక్తి పేరిట స్వీయ సాధికారిత గుళికను విడుదల చేశారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకంగా వ్యక్తిగత ప్రాక్టీస్ చేయవచ్చు. తాను డిజైన్ చేసిన ఈ స్వశక్తితో ఆరోగ్యం, తేజస్సు, స్వీయ సాధికారిత సిద్ధిస్తుందని ఉష వెల్లడించారు.

పేదలకు ఆర్థిక తోడ్పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

పేద ప్రజల ఆర్థిక తోడ్పాటుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలై ఆర్థికంగా చితికిపోయిన వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో పేదలు ఎందరికో సీఎంఆర్ఎఫ్ అందించి పేదలకు ఆర్థిక తోడ్పాటును అందించామన్నారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రికి కతజ్ఞతలు తెలిపారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రూప్ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వేముల మారయ్య



నవతెలంగాణ-నాచారం

బీఆర్ఎస్కెవి మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రూప్ సింగ్ జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆటో రవాణా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమజీవుల కష్టాలను తన కష్టంగా భావించి కార్మిక రంగం అభివద్ధికి ఎంతో కషి చేసిన వ్యక్తి రూప్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులుజీ రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి పీ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి బూరుగు మారుతీ రావు, బీడీఎల్ కంపెనీ అధ్యక్షులు దానకర్ణ చారి, కార్మిక నాయకులు శివశంకర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ పట్ల విశ్వాసం చూపుతున్నారు

- ఇందిరమ్మ రాజ్య ఆవశ్యకత గురించి ప్రజలకు వివరిస్తున్నాం
- నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హత్‌సే హాత్ జోడో కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుం టునామన్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామిని సంపూర్ణంగా అమలు చేయలేదని తెలిపారు. ఈ నెల 8న ప్రియాంక గాంధీ హైదరాబాద్‌లో భారీ బహిరంగసభలో పాల్గొననుంది. ఈ నేపథ్యంలో నందికంటి శ్రీధర్ నవతెలంగాణ పత్రిక ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు.

న.తె .నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతు మీ దృష్టికి తీసుకవచ్చిన సమస్యలు ?

నందికంటి శ్రీధర్ : హత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో ఇప్పటి వరకు ఏడు డివిజన్‌లు పూర్తి చేశాం ప్రతీ డివిజన్‌లో మౌలిక సమస్యలు ఎదుర్కోంటున్నారు. రోడ్లు, మంచినీరు, వీధిలైట్లు, డ్రైయినేజీ సమస్య, నాల సమస్య, వర్షం వస్తే నాలాలు నిండిపోయి డ్రైనేజీలు ఉప్పొంగడంతో వీధులన్నీ కంపు కొడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న చెరువులల్లో డ్రయినేజీ నీరు కలువడంలో చెరువులు కలుషితమవుతున్నవి, అదే సందర్భంలో పూడిక పెరిగిపోతుంది. గుర్రపుడెక్క ఆకు పెరగడంతో ఆకు కింద దోమలు చేరుతుండడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందు పడుతున్నారు. ఓల్డ్ అల్వాల్, బండ చెరువు, రామక్రిష్ణపురం చెరువు, సఫల్‌గుడ చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలనీ వాసులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం, అధికారలు వెంటనే స్పందించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

న.తె. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై మీ వైఖరి..?

నందికంటి శ్రీధర్ : గడిచిన తొమ్మిది ఏండ్లలో ప్రజలకిచ్చిన హామిలు దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, నీళ్ల, నిధులు, నియామాకాలు వంటి హామీలు మూలకు పడ్డాయి. అంతా అవినీతి మయం, నిత్యావసరాల వస్తువుల ధరలు పెరుగుట, అప్పుల బారం, అర్హులకు పెన్షన్లు రాకపోవడం, నిరుద్యోగుల సంఖ్య పెరిగి యువత నిస్సహాయ స్థితిలో ఉండడంవంటి అనేక సమస్యలతో ప్రజలు బతుకు వెళ్లదీస్తున్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి వాటిపట్ల ప్రభుత్వానికి జవాబుదారితనం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. పేదలకు, అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి ఇప్పటి వరక ఎలాంటి చర్యలు తీసుకోలేదు.చెరువుల శుద్దీకరణ చేస్తామని ఇచ్చిన హామి గంగలో కలిసింది.

న.వ. నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉంది..?

నందికంటి శ్రీధర్ : హత్‌సేహాత్ జోడో యాత్ర కార్యక్రమంలో డివిజన్‌లోని ఇండ్లు తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను ప్రజలకు విడమరిచి చెప్పాం, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు వివరిస్తున్నాం,రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుపై 9 రకాల నిత్యావసర వస్తువులు అందచేశాం. మా ప్రభుత్వం అధికారంలోనికి రాగానే మళ్లీ రేషన్ కార్డుపై 9 రకాల వస్తువులు అందచేస్తాం. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తాం. నియోజకవర్గంలో ప్రజలను చైతన్యం చేస్తున్నము. రానున్న రోజుల్లో గడీల పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి మాకు అనుకూలంగా మలుచుకుంటాం. ప్రజలు మాకు సహకరిస్తున్నారు. మా పట్ల విశ్వాసం చూపుతున్నారు.



న,తె. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే ఎలాంటి పాలన అందిస్తారు..?

నీతివంతమైన పరిపాలనను అందిస్తాం. ప్రతీ విషయంలో ప్రజలకు జవాబుదారితనంగా ఉంటాం. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తాం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం, విద్యావైద్యం ప్రజలకు అందుబాటులోకి తెస్తాం, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తాం, 500 వందలకే గ్యాస్ సిలిండర్ అందచేస్తాం, రైతులకు మద్దతు ధరను ఇప్పిస్తాం, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు తగ్గిస్తాం మహిళ రక్షణ చట్టాలు కఠినతరం చేస్తాం. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పైవన్నీ అమలు చేస్తున్నాము.

న.తె. హైదరాబాద్‌లో జరుగు ప్రియాంకగాంధీ సభకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు.

నందికంటి శ్రీధర్ : నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జన సమీకరణ చేస్తున్నము. అంతకు ముందే ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ రాజ్య ఆవశ్యకత గురించి ప్రజలకు వివరిస్తున్నాం. సభను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

కంటోన్మెంట్‌లో త్వరలో నీటి బకాయిలు మాఫీ

- బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లో నీటి బకాయిలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి అన్నారు మంగళవారం బోయిన్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవలో త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డుకు సర్వీస్ చార్జీల కింద రావాల్సిన రూ. 800 కోట్లు విడుదల చేస్తే కంటోన్మెంట్ ను సింగపూర్ మాదిరిగా అభివద్ధి చేయొచ్చు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిధుల సాధనకు బీఆర్ఎస్ నిరంతరం కేంద్రం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూనే ఉందన్నారు.. కంటోన్మెంట్ ప్రాంతంలో అంతర్గతంగా మూసి ఉన్న రోడ్లను సైతం తెరిపించేందుకు బీఆర్ఎస్ తోడుగా ఉంటుందని.. అదే విధంగా ఎస్ఎన్డీపీ ద్వారా రామన్నకుంట , తిరుమలగిరి, పరిధిలోని నాలాల ఆధునీకరణ చేపట్టేందుకు సర్కారు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కంటోన్మెంట్ లోని పలు ప్రాంతాలు, కాలనీలు, బస్తీలు ముంపునకు గురికాకుండా నివారించేందుకు పకడ్బందీగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వెల్లడించారు. సమావేశంలో బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనదం, భాగ్యశ్రీ, ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, పెద్దల నర్సింహా, వార్డ్ 5 ప్రెసిడెంట్ కిరణ్, వార్డ్ 8 ప్రెసిడెంట్ తేజ్ పాల్, పిట్ల నగేష్, సదానంద, గంగారాం తదితర నాయకులు పాల్గొన్నారు.

బకెట్ క్లీనింగ్ యంత్రంతో డ్రయినేజీల శుభ్రం కార్యక్రమం

- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రయినేజీలను బకెట్ క్లీనింగ్ యంత్రంతో రాఘవేంద్రనగర్ ఎల్లమ్మ దేవాలయం వీధిలో డ్రయినేజీలు శుభ్రం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దష్టిలో పెట్టుకొని కాలనీలో డ్రయినేజీల సమస్యలు తలెత్తకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. డ్రయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం పంపు సమస్య ఉండకుండా ఎప్పటికప్పుడు వాటి మెయింటెనెన్స్ చేయడం ద్వారా వర్షాకాలంలో పొంగిపొర్లకుండా వరద నీరు సాఫీగా దిగువ ప్రాంతానికి వెళ్ళిపోతుంది అని అన్నారు. ముందస్తు కార్యాచరణలో భాగంగా ప్రతి కాలనీలో బకెట్ క్లీనింగ్ యంత్రం ద్వారా డ్రయినేజీలు శుభ్రం చేసి అవి పొంగిపొర్లకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, సత్తయ్య యాదవ్, కట్ట బుచ్చి గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ ఆఫీసు వద్ద మేడే సంబరాలు



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ ఆఫీసు వద్ద ఈసీఐఎల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ నిర్వహించిన మేడే సంబరాల్లో వందలాదిగా ఉద్యోగులు , కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ భాస్కర రెడ్డి మాట్లాడుతూ పెత్తందారులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం తిరిగి చెల్లించకపోతే పెద్ద ఎత్తున రుణమాఫీల చేసి కేంద్ర ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచి పెడుతున్నదన్నారు. ప్రధాన కార్యదర్శి జోషి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి పోరాటాలు చేయాల్సిన అవసరం నెలకొందన్నారు. యూనియన్ నాయకులు ప్రవీణ్, బాలకష్ణ, రాజశేఖర్, డేవిడ్, విజయ్, పవన్, నాగబాబు, మైసయ్య గౌడ్, విజయేశ్వరి, షాకీరుద్దిన్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల పాదయాత్రకు అపూర్వ స్పందన



నవతెలంగాణ- నేరేడ్ మెట్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినాయక నగర్ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన హత్ సే హత్ జోడో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. డివిజన్ పరిధిలోని హనుమాన్ గుడి వద్ద ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గడప గడప తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ, రోడ్లు, దోమలు, కుక్కల బెడద ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలను స్థానికులు ఆయనకు తెలిపారు. దీనికి స్పందించిన నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న సమస్యలన్ని అధికారులకు తెలిపి వారి సహకారంతో పరిష్కారిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, ఎంఆర్ శ్రీనివాస్ యాదవ్, నరసింహ గౌడ్ , హనుమంతు, బాలకష్ణ, ఎన్ ఎస్ యుఐ సాయి, గిరి యాదవ్, అమర్నాథ్, సంజీవ్ యాదవ్, సాయిరాం, గణేష్, జెకె సాయి, గణేష్ వర్మ, యు. సాయికుమార్ పాల్గొన్నారు

కబ్జాదారుల గుండెల్లో పరుగులు

- హుడా భూముల్లో... నిర్మాణాలు చేస్తే అరదండాలే
- ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదు
- హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు



నవతెలంగాణ-జవహర్‌నగర్

కార్పొరేషన్‌లోని 1 హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే అరదండాలే మిగులుతాయని హుడా అధికారులు హెచ్చరించారు. హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జవహర్‌నగర్‌లో హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం, స్థానిక పోలీసుల సహాయంతో అక్రమ కట్టడాలను మంగళవారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా హుడా అధికారులు మాట్లాడుతూ హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని ఎన్నిసార్లు హెచ్చరించిన పట్టించుకో వడం లేదన్నారు.



ఫరానగర్, మల్కారం, భాగ్యనగర్ కాలనీల్లో ఆక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను నేలమట్టం చేశారు. ఇకపై ప్రభుత్వ భూముల్లో ఇటుక పెట్టినా సహించబోమన్నారు. హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి జనార్ధన్, ఎస్సైలు సంతోష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ భూముల్లో నేలమట్టమైన అక్రమ నిర్మాణాలు...

కార్పొరేషన్‌లోని పలు కట్టడాలపై మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ విశ్వనాథ్ మాట్లాడుతూ జవహర్ నగర్‌లో పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నాయని, పేపర్ లేఅవుట్లపై నిరుపేదలకు ప్లాట్లు కట్టబెడుతూ మోసం చేస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తాజాగా పలువురిపై కేసులు నమోదు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో ఈదమ్మ గుడి సమీపంలో సీసీ రోడ్లు, కౌండిన్య భవనంలో పెండింగ్లో ఉన్న పనులు, నోమా ఎదురు వీధి చర్చి వద్ద భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్లు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దశలవారీగా అభివద్ధి కార్యక్రమాలను చేపడుతూ ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మల్లాపూర్ అభివద్ధిలో అవార్డును దక్కించుకొని అగ్రస్థానంలో ఉందన్నారు. జీహెచ్ఎంసీ సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మల్లాపూర్ అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలవాలని అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని ప్రతీ పౌరుడికి అందజేయాలి

- రాజ్ కమల్ మహారాజ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరులకు అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాజ్ కమల్ మహారాజ్ అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ గ్రంధాన్ని రాష్ట్రంలో ప్రతి పౌరునికి ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ మేడ్చల్ కలెక్టరేట్‌లో డీఆర్వోకు ధర్మ సమాజ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో అట్టడుగు ప్రజలైనటువంటి బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు భారత రాజ్యాంగం ద్వారానే లబ్ది పొందుతున్నారని విషయాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. కానీ ఈ పాలకవర్గాలు 70 సంవత్సరాల నుంచి భారత రాజ్యాంగం విలువలను సామాన్య ప్రజలకు తెలియజేయకుండా పరిపాలిస్తు న్నారన్నారు. పైగా రాజ్యాంగాన్ని కనుమరుగు చేయాలని చూస్తున్నారని చెప్పారు. అందుకని కచ్చితంగా భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరులకు అందజేయాలని ఆ బాధ్యతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపైన ప్రభుత్వం స్పందించకుంటే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు సైదులు, గణేష్, శివ, హరినాథ్, పరశురాం, వివేక్ దినయ్,మహేష్, శ్రీనివాస్, మల్లేష్ ,శ్రీధర్ వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'భూగర్భ డ్రయినేజీ పనులు ప్రారంభించాలి'



నవతెలంగాణ- నేరేడ్ మెట్

భూగర్భ డ్రయినేజీ పనులు ప్రారంభించాలని కోరుతూ వినాయక్ నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మంగళవారం జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ డ్రయినేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే బడ్జెట్ శాంక్షన్ చేసి, వర్షాకాలంలోపు పనులు చేపట్టకపోతే ప్రజలు ఇబ్బందికి గురవుతారని తెలిపారు. అలాగే మ్యాన్ హెూల్స్ నుండి సిల్క్ వ్యర్థాలు తీసిన తర్వాత, వెంటనే తొలగించాలని చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి జలమండలి మేనేజర్ నవీన్‌కు నోటును పెట్టాలని ఆదేశించారు..

ఎన్‌పీసీఐతో ఎయిర్ టెల్ పేమెంట్స్ బ్యాంక్ భాగస్వామ్యం

నవతెలంగాణ-హైదరాబాద్

దేశంలో డిజిటల్, ఫైనాన్షియల్ ఇన్ క్లూషను పెంచే దిశలో మరో అడుగు వేస్తూ, ఎయిర్ టెల్ పేమెంట్స్ బ్యాంక్ తన ఆధార్-ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ను 500,000 బ్యాకింగ్ పాయింట్లతో ఫేస్ అథెంటికేషను రూపొందించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ)తో కలిసి పనిచేస్తోంది. ఈ సేవల అందుబాటు గురించి ఎన్ పీసీఐ సీఓఓ ప్రవీణా రాయ్ మాట్లాడుతూ... ఆధార్ ఆధారిత ఆథెంటికేషన్ కోసం అదనపు మోడ్గా ఫేస్ అథెంటికేషనన్ ను పరిచయం చేసినందుకు యుఐడిఏఐ ను అభినందించారు. దేశంలో ఫైనాన్షియల్, డిజిటల్ ఇన్ క్లూషన్ ను పెంచేందుకు ఇప్పటికే ఉన్న తాము అందిస్తున్న సురక్షితమైన, సరళమైన బ్యాంకింగ్ సొల్యూషన్లకు ఫేస్ అథెంటికేషన్ ఒక ముఖ్యమైన జోడింపు అని వివరించారు.

జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణ శిబిరం 7వ రోజు డ్రాయింగ్



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం 7వ రోజు శిక్షణలో భాగంగా స్థానిక ఆక్స్‌ఫర్డ్ మోడల్ హై స్కూల్ శ్రీకృష్ణనగర్ కాలనీ చక్రిపురంలో విద్యార్థులకు డ్రాయింగ్ ఎలా వేయాలో, గీసిన బొమ్మలకు కలర్లు ఏ విధంగా వేయాలో అధ్యాపకులు దివ్య విద్యార్థులకు నేర్పించారు. డ్రాయింగ్ లో బేసిక్ సింబల్స్ అయినా రౌండ్, స్క్వేర్, ట్రయాంగిల్, అలానే ఇంగ్లీషులో ఉండే ఆల్ఫాబెట్స్ లెటర్స్‌ను ఉపయోగిస్తూ వివిధ నెంబర్స్‌ని ఉపయోగిస్తూ అతి సులువుగా బొమ్మలను గీయడం, అలానే విద్యార్థులు గీసిన బొమ్మలకు సరైన విధమైన కలర్లను నింపే విధానాన్ని ఈ క్యాంపులో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా తాము గీసిన బొమ్మలను చూపిస్తూ ఆనందించారు ఈ వేసవి శిక్షణ శిబిరంలో జన విజ్ఞాన వేదిక మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శిలు శివ ప్రసాద్, కాప్రా మండల ఉపాధ్యక్షులు జెన్నీ, శివ శంకర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పేషంట్‌కు అండగా ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



వినాయక్ నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జనిగ గోపి యాదవ్ గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బాధితుడిని ఆదుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గూండా నిరంజన్ ఎమ్ఎస్ఎస్ఓ (మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్) ద్వారా రెండు నెలల సరిపడే రేషన్ సరుకులను బాధితుడికి అంద చేశారు. బాధితుడు నిమ్స్ ఆస్పత్రికి వెళ్ళి చికిత్స చేయించుకోవాలని, వైద్య ఖర్చులు ఎంతైనా ఎమ్మెల్యే హన్మంతరావు భరిస్తారని వారు చెప్పారు. అదే విధంగా బాధితుడి బాబు, పాప చదువుకు అయ్యే ఖర్చును భరిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కష్ణమూర్తి గౌడ్, తులసి ,సురేష్, శేఖర్ గౌడ్, బాలకష్ణ గుప్తా, గోపాల్ ,ఆగమయ్య, ఉమేష్ కుమార్, మమ్మ బాపు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జ్యోతి, ఉపేందర్



నవతెలంగాణ-నాచారం

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జ్యోతి ఉపేందర్ ను రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి మేడ్చల్ జిల్లాలో రజక వృత్తిదారుల సంఘం నిర్మాణం వృత్తిదారుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించి రజక వృత్తిదారులకు ఉచిత కరెంటు మీటర్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం కృషి చేసినట్టు పేర్కొన్నారు. మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి 12 తీర్మానాలను ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకీభవంగా ఆమోదించారు. భవిష్యత్తులో రజక వృత్తిదారులు ఆయా డిమాండ్ల సాధన కోసం ఐక్యతగా పోరాటాలను నిర్వహించి వృత్తిదారుల హక్కులను సాధించుకోవాలని కోరారు. తనకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్‌లోని పలు అక్రమ నిర్మాణాలను కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్ నేతత్వంలో కూల్చివేశారు. మల్లాపూర్ చాణిక్యపురి, గోకుల్ నగర్లలో ఓ రాజకీయ పార్టీ నాయకుడు అండదండలతో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించిన వాటిని నోటీసులు జారీ చేసి ఎన్ని రాజకీయ ఒత్తిళ్ల ఎదురైన ఉపేక్షించేది లేకుండా కూల్చివేసినట్టు తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉప్పేక్షించేది లేదని టౌన్ ప్లానింగ్ అధికారులు అన్నారు. ఇండ్ల నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవద్దని అధికారులు సూచించారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులతో పాటు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-మల్కాజ్‌గిరి

అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేయాలని గౌతంనగర్ కార్పోరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతారావు ఆదేశాల మేరకు డివిజన్ పరిదిలోని వెంకటాద్రినగర్ పవన్ మోటర్స్ పక్కనున్న నాలాను కార్పొరేటర్ పరిశీలించారు. అధికారులతో కలిసి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షానికి డ్రయినేజీ ఓవర్ ఫ్లో అవుతుందని, రోడ్డు మీదికి మురికి నీరు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని ప్రజలు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్పోరేటర్ స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. డీఈ లౌక్యఏఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సన్ రైజర్స్ టీంను కలిసిన బచ్‌పన్ ప్లే స్కూల్ డైరెక్టర్ శివకుమార్



నవతెలంగాణ-నాచారం

సన్ రైజర్స్ క్రికెట్ 'టీం'ను బచ్ పన్ ప్లే స్కూల్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ నాచారం రీజనల్ డైరెక్టర్స్ శ్రీకాంత్ రెడ్డి, చిలక శివకుమార్ ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్ రైజర్స్ 'టీం' తమ స్కూల్ స్పాన్సర్ కావడంతో కలిసి బచ్ పన్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ సిటీ కోసం చర్చించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ వర్చువల్ వ్యవస్థలో కొనసాగించుటకు దేశవ్యాప్తంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని త్వరలోనే హైదరాబాద్ లాంటి మహానగరాలలో ఆన్‌లైన్ విద్యా విధానాన్ని అమలు చేయుటకు అనుగుణంగా ప్రచార వ్యవస్థను ఏర్పాటుతో పాటు పలు అంశాలపై చర్చించినట్టు వివరించారు. సన్ రైజర్స్ 'టీం' తో కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్ పన్ ప్లే స్కూల్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ నాచారం అకాడమిక్ డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

బస్తీల సమస్యలపై ఎమ్మెల్సీని కలిసిన ప్రజలు



నవతెలంగాణ - దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కలిసిన వారిలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడే కనుకగా సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులకు రూ.1000 వేతనం పెంచడంతో సుభాష్ నగర్ 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పారిశుధ్య కార్మికులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ " సఫాయన్న నీకు సలాం అన్న "అనే నినాదంతో పారిశుధ్య కార్మికుల కృషిని గుర్తించిన కేసీఆర్ రాష్ట్రంలో కష్టపడి పని చేసే ప్రతీ ఒక్క కార్మికుని సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు మూడుసార్లు పారిశుధ్య సిబ్బందికి వేతనాలు పెంచడం జరిగిందన్నారు. కార్మికులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి

- జూబ్లీహిల్స్‌లో ఘటన
- స్థానికులను కంటతడి పెట్టించిన తల్లిదండ్రుల రోదన
- జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్న స్థానికులు




నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హైదరాబాద్ కళాసిగూడలో ఇటీవల నాలాలో పడి బాలిక మృతిచెందిన ఘటన నుంచి జనం తేరుకోకముందే.. నగరంలో మరో విషాదం చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతిచెందాడు. పుట్టినరోజు నాడే బాలుడు ప్రాణం కోల్పోవడం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏపీలోని కాకినాడకు చెందిన భీమశంకర్ బతుకుతెరువు కోసం హైదరాబాద్ వచ్చి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 లోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సమీపంలోని రేకుల గదిలో భార్య లవకుమారితో కలిసి ఉంటున్నాడు. వారి కుమారుడు వివేక్ పాఠశాలకు వేసవి సెలవులు అయినందున ఇంటి వద్ద ఉన్నాడు. మంగళవారం ఇంటి సమీప ప్రాంతంలో ఆడుకుంటూ అక్కడ ఉన్న నీటి గుంటలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. అది గమనించి బాలుని స్నేహితులు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. వారు అక్కడకు వెళ్లేసరికే బాలుడు నీటిలో మునిగిపోయి ప్రాణం కోల్పోయాడు. జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేష్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి చనిపోయాడా లేదా ఎవరైనా చంపేసారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బతుకుదెరువు కోసం వచ్చి బాలున్ని పోగొట్టుకున్న తల్లిదండ్రుల రోదన స్థాని కులనూ కంటతడి పెట్టింది. ఇదిలా ఉండగా, నీటి గుంటకు చుట్టూ ఫెన్సింగ్ వేయలేదని, వర్షాకాలం అయినప్పటికీ జీహెచ్ ఎంసీ అధికారులుగానీ, స్థానిక నాయకులుగానీ ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోకుండా వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి అవమానం..!

- విగ్రహానికి మీసాలు, నామాలు పెట్టిన దుండగులు
- నిందుతులపై కఠిన చర్యలు తీసుకోవాలి : కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీర్





నవతెలంగాణ - దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి కొందరు దుండగులు మీసాలు, నామాలు పెట్టి అవమానించడం హేయమైన చర్య అని , ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగల్ల బాలపీర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత ఐక్యవేదిక చైర్మెన్ మేకల నాగేష్ తెలిపారు. మంగళవారం సంఘటన స్థలానికి వెళ్లి విగ్రహం ముందు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అవమా నించడం అంటే దేశాన్ని అవమానించడమేనని, కొందరి దుండుడుకు చర్యల వల్ల ఉద్రిక్త వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘట నలు పునరావృతం కాకుండా దుండగులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆగస్టులోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రయినేజీ సమస్యలను వెంటనే పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను అదేశించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలులతో కరెంటు స్తంభాలపై చెట్లు కూలి విద్యుత్‌కి అంతరాయం కలుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ప్రజలకు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించేటట్టు సూచి బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీ చేశారు.. అంతే కాకుండా డ్రయినేజీ వ్యవస్థపై ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా మంత్రి కేటీఆర్‌కు తెలియచేస్తామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తనకు తెలియచేయాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో అన్ని విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు..

సచివాలయ నిర్మాణం చారిత్రాత్మకం

- పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు
- మంత్రి జగదీష్‌రెడ్డిని సన్మానించిన పవర్ ఇంజినీర్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పేరుతో నిర్మించిన సచివాలయం అద్భుతమైన కట్టడంగా పవర్ ఇంజినీరింగ్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) అభివర్ణించింది. మంగళవారం నూతన సచివాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జి.జగదీష్ రెడ్డిని అసోసియేషన్ నాయకులు కలసి ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సచివాలయం నిర్మాణం గొప్పతనాన్ని మంత్రితో పం చుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఈ కట్టడం చారిత్రాత్మకమైనదని వారు కొనియాడారు. అసోసియేషన్ సెక్రటరీ జనరల్ సదానందం, అసోసియేట్ ప్రెసి డెంట్ వెంకట్ నారాయణ, సెక్రటరీ జనప్రియ, పి.వి.రావు, సురేష్, భాస్కర్, ఆర్థిక కార్యదర్శి రాజు, బాగయ్య, గోపాలకృష్ణ గోపాలరావు, వెంకటేష్, కాక, ప్రశాంత్, కిరణ్, విద్యాసాగర్, మల్లయ్య, శివశంకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్ వార్డు 22లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ చైర్మెన్ తుడుము పద్మారావుతో కలిసి వార్డ్ కౌన్సిలర్ షామీర్ పెట్ సంధ్య హనుమంతరావు, కమిషనర్ కే. సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు, ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులని, కంటి పరీక్షలకు వెళ్ళేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డ్ తీసుకువెళ్లాలని కోరారు. కంటి వెలుగు కేంద్రాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సంబంధిత వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారని, అనంతరం అవసరమైన వారికి కండ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. రఘుపతి రెడ్డి, జవాన్ మధు ఆరోగ్య, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-మేడ్చల్

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ ప్రాబల్యాన్ని పొందుతున్నదని సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను దుర్మార్గపు ఆలోచనలని ప్రజలు, కార్మికులు అర్థం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఇప్పటికీ కనీస వేత నాలు చట్టం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంద న్నారు. నియోజకవర్గంలో ఉన్న మంత్రి మల్లారెడ్డి కార్మి కులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మారి కార్మికులకు కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరిని నిలదీసేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.

పేద విద్యార్థినీకి ల్యాప్‌టాప్ అందజేత

నవతెలంగాణ-కూకట్‌పల్లి/బాలానగర్



నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని, అలాంటి తన వంతు సహాయ, సహకా రాలు అందించేందుకు ఎల్లవేళలా ముందుంటానని తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మెన్ పాటిమీది జగన్మోహన్ రావు అన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా మంగళవారం కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ నిరుపేద కుటుంబానికి చెందిన బాలకృష్ణ, భాగ్యలక్ష్మి దంపతుల కుమార్తె మధు రిమకు టీఎస్‌పీఎస్ చైర్మెన్ లాప్‌ట్యాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుం దన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చేలా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు. తమ బిడ్డకు ల్యాప్ టాప్ బహూకరించిన చైర్మెన్‌కు మధురిమ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు వేతనం పెంపు కేవలం కంటి తుడుపు చర్య

- సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ బాలపీర్



నవతెలంగాణ-దుండిగల్

మే డే సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు వేతనాన్ని రూ.1000 పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం కేవలం కంటి తుడుపు చర్యనని సీఐటీయూ బాచుపల్లి కన్వీనర్ నాగనిగల్ల బాలపీర్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో పారిశుధ్య కార్మికులు ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలు అందించారని, ఆ సమయంలో స్వయంగా సాక్షాత్తు ముఖ్య మంత్రి వారి సేవలను కొనియాడారన్నారు. అటువంటి వారికి కేవలం ఒక వెయ్యి రూపాయలు వేతనం పెంచడం పెరుగుతున్న ధరలకు, కష్టపడుతున్న సేవలకు వారి కుటుంబాలకు సరికాదన్నారు. ఈ పెంపును పునారాలోచించి ఏపీలో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనం నెలకు రూ. 21000 ఇచ్చే విధంగా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు కమిటీ హాల్ ఏర్పాటు చేయాలి

- కార్పొరేటర్‌కు ఎన్‌పీఆర్‌డీ సభ్యుల వినతి



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్‌లో దివ్యాంగుల కోసం కమిటీ హాల్ ఏర్పాటు చేయడంతో పాటు ఖాళీ స్థలం ఇప్పిం చాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి జంగిటి మల్లేష్ కోరారు. మంగళవారం కార్పొరేటర్ కొలుకుల జగన్‌ను మగ్దుమ్ నగర్‌లోని ఆయన కార్యాలయం వద్ద ఎన్‌పీఆర్‌డీ సభ్యులతో ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీ స్థలం చూపిస్తే చందాలు పోగు చేసుకొనైనా నిర్మించుకుంటామన్నారు. ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంతవరకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ సభ్యులు టి.అంజు రాణి, డి. ఆదర్శ్, తదితరులు ఉన్నారు.

లోక్‌సభ మాజీ స్పీకర్‌ను కలిసిన మాదిగ సంక్షేమ సంఘం సభ్యులు



నవతెలంగాణ-బాలానగర్

భారత దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారితో పాటు ఆమె కుమారుడు అనుషల్ అవిజిత్ బాబును హైదరాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోల్కొండ సతీష్ రానా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ మాజీ స్పీకర్, తెలంగాణ ఆవిర్భావ ప్రత్యేక బిల్లు రూపకల్పి మీరాకుమారి అని కొనియాడారు. మాదిగ సామాజిక తరగతిలో ఉన్నటువంటి అత్యంత వెనుకబడిన వారిని వెలుగులోకి తీసుకుచ్చి వారికి చేయూతనందించి వారి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ పరంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర సెక్రటేరియట్ సమీపంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం సమీపంలోనే, అదే స్థాయిలో బాబు జగజీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసేలా ప్రభుత్వాన్ని కోరాలన్నారు.. అనంతరం మీరా కుమారి మాట్లాడుతూ.. దేశంలో అత్యంత వెనుకబడిన తరగతుల జీవితాలు బాగుపడాలంటే.. సరైన విద్యా, ఉద్యోగం, ఆరోగ్యం పొందే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని తెలిపారు. దేశ రక్షణ, అభివృద్ధి కోసం రాజ్యాంగం రూపకల్పనకు ముందే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆనాడే ఒక ప్రణాళికను తయారు చేశారని గుర్తుచేశారు. వారిని కలిసిన వారిలో.. మాదిగ సంక్షేమ సంఘం నాయకులు ఎల్లం, విజయ్, రాజేష్ ,సుమన్, మరియు కాళిదాస్, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి డిప్యూటీ మేయర్ సాయం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ రూ 1,00,000 లను ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ రవి కిరణ్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహా చారి, మహేందర్ యాదవ్, కుమారి రమేష్, నర్సింగ్ రావు, కమ్మెట సంతు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బ్లూ క్రాస్ సొసైటీకి కుక్కల అప్పగింత

నవతెలంగాణ-దుండిగల్



వీధి కుక్కల నుంచి చిన్నపిల్లలు మున్సిపల్ పజలకు హాని కలుగకుండా నివారణ చర్యలలో బాగంగా మంగళవారం బహదూర్ పల్లి వార్డ్- 11,12, 13,14 నందు మున్సిపల్ కమిషనర్ కే. సత్యానారాయణ రావు బ్లూ క్రాస్ సొసైటీ వారి భాగస్వామ్యంతో 14 కుక్కలను అప్పగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి కుక్కల నివారణ చర్యల్లో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారితో ఒప్పందం చేసుకోవడం జరిగిందని.. వారు వీధి కుక్కలను తీసుకొని వెళ్లి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసి, యాంటి రేబీస్ టీకా వేసి వదులుతారని చెప్పారు. ఎండాకాలంలో కుక్కలు డీ హైడ్రెషన్ వలన వింతగా ప్రవర్తిస్తాయని కావున వాటికీ కావలసిన తాగు నీటిని, ఆహారాన్ని పిల్లలు తిరగని ప్రదేశాలలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవాన్ సురేందర్, బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మేడ్చల్ జిల్లా నియోజకవర్గాలకు అధ్యక్షులను నియమించలేదు

- జిల్లా అధ్యక్షుడు గువ్వ ముదిరాజ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లా పరిధిలోని 5 నియోజకవర్గాల డివిజన్‌లకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులను నియమించలేదని జిల్లా అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజ్ గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు అధ్యక్షుల నియమకాలను చేపట్టలేదన్నారు. తనకు తెలియకుండా పార్టీ డివిజన్‌ల అధ్యక్షులు వారి ఇష్టానుసారంగా చేపట్టిన డివిజన్ ఓబీసీ సెల్ అధ్యక్షుల నియామకాలు చెల్లవని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఓబీసీ సెల్‌లో అన్ని కులాలను సమన్వయం చేసుకొని ప్రతి ఒక్క కార్యకర్తకూ న్యాయం జరిగేలా సరైన నాయకులను త్వరలోనే ఎంపిక చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డిని కలసిన బాలానగర్ నాయకులు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డిని ఆయన నివాసంలో డివిజన్ నూతన కమిటీ సభ్యులు, ఎస్సీ విభాగం అధ్యక్షులు బందీగా బాల నర్సింహ, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు ఆకుల నరేందర్, రాము తదితరులు కలసి మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



పీ అండ్ ఎల్ విభాగం ఐజీగా మంగళవారం ఎం. రమేష్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ ఎం.రమేష్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

విజయ్ రామ్ రెడ్డికి ఆహ్వాన పత్రిక



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ పరిధిలోని నల్లగుట్ట నరసింహస్వామి ఉత్సవాలలో పాల్గొనవలసిందిగా బీఆర్ఎస్ 125 డివిజన్ అధ్యక్షులు డి విజయ్ రామ్ రెడ్డిని ఆలయ కమిటీ చైర్మెన్ అమురి ఇంద్రసేన గుప్త మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగిళ్ల శ్రీనివాస్, శ్రీరాములు, యాదయ్య, నరసింహారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చారిత్రక వైభవం నా తెలంగాణ కోటి రత్నాల వీణ



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంకు పూర్వమే శతాబ్దాల చారిత్రక వైభవం తో వెలుగొందిన తెలంగాణ విశిష్ట ఘట్టాలను నా తెలంగాణ కోటి రత్నాల వీణ నాట్య రూపకంలో రసభరితం గా ప్రదర్శించారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ 14 వ వార్షికోత్సవం సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ సాహితీవేత్త నందిని సిద్ధ రెడ్డి రచించిన నా తెలంగాణ కోటి రత్నాల వీణ నృత్య రూపకం శాస్త్రి స్వర కల్పన చేయగా ఇందిర పరాశరం నృత్య దర్శకత్వంలో ప్రదర్శితమైంది. కృష్ణ గోదావరి నడుమ ఉన్న తెలంగాణ గడ్డ కాకతీయ, శాతవాహన హైన్దవ పాలకులతో పాటు బహు మని, కుతుబ్ షాహీ అసఫ్ జాహి ముస్లిం పాలకులు పాలనలోనూ భిన్న సంస్కృతుల నిలయం గా వెల్లి విరిసింది. అటు పిమ్మట ఉద్యమాల నెలవుగా చైతన్యవంత తెలంగాణ ప్రజలు స్వరాష్ట్ర సాధన వరకూ జరిగిన సంఘటనలు హృద్యంగా నర్తకులు నర్తించారు. ప్రతి దృశ్యంలో దర్శక ప్రతిభ గీతాల లో సాహితీ విలువలు ద్యోతకమైనాయి సంగీతం శ్రావ్యంగా ఉంది. సభా కార్యక్రమానికి నందిని సిద్ధ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కళా కారులను అభినందించారు

ఆర్మీ అధికారుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారు

- బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లోని ఆర్మీ ప్రాంతాలలో మూసివేసిన రోడ్లను ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్ రెడ్డి, ఎంపీ బండి సంజయ్ చొరవతో నే ఆర్మీ అధికారులు తిరిగి తెరిచారని కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ చెప్పారు. మంగళవారం బోర్డు కార్యాలయంలోని చాంబర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తెరిచిన రోడ్ల వద్ద ఫ్యాషన్ షో చేస్తున్నారని.. సున్నితమైన రక్షణ శాఖ ప్రదేశంలో ఫ్యాషన్ షో చేయడం వల్ల ఆర్మీ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఆర్మీ అధికారులు, సిబ్బంది మనోభావాలను దెబ్బ తీసేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న మృతికి బీఆర్ఎస్ నాయకులే కారణం అని... సంచలన ఆరోపణలు చేశారు ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి కారణమని ఆరోపించారు. సాయన్న ఉన్నప్పుడు కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో మర్రి రాజశేఖర్ రెడ్డి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించి ఆయనను మానసిక వేదనకు గురైయ్యే విధంగా చేసి వేధించారని విమర్శించారు .వేదనతో సాయన్న ఆస్పత్రి పాలై మతి చెందారని చెప్పారు. దళిత నాయకులను బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జిని చేయకుండా అగ్రకులాలైన రాజశేఖర్ రెడ్డికి కట్టబెట్టారని గుర్తు చేశారు. బై ఎలక్షన్ పెట్టి సాయన్న వారసులకు అవకాశం ఇస్తే బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిని పెట్టబోమని స్పష్టం చేశారు. నాయకులు మాటలు చాలించి కంటోన్మెంట్ బోర్డ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయిం చాలని ఆయన డిమాండ్ చేశారు అభివృద్ధి గురించి తెగ మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ కు కంటోన్మెంట్ గుర్తు రావటం లేదా అని ప్రశ్నించారు.

5న 75 మంది నృత్య కళాకారులచే అన్నమయ్యకు నృత్య నీరాజనం



నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 5 న దక్షిణ భారత తొలి వాగ్గేయకారుడు అన్నమాచార్య 615 వ జయంతి సందర్భంగా శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై 75 మంది నృత్య కళాకారులు కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నాట్య ప్రక్రియలలో అన్నమయ్య కీర్తనలతో నర్తిస్తారని నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్, అన్నమాచార్య మిషన్ ట్రస్టీ కామిశెట్టి గోదా లక్ష్మి ఎస్.ఎస్.ఎస్. కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ రమణ పాల్గొంటారని, అతిథులుగా జీ. వసుంధర, నాట్య గురువు డాక్టర్ వనజాఉదయ్, కవి ఫణీంద్ర పాల్గొంటారని చెప్పారు. నృత్య గురువులు ఇందిరాహేమ, రేణుకా ప్రభాకర్, పెరిణి కుమార్,శృతి కిరణ్, వాణీ రమణ,చంద్ర శేఖర్,మాధవీ మాల తదితరులు శిష్య బృందం నాట్య నీరాజనం లో పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రిక ను పే అండ్ అకౌంట్స్ ఉప సంచాలకులు వసుంధర తో కలసి సుదామాల ఆవిష్కరించారు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

తహసీల్దార్ విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తి పై కేసు నమోదైన ఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ మన్మోహన్ తెలిసిన వివరాల ప్రకారం మద్దెల రమేష్ అనే వ్యక్తి అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో ఉన్న తహసీల్దార్ అనితా రెడ్డి విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రమేష్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ -సిటీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్) మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ఆధునిక సౌకర్యాలతో అత్యద్భుతంగా నిర్మించిన సమీకృత సచివాలయం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయామని కొనియాడారు. ఇంత మంచి సచివాలయాన్ని నిర్మించిన ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యోగులు కృతజ్ఞతతో ఉంటారని అన్నారు.

ఐపీఎల్‌లో హులిగనిజం!

హులిగనిజం (పోకిరితనం) మన క్రీడలకు పెద్దగు పరిచయం లేని పేరు. యూరోపియన్ ఫుట్‌బాల్ లీగ్‌ల్లో రెండు దేశాల అభిమానులు, లేదా రెండు క్లబ్‌ల అభిమానులు మైదానాల్లో కొట్టుకోవటం చూసి..ఇదేమీ తీరని ముక్కున వేలేసుకున్నాం. ఇప్పుడు ఆ విష సంస్కృతి భారత్‌లో, ఐపీఎల్ ద్వారా క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. తాజా ఐపీఎల్ సీజన్లో ఓ వైపు క్రికెటర్లు హద్దులుమీరి ప్రవర్తిస్తుండగా.. మరోవైపు అభిమానులు ఏకంగా పరస్పర భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కాసుల వేటలో బీసీసీఐ మొదలెట్టిన ఐపీఎల్.. ఇప్పుడు క్రీడాభిమానుల మధ్య చిచ్చు రగిల్చింది!.

- ఇటు క్రికెటర్లు, అటు అభిమానుల బాహాబాహి
- జెంటిల్‌మెన్ గేమ్‌లో పెట్రేగుతున్న పోకిరితనం


విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ వాగ్వాదం


కోహ్లితో మేయర్స్ మాట్లాడుతుండగా.. మాట్లాడొద్దని మేయర్స్‌ను తీసుకెళ్తున్న గంభీర్


ఢిల్లీ, హైదరాబాద్ మ్యాచ్‌లో అభిమానుల గొడవ

నవతెలంగాణ క్రీడావిభాగం

అభిమానుల కోట్లాట

జెంటిల్‌మెన్ ఆటకు నిదర్శనం క్రికెట్. మైదానం లోపల, వెలుపల క్రీడాస్ఫూర్తికి క్రికెట్ నిలువుటద్దం. క్రికెట్ ఆడే దేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాల కారణాల రీత్యా కొన్ని దేశాలు ఆడుతున్నప్పుడు కృత్రిమంగానే కనిపించే హులిగనిజం.. ఇప్పుడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రూపంలో నేరుగా క్రికెట్ ఆటలోకే ప్రవేశించింది. ఇరు ఫ్రాంచైజీల అభిమానులు మైదానంలో బాహాబాహికి దిగటమే హులిగ నిజం. ఫ్రాంచైజీలు, జట్లపై దురభిమానంతో మైదానంలోనే పరస్పర దాడులు చేసుకోవటం యూరోపియన్ సాకర్ లీగ్‌లో సర్వ సాధారణం. అక్కడి దురభిమానులు గొడవ చేయాలనే ప్రణాళికతోనే మైదానాల్లోకి అడుగుపెడతారనే విమర్శలు సైతం ఉన్నాయి. అయితే, ఇవేవీ ఇప్పటివరకు భారత్‌లోగానీ, క్రికెట్‌లో గానీ చోటుచేసుకోలేదు. కానీ ఇప్పుడు ఐపీఎల్ రాకతో హులిగనిజం సైతం భారత క్రీడా రంగంలోకి అడుగుపెట్టింది. వాణిజ్య విలువలతో కూడిన ఫ్రాంఛైజీ స్పోర్ట్స్ కోరుకునేది ఇటువంటి ఘర్షణే. ఆట పక్కదారి పట్టి.. ఫ్రాంఛైజీల ఆధిపత్య పోరు తెరపైకి రావటంతో మార్కెట్‌లో బ్రాండింగ్ ప్రమోషన్‌కు ఉపకరిస్తుంది!.

ఐపీఎల్‌లో అభిమానులు బాహా బాహికి దిగిన రెండు సంఘటనల్లో ఒకటి హైదరాబాద్‌లో చోటుచేసుకోవటం గమనార్హం. ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ఇరు జట్ల దురభిమానులు ఘర్షణకు దిగారు. కార్పోరేట్ బాక్సుల్లో ఉన్నవారు మద్యం సేవించి దాడులకు సిద్ధపడ్డారు. ఇక తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో సైతం ఇదే సన్నివేశం పునరావృతం అయ్యింది. అక్కడా, మద్యం మత్తులో ఇరు జట్ల దురభిమానులు కొట్లాటకు దిగారు. దురభిమానుల గొడవ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

క్రికెటర్లు సైతం అదే బాట

ఓ వైపు అభిమానుల నడుమ పరస్పర దాడులు జరుతుండగానే.. మరోవైపు ఇరు జట్ల క్రికెటర్లు సైతం మైదానంలోనే బాహాబాహికి దిగుతున్నారు. లక్నో సూపర్‌జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌లో లక్నో మెంటార్ గౌతం గంభీర్, బెంగళూర్ కెప్టెన్ విరాట్ కోహ్లి కొట్టుకునే వరకు వెళ్లారు. గతంలో బెంగళూర్ సొంతగడ్డ చిన్న స్వామిలో విజయం అనంతరం గంభీర్ అభిమానులను ఉద్దేశించి సంజ్ఞలు చేశాడు. లక్నోలో మ్యాచ్ సందర్భంగా వైరం కాదు ప్రేమ పంచాలంటూ విరాట్ కోహ్లి సంజ్ఞలు చేశాడు. ఇక్కడితో మొదలైన గంభీర్, కోహ్లి వైరం.. మ్యాచ్ ముగిసినా ఆగలేదు. మ్యాచ్ మధ్యలో లక్నో ఆటగాడు నవీన్ ఉల్ హక్, కోహ్లి మధ్య స్లెడ్జింగ్ చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం కోహ్లితో లక్నో క్రికెటర్ కైల్ మేయర్స్ క్రీడా స్ఫూర్తితో మాట్లాడుతూ ఉండగా.. గౌతం గంభీర్ వచ్చి అతడిని కోహ్లికి దూరంగా తీసుకెళ్లాడు. దీని పట్ల కోహ్లి ఇదేంటని ప్రశ్నించగా.. గౌతం గంభీర్ దుందుడుకుగా వ్యవహరించాడు. కెఎల్ రాహుల్ వచ్చి జోక్యం చేసుకున్నప్పటికీ గంభీర్ ఆవేశంగానే కనిపించాడు. నవీన్ ఉల్ హక్ సైతం మ్యాచ్ అనంతరం కోహ్లితో మాట్లాడేందుకు కెప్టెన్ రాహుల్ కోరినా నిరాకరించాడు. విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ గొడవ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

> 'విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ మధ్య చోటుచేసుకున్న గొడవ ఆటకు మంచిది కాదు. విరాట్ కోహ్లి క్రికెట్‌లో ఓ దిగ్గజం. ఇటువంటి గొడవల్లో నిలవాల్సింది కాదు. 2008 ఐపీఎల్‌లో శ్రీశాంత్‌పై చేయి చేసుకున్నందుకు ఇప్పటికి సిగ్గుపడుతున్నాను'
>
> - హర్భజన్ సింగ్, మాజీ క్రికెటర్



> 'ఐపీఎల్‌లో చోటుచేసుకుంటున్న ఆన్ ఫీల్డ్ దురుసు ప్రవర్తనలపై బీసీసీఐ-ఐపీఎల్ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఐపీఎల్ మ్యాచుల్లో గొడవల దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారటం బాధాకరం. ఆటకు ఇది ఏమాత్రం మంచి సంప్రదాయం కాదు. ఆటను దెబ్బతీసే పరిస్థితులపై బోర్డు కఠినంగా ఉండాలి'
>
> - రత్నాకర్ శెట్టి, మాజీ జనరల్ మేనేజర్, బీసీసీఐ

బీసీసీఐ ఏం చేస్తోంది!?

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అనునిత్యం ఆదాయ మార్గాలపైనే మనసు పెడుతుంది. యావత్ దేశ ప్రజలు అభిమానించే ఆటకు జాతీయ స్పోర్ట్స్ ఫెడరేషన్‌గా కొనసాగుతున్న బీసీసీఐ ఇప్పటివరకు ఏ సమస్యపైనా, సామాజిక అంశంపైనా స్పందించిన చరిత్ర లేదు. క్రికెట్‌లో జాతి వివక్షకు వ్యతిరేకంగా ప్రపంచ క్రికెటర్లు, ఐసీసీ సైతం ముందుకొచ్చినా బీసీసీఐలో చలనం కనిపించలేదు. తాజాగా ఐపీఎల్‌లో హులిగనిజంపైనా బీసీసీఐ చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది. హులిగనిజం ఓ విషసర్పం. ప్రత్యర్థి జట్టు, ప్రత్యర్థి జట్టు అభిమానుల పట్ల ద్వేష భావం, వైరం పెంచేందుకు ఇది దోహదం చేస్తుంది. అటువంటి తీవ్రమైన సమస్యను ఆరంభంలోనే తొక్కిపెట్టాల్సిన అవసరం ఉంది. ఐపీఎల్‌లో ఫ్రాంఛైజీల సొంత బ్రాండింగ్‌కు హులిగనిజం నిదర్శనంగా కనిపిస్తుండగా.. బీసీసీఐ ఈ విషయంలో జోక్యం చేసుకుంటుందా? లేదా? అనేది ఆసక్తికరం.

భారీ జరిమానా

లక్నో, బెంగళూర్ మ్యాచ్‌లో ఘర్షణకు దిగిన ఆటగాళ్లపై మ్యాచ్ రిఫరీ భారీ జరిమానా విధించాడు. విరాట్ కోహ్లి, గౌతం గంభీర్‌కు మ్యాచ్ ఫీజులో 100 శాతం కోత విధించగా.. నవీన్ ఉల్ హక్‌కు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పెట్టారు. దీంతో కోహ్లి రూ.1.07 కోట్లు, గంభీర్ రూ.25 లక్షలు, నవీన్ ఉల్ హక్ రూ.1.79 లక్షలు జరిమానా రూపంలో కోల్పోయారు. ఐపీఎల్ క్రమశిక్షణ నియామవళి ఆర్టికల్ 2.21 ప్రకారం లెవల్ 2 తప్పిదానికి పాల్పడినట్టు కోహ్లి, గంభీర్, నవీన్ ఉల్ హక్‌లు మ్యాచ్ రిఫరీ ముందు అంగీకరించారు.

టైటాన్స్‌కు చుక్కెదురు

- గుజరాత్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు
- ఛేదనలో హార్దిక్ పోరాటం వృథా



నవతెలంగాణ-అహ్మదాబాద్ : పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టుతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉన్న జట్టు పోరు. సహజంగానే అగ్రజట్టు విజయం సాధిస్తుందనే అంచనాలు ఉంటాయి. అందుకు తగినట్టుగానే తొలి 20 ఓవర్ల ఆట సాగింది. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుతమే చేసింది. 23 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన స్థితి నుంచి 130 పరుగులు నమోదు చేసిన వార్నర్‌సేన.. ఐపీఎల్ చరిత్రలోనే ఛేదనలో అత్యుత్తమ జట్టు గుజరాత్ టైటాన్స్‌పై 5 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 131 పరుగుల ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 125 పరుగులే చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య (59 నాటౌట్, 53 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో చివరి వరకు క్రీజులో నిలిచినా.. జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. చివరి 12 బంతుల్లో 33 పరుగులు చేయాల్సిన సమయంలో నోకియాపై రాహుల్ తెవాటియ (20, 7 బంతుల్లో 3 సిక్సులు) హ్యాట్రిక్ సిక్సర్లతో మ్యాచ్‌ను టైటాన్స్ వైపు తిప్పాడు. కానీ చివరి ఓవర్లో ఇషాంత్ శర్మ (2/23) 12 పరుగులను కాపాడుకుని, క్యాపిటల్స్‌కు సీజన్లో మూడో విజయాన్ని అందించాడు. టైటాన్స్ సైతం ఛేదనలో 32/4తో కష్టాల్లో పడినా హార్దిక్ పాండ్య తోడుగా అభినవ్ మనోహర్ (26) జట్టును ఆదుకున్నాడు. సాహా (0), గిల్ (6), విజయ్ శంకర్ (6), డెవిడ్ మిల్లర్ (0) విఫలమయ్యారు. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు టైటాన్స్ పేసర్ మహ్మద్ షమి (4/11) చుక్కలు చూపించాడు. షమి దెబ్బకు ఆ జట్టు 23 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. సాల్ట్ (0), వార్నర్ (2), గార్గ్ (10), రొసో (8), మనీశ్ పాండే (1) విఫలమయ్యారు. అక్షర్ పటేల్ (27), అమన్ హకీమ్ ఖాన్ (51), రిపాల్ పటేల్ (23) పోరాటంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 130 పరుగులు చేయగల్గింది.



భారత్ @ నం.1

దుబాయ్ : భారత జట్టు వరల్డ్ నం.1గా నిలిచింది. టీ20 ఫార్మాట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమ్ ఇండియా తాజాగా టెస్టుల్లోనూ టాప్ లేపింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్ నం.1 స్థానం సాధించింది. ఆస్ట్రేలియాపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 2-1తో గెల్చుకున్న భారత్.. 121 రేటింగ్ పాయింట్లు సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియా 122 నుంచి 116 పాయింట్లకు పడిపోయి రెండో స్థానంలో నిలిచింది. జూన్ 7న ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో వరల్డ్ నం.1 భారత్‌తో వరల్డ్ నం.2 ఆస్ట్రేలియా పోటీపడనుంది. ఇంగ్లాండ్ (114), దక్షిణాఫ్రికా (104), న్యూజిలాండ్ (100) టాప్-5లో కొనసాగుతున్నాయి. వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ నం.2గా నిలువగా.. ఆస్ట్రేలియా అగ్రస్థానం సాధించింది.



స్విమ్మింగ్ విజేతలకు బహుమతుల ప్రదానం

7హెచ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జిహెచ్ఎంసి స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై విభాగాల్లో అండర్-10 నుంచి అండర్-17 గర్ల్స్, బాయ్స్‌కు పోటీలు నిర్వహించారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, స్విమ్మర్ గోలి శ్యామల, జిహెచ్ఎంసి స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్, 7హెచ్ స్పోర్ట్స్ డైరెక్టర్ బి.వెంకటేశ్ బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

నవచిత్రం

సరికొత్త సెల్ఫిష్


ఆశిష్

హీరో ఆశిష్, నూతన దర్శకుడు కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నిర్మాత దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న యూత్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్ 'సెల్ఫిష్'. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను లాంచ్ చేశారు. ఇది హీరో పాత్ర తాలుకా మరొక కోణం చూపుతుంది. 'దిల్ ఖుష్' పాటలో కథానాయిక పాత్ర పోషించిన ఇవానాని ఆరాధించే కథానాయకుడి ఆనందాన్ని ప్రజెంట్ చేస్తుంది.

ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ,"రౌడీ బాయ్'తో ఆశిష్‌కు మంచి మార్కులు పడ్డాయి. సెల్ఫిష్ కథ విన్నప్పుడు ఆశిష్‌కు బావుంటుందనిపించింది. ఈ పాట లిరిక్స్ విషయంలో మొదటి నుంచి చాలా పట్టుదలగా వున్నాను. ఇందులో ఇదొక్క పాటే మిక్కీ జే మేయర్ చేస్తున్నారు. అనూప్ రుబెన్స్ మరో రెండు పాటలు చేశారు. మరో రెండు పాటలు వేరే సంగీత దర్శకులు చేస్తారు. సినిమాకి సరిపోయేలా కొత్తగా చేయాలని ప్రయత్నిస్తున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమా కోసం నేను, దర్శకుడు కాశీ చాలా కష్టపడ్డాం. ఇది మాకు లైఫ్ ఇచ్చే సినిమా. ఈ పాట నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది' అని హీరో ఆశిష్ తెలిపారు. దర్శకుడు విశాల్ కాశీ మాట్లాడుతూ, 'క్యారెక్టరైజేషన్ సెల్ఫిష్ మాస్ లవ్ స్టోరీ. మీ అందరికీ నచ్చుతుంది. ఆశిష్ తన పాత్రని అద్భుతంగా చేస్తున్నారు' అని అన్నారు.

నాందికి మించి..


విశ్వక్‌సేన్, సందీప్‌కిషన్, అల్లరి నరేష్, నిఖిల్, అడివి శేష్

'నాంది'తో విజయవంతమైన చిత్రాన్ని అందించిన హీరో అల్లరి నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల మరో యూనిక్, ఇంటెన్స్ మూవీ 'ఉగ్రం'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. ఈనెల 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో 'ఉగ్రం' ప్రీరిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ,' 'నాంది'కి మించి ఈ సినిమా ఉండాలని చేశాం. ఆ అంచనాలని అందుకోవడానికి నాతో పాటు విజయ్, సిద్, అబ్బూరి రవి, శ్రీచరణ్ .. అందరూ కష్టపడి పని చేశారు. మా నిర్మాతలు సాహు, హరీష్ ఎక్కడా రాజీపడకుండా చేశారు. ఫైట్ మాస్టర్స్ రామకృష్ణ, పృథ్వీ, వెంకట్.. హై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లు డిజైన్ చేశారు. ఇందులో ఆరు ఫైట్లు ఉంటాయి. ఇందులో నటనపరంగా నా ఉగ్ర రూపం చూడబోతున్నారు' అని తెలిపారు. 'నరేష్ 'నాంది'తో నన్ను నమ్మేశారు. ఉగ్రంలో యాక్షన్ సీక్వెన్స్‌లో ఎక్కడా రాజీపడకుండా చేశారు' అని దర్శకుడు విజయ్ కనకమేడల చెప్పారు.

ఘనంగా దాసరి ఫిల్మ్ అవార్డ్స్



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రసాద్ ల్యాబ్‌లో దాసరి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభ పలువురు సినీ దిగ్గజాల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో దర్శకుడు కృష్ణవంశీ, హీరో శ్రీకాంత్, డాక్టర్ బ్రహ్మానందం, నిర్మాత హర్షిత్ రెడ్డి, వంశీ రామరాజు, కళా జనార్ధన్, వైజాగ్ డిస్ట్రిబ్యూటర్ గౌరీ శంకర్, దివాకర్, పబ్లిసిటీ డిజైనర్ రాంబాబు, వి.ఎఫ్.ఎక్స్ చందు, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు ప్రభు, ధీరజ అప్పాజీ, కవిరత్న చింతల శ్రీనివాస్ తదితరులు దాసరి ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్య నారాయణ, వాసవి ఫిల్మ్ అవార్డ్స్ వ్యవస్థాపకులు కొత్త వెంకటేశ్వరరావు, మడిపడిగె రాజు, ముఖ్య సలహాదారులు బండారు సుబ్బారావు. పబ్బతి వెంకట రవి కుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో ఆంధ్ర, తెలంగాణలో పలు రంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభావంతులకు కూడా ఈ పురస్కారాలు ప్రదానం చేశారు.

పెద్ద తప్పు చేశాం


'ఏజెంట్'లో అఖిల్


అనిల్ సుంకర

అఖిల్ కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో (సుమారు రూ.80 కోట్లు) రూపొందిన చిత్రం 'ఏజెంట్'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్‌రెడ్డి 2 పతాకాలపై ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా భారీ అపజయాన్ని చవిచూసింది. విడుదలైన తొలి రోజు తొలి షో నుంచే సర్వత్రా ఈ సినిమా డిజాస్టర్ అనే టాక్ వచ్చింది. అసలు కథ లేకుండానే సినిమా తీశారని, అలాగే 'రా' ఏజెంట్ల పని తీరుపై ఏ మాత్రం అవగాహన లేకుండా సన్నివేశాలను చిత్రీకరించడం హాస్యాస్పదమని.. అన్నింటికీ మించి అఖిల్ లాంటి హీరో స్థాయిని మించి భారీ బడ్జెట్ పెట్టారని.. ఇలా ఈ చిత్రంపై సోషల్‌మీడియా వేదికగా కామెంట్ల మీద కామెంట్లు వెల్లువెత్తాయి. వీటికి నిర్మాత అనిల్ సుంకర స్పందిస్తూ "ఏజెంట్ ఫలితం విషయంలో పూర్తి బాధ్యత మాదే. పెద్ద టాస్క్ అని తెలిసినా దాన్ని సాధించగలమనే నమ్మకంతో ఈ సినిమా చేశాం. అయితే అది ఫెయిల్ అయింది. బౌండెడ్ స్క్రిప్ట్ పక్కాగా రెడీ కాకముందే సినిమా ప్రారంభి పెద్ద తప్పు చేశాం. మధ్యలో కోవిడ్ సహా పలు సమస్యలు వచ్చాయి. అయితే సినిమా ఫలితం విషయంలో ఎలాంటి సాకులు చెప్పాలనుకోవడం లేదు. ఈ కాస్ట్‌లీ మిస్టేక్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ఈ తరహా తప్పులు పునరావృతం కాకుండా ఏం చేయాలో చూస్తాం. మాపై ఎంతో నమ్మకం పెట్టుకున్న వారికి క్షమాపణలు చెబుతున్నాను. తదుపరి ప్రాజెక్టుల్లో ఆ లోటును భర్తీ చేస్తామని ప్రేక్షకులకు మాట ఇస్తున్నాను' అని ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు.

గ్రూట్ వీరాభిమాని..


సల్మాన్ ఖాన్

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ'లో సల్మాన్ ఖాన్ చేరాడా?, గ్రూట్ అతనికి ఎలా స్ఫూర్తినిస్తున్నాడో తెలుసుకోవడానికి చిత్ర బృందం రిలీజ్ చేసిన ప్రత్యేక వీడియో చూడాల్సిందే. 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3' ఈ వారం విడుదల కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యంగా భారతీయ అభిమానులు తమ అభిమాన గ్రూట్ కోసం ఎదురుచూస్తున్నారు అందులో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ కూడా ఒకరు. గ్రూట్ ప్రపంచవ్యాప్తంగా చాలా మంది అభిమానుల హృదయాల్లో తన ముద్ర వేసుకున్నాడు.సల్మాన్ ఖాన్ తక్కువ మాటలు మాట్లాడే వ్యక్తి. అయినప్పటికీ ఈ వీడియోలో సల్మాన్ హాస్యభరితమైన టేక్‌తో గ్రూట్ స్టైల్‌లో అలరించడం విశేషం. ఈనెల 5న (శుక్రవారం) ఈసినిమా ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.

రియల్ ఇన్సిడెంట్స్‌తో..


అనిరుధ్, సాగర్ కె. చంద్ర, భిక్షపతిరాజు

శ్రీ వేంకటేశ్వర క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అనిరుధ్, యశస్విని జంటగా భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో, చంద్రకళ పందిరి నిర్మించిన రియల్ ఇన్సిడెంట్ బేస్డ్ స్టోరీ 'యాద్గిరి అండ్ సన్స్'. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 'భీమ్లా నాయక్' దర్శకుడు చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. హీరో అనిరుధ్ మాట్లాడుతూ, 'ఇది నా డెబ్యూ చిత్రం. ఈ సినిమా రియల్ ఇన్సిడెంట్స్‌తో తెరకెక్కింది. అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి. థియేటర్‌కి వచ్చి సినిమా చూసి వెళ్లేటప్పుడు.. ఒక మంచి సినిమా చూశామనే ఫీలింగ్ ఖచ్చితంగా ఈ సినిమా ఇస్తుంది' అని తెలిపారు.'ఒక మంచి సినిమాని ప్రేక్షకులకు అందించే ప్రయత్నం చేశాను. సినిమా చూసి.. ప్రేక్షకులే ఇక డిసైడ్ చేయాలి. ఈనెల 5న సినిమాని థియేటర్లలో విడుదల చేయబోతున్నాం. అందరూ ఈ సినిమా చూసి.. నచ్చితే ఇంకో పది మందికి చెప్పి.. మంచి సక్సెస్ చేస్తారని కోరుతున్నాను' అని దర్శకుడు భిక్షపతి రాజు అన్నారు. 'భీమ్లా నాయక్' దర్శకుడు సాగర్ కె చంద్ర మాట్లాడుతూ, 'ట్రైలర్ చూశాను. చాలా ఇన్నోవేటివ్‌గా ఉంది. రియల్ ఇన్సిడెంట్స్‌తో ఇటువంటి సినిమాని రూపొందించడం గ్రేట్. చాలా మంచి అటెంప్ట్ చేశారు' అని చెప్పారు.

దిగ్గజ బాస్కెట్ బాల్ ఆటగాడి కథ..


బెన్ ఎఫ్లెక్

అమెజాన్ స్టూడియోస్, స్కైడ్యాన్స్ స్పోర్ట్స్, ఆర్టిస్టు ఈక్విటీ, మాండలే పిక్చర్స్ రూపొందించిన 'ఎయిర్' చిత్రం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ చిత్రం ఈనెల 12 నుంచి ఇండియాలో ప్రైమ్ వీడియోలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంలో స్ట్రీమింగ్ కానుంది. అవార్డులు గెలుచుకున్న డైరెక్టర్ బెన్ ఎఫ్లెక్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర కథ ఎయిర్ జోర్డన్ బ్రాండ్‌తో ప్రపంచ క్రీడలను, సమకాలీన సంస్కృతిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నైకీకి చెందిన అప్పటి బాస్కెట్ బాల్ డివిజన్‌కు చెందిన మైకేల్ జోర్డన్‌కు చెందిన నమ్మశక్యం కాని ఆటను మలుపు తిప్పిన భాగస్వామ్యాన్ని వెల్లడిస్తుంది. అన్నింటినీ పాటిస్తూ సంప్రదాయన్ని ధిక్కరించేలా సాగే ఆట అందర్ని కదిలిస్తుంది.

తన కుమారుడిలో ఉన్న అద్భుత నైపుణ్యం గురించి ఏ మాత్రం రాజీపడని తల్లి, చరిత్రలో నిలిచిపోయిన దిగ్గజ బాస్కెట్ బాల్ ఆటగాడి కథ ఇది.

మ్యాట్ డ్యామన్ నటించిన ఈ చిత్రాన్ని బెన్‌ఎఫ్లెక్ దర్శకత్వం వహించడం ఇదే మొదటిసారి. అలెక్స్ కన్వరీ స్క్రిప్ట్ రాసిన ఈ చిత్రాన్ని డేవిడ్ ఎలిసన్, జెస్సీ సిస్‌గోల్డ్, జాన్ వెయిన్‌బాచ్, ఎఫ్లెక్, డ్యామన్, మ్యాడిసన్ ఐన్లీ, జెఫ్ రాబినోవ్, పీటర్ గూబర్, జాసన్ మైకేల్ బెర్మన్ నిర్మించారు. అమోజన్‌లో సైతం ఈ సినిమా వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందనే దీమాతో ఉన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అంతర్జాతీయ స్థాయిలో నెహ్రూ జూపార్కు

- ఇతర పార్కుల అప్‌గ్రేడ్, సకల సౌకర్యాల కల్పన : అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- జూపార్కులో ఎంట్రీ ఫీజు పెంపునకు జపాట్ ఆమోదం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కును తీర్చిదిద్దుతామనీ, ఇతర పార్కులను అప్‌గ్రేడ్ చేసి సకల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో జపాట్ (జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) పాలకమండలి సమావేశం నిర్వహించారు. కాకతీయ జూ పార్క్(హన్మకొండ), పిల్లలమర్రి మినీ జూపార్క్(మహబూబ్ నగర్), లోయర్ మానేరు డీర్ పార్క్(కరీంనగర్), కిన్నెరసాని డీర్ పార్క్(పాల్వంచ)లలో జంతు సంరక్షణ- ప్రదర్శన చర్యలు, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సౌకర్యాల కల్పనపై ప్రధానంగా సమావేశంలో చర్చించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెహ్రూ జూ పార్క్‌లో సౌకర్యాలను మెరుగు పరచాలనీ, వన్య ప్రాణుల ఆవాసాలను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఇంకా ఆకర్షణీయమైన జంతువులను దిగుమతి చేసుకోవటం, పులి, సింహం ఎన్ క్లోజర్లను గ్లాస్ పార్టీషన్ తో అతిదగ్గరి నుంచి చూసే ఏర్పాటు, సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు, పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. నెహ్రూ జూ పార్క్ లో ప్రస్తుతమున్న సౌకర్యాలు, అభివృద్ధికి అవకాశాలున్న అంశాలపై క్యూరేటర్ ప్రశాంత్ పాటిల్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మీరాలం ట్యాంక్ నుంచి జూ పార్క్ లోకి వచ్చే నీటిని నియంత్రించటం, మిషన్ భగీరథ ద్వారా జంతువులకు తాగునీటి వసతిని సంబంధిత శాఖ అధికారులతో చర్చించాలని నిర్ణయించారు. పెరిగిన యాజమాన్య ఖర్చులను దష్టిలో పెట్టుకుని నెహ్రూ జూ పార్క్ ఎంట్రీ ఛార్జీలను నామమాత్రంగా పెంచేందుకు పాలక మండలిలో నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.45 ఎంట్రీ ఫీజు తీసుకోవాలనీ, సెలవు రోజుల్లో పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.55 తీసుకోవాలని తీర్మానించారు. జంతువులను దత్తత తీసుకుని, నిర్వహణ వ్యయాన్ని విరాళంగా ఇచ్చే సదుపాయాన్ని మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. నిపుణుల సూచనలతో వీలైనంత త్వరగా అమలుకు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆదేశించారు. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం.డోబ్రియాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతితో హైదరాబాద్‌తో పాటు అన్ని జూ పార్క్‌లు, నేషనల్ పార్క్‌లను, అర్బన్ ఫారెస్ట్ పార్క్ లను పర్యావరణహితంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో జూ పార్క్ డైరెక్టర్ వినయ్ కుమార్, ఓఎస్డీ శంకరణ్, జపాట్ పాలకమండలి సభ్యులు, వివిధ జూ పార్క్‌లు, జాతీయ పార్కుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- కబ్జాదారులపై జవహర్‌నగర్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఖాళీ స్థలాలపై కన్నేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కొరడా ఝులిపించింది. మంగళవారం ఉదయం హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం స్థానిక పోలీసుల సహకారంతో సంయుక్తంగా కూల్చివేశాయి. హెచ్ఎండీఏ పరిధిలోని పలు సర్వే నెంబర్లలో దాదాపు మూడు వేల(3,000) గజాల స్థలాల్లో వచ్చిన అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. వాటిల్లో మూడు ఇండ్లు, ఐదు బేస్మెంట్లు, కొన్ని కరెంటు స్తంభాలు, కొన్నిచోట్ల కాంపౌండ్ వాల్ నిర్మాణాలు ఉన్నాయి. హెచ్ఎండీఏ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిని గుర్తించారు. వారిపై జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు.

రైతుల బాధలు కేసీఆర్‌కు పట్టవా? వైఎస్ షర్మిల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతుల బాధలు కేసీఆర్ ప్రభుత్వానికి పట్టటం లేదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 23 జిల్లాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. అకాల వర్షాలకు సుమారు 10లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. మహబూబాబాద్, ఖమ్మం, జనగాం జిల్లాల్లో మూడు రోజులపాటు పర్యటించానని తెలిపారు.రూ. 30-40వేలు అప్పులు చేసి, పెట్టుబడి పెట్టామనీ, ఇప్పుడు వర్షాలకు చేతికందిన పంట నష్టపోవటంతో రైతులు బోరున విలపించారని చెప్పారు.రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నామంటూ గొప్పలకు పోతున్న సీఎం కేసీఆర్ తమ వాగ్దానాలు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇంత నష్టం జరిగినా వారి దగ్గరకు ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధులు పోలేదని తెలిపారు.

'నేషనల్ కరికులం' జాతీయ సమైక్యతకు గొడ్డలిపెట్టు

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

- సంక్షేమ నిధి ఉపాధ్యాయులకు ప్రయోజనకరం : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ- నల్లగొండ

నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ 2023- జాతీయ సమైక్యతకు గొడ్డలి పెట్టు అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అఖిలభారత ఉపాధ్యాయ ఉద్యమ జాతీయ నాయకులు, యూటీఎఫ్ పూర్వ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ ఆడిటోరియంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రారంభించిన కుటుంబ సంక్షేమనిధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పూర్వకాలంలో ప్రాచీన భారతదేశంలో అవలంబించిన హిందూ వాదాన్ని ప్రాథమిక విద్య నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చొప్పించాలని కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలిపారు. దేశ చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తూ ఇతర మతాల రాజుల చరిత్రను పుస్తకాల నుంచి చెరిపి వేస్తున్నారన్నారు. అందువల్ల రాబోవు తరాలకు వాస్తవాలు తెలియకుండా పోతాయని, ఇది జాతీయ సమైక్యతకు మంచిది కాదని చెప్పారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. దాచూరి రామిరెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ప్రారంభిస్తున్న కుటుంబ సంక్షేమనిధి ఉపాధ్యాయులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. రామిరెడ్డి ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సంక్షేమానికి ఒక విధానం ఉండాలని కోరుకునేవారని తెలిపారు. ఆయన మేధస్సు నుంచి పుట్టిన ఆలోచనే ఈ కుటుంబ సంక్షేమ నిధి కార్యక్రమం అన్నారు. దీనిలో సంఘంలోని ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని, వివిధ కారణాల వల్ల మరణించిన సభ్యుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కుటుంబ సంక్షేమనిధి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ.. కుటుంబ సంక్షేమ నిధి కార్యాలయం నల్లగొండలో ఉన్నా కూడా.. ఇది రాష్ట్ర కుటుంబ సంక్షేమనిధి బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.రాములు, సిహెచ్.దుర్గ భవాని, కోశాధికారి టీ.లక్ష్మారెడ్డి, ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎం.సంయుక్త , టీపీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు బి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు పాల్గొన్నారు.

జలగలాంటిది ఎన్డీఏ ప్రభుత్వం

పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం : సీపీఐ జాతీయ కార్యదర్శి డా కె.నారాయణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల రక్తాన్ని పీల్చే జలగలాంటిదని, మోయలేని పన్నుల భారాలతో ప్రజలు విలవిల్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ అన్నారు. ప్రధాని మోడీ పాలనలో దేశంలో పేదరికం, నిరుద్యోగం, అసమానతలు గణనీయంగా పెరిగిపోయాయని తెలిపారు. "బీజేపీ హటావ్-దేశ్ బచావ్" నినాదంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట, నాగార్జున సర్కిల్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవితో కలిసి పాదయాత్ర చేశారు. కరపత్రాలు పంచుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడిదారుల లాభాలు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు నిండా మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు, ఔషధాలు ధరల భారీగా పెరిగి సామాన్య ప్రజలు జీవించలేని స్థితిలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య ద్వేషాలను రెచ్చగొడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని ధ్వంసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంజాగుట్టలో పబ్లిక్ - ప్రయివేటు పార్ట్‌నర్‌షిప్‌లో నిర్మించిన శ్మశాన వాటికను బ్యాగారి వృత్తిదారులతో కలిసి పరిశీలించారు. శ్మశాన వాటికల ప్రయివేటీకరణను అడ్డుకుంటామని నారాయణ చెప్పారు.

కాటి కాపరుల వృత్తిని దెబ్బతీస్తే ఊరుకునేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి శ్మశాన వాటికల ప్రయివేటీకరణను విరమించుకోవాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, నాయకులు ఆరుట్ల రాజ్ కుమార్, శక్రి భాయ్, చెతన్య యాదవ్, బాలకృష్ణ, బి.రాజు గౌడ్, కళ్యాణ్, ఎండి. అహ్మద్, అబ్బాస్ పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుతో జూడాల చర్చలు సఫలం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపకారవేతనం పెంపు డిమాండ్‌తో బుధవారం నుంచి సమ్మెకు వెళతామని ఇదివరకే ప్రకటించిన తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) తాజాగా వాయిదా వేసింది. మంగళవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావుతో టీజూడా నాయకులు చర్చించారు. ఇంటర్నీలు, పీజీలు, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్స్‌కు 15 శాతం ఉపకారవేతనం పెంపు పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని హరీశ్ రావు తెలిపారు. ప్రస్తుతం సీఎం ఆమోదం కోసం ఉందని చెప్పారు. 2021 మే నెలలో ఉపకారవేతనం

సమ్మె వాయిదా

పెంపుదల జరిగిందనీ, ఈసారి కూడా మేలో జరుగుతుందని హామీ ఇచ్చారు. చర్చల అనంతరం సమ్మెను ప్రస్తుతం వాయిదా వేస్తున్నామని టీజూడా అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ కుమార్ పింజరాల ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి హరీశ్‌రావు జూనియర్ డాక్టర్లకు ఎప్పుడూ అండగా ఉంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హామీ, ప్రజా ఆరోగ్య పరిరక్షణను పరిగణనలోకి తీసుకుని సమ్మెను వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. ఉపకారవేతనం పెంపుదలతో పాటు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన పెండింగ్ ఉపకారవేతనాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్ టీచర్లకు కారుణ్య నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని టీఎంఎస్‌టీఏ అధ్యక్షులు భూతం యాకమల్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావును మంగళవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు లేకపోవడంతో చనిపోయిన వారి కుటుంబ సభ్యుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. వారికి న్యాయం చేసేలా కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు డెత్ గ్రాట్యూటీ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరారు. సీనియార్టీ జాబితా విడుదల చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలిపారు.



చుక్కా రామయ్యను కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యను కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (475) ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఉద్యమాలకు మార్గదర్శకులు, క్రమబద్ధీకరణకు అండదండలు అందించిన ఆయన ఆశీస్సులు తీసుకునేందుకు కలిశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించడంలో ఆయన కృషి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బోల్తాపడిన పోలీస్ వాహనం

- ఎస్ఐ, డ్రైవర్ మృతి
- కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- ఇంటెలిజెన్స్ చీఫ్ భద్రతలో ఘటన

నవతెలంగాణ- ఏటూరునాగారం ఐటీడీఏ

ఇంటెలిజెన్స్ చీఫ్ పర్యటన నేపథ్యంలో భద్రతాచర్యల్లో పాల్గొన్న పోలీసు వాహనం బోల్తాపడింది. ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో సెకండ్ ఎస్ఐ బండారి ఇంద్రయ్య(59), ప్రయివేట్ డ్రైవర్ చెట్టుపల్లి రాజు(25) మృతిచెందారు. మరో కానిస్టేబుల్ మెట్టు శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం జీడివాగు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వెంకటాపురం(కె) పోలిస్‌స్టేషన్ తనిఖీ కోసం ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐజీ రవివర్మ వచ్చారు. అనంతరం భద్రాచలం వైపు వెళ్తుండగా ఏటూరునాగారం సెకండ్ ఎస్ఐ ఇంద్రయ్య ప్రయివేటు డ్రైవర్ రాజు, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను తీసుకొని ఎస్కార్ట్‌గా వెళ్లారు. ఉన్నతాధికారులు వెళ్తున్న క్రమంలో ఎస్కాట్ ఇస్తుండగా వాహనం అదుపుతప్పి జీడివాగు వద్ద బోల్తాపడి సుమారు 10మార్లు పల్టీలు కొట్టింది. దీంతో ముందు కూర్చున్న ఎస్ఐ ఇంద్రయ్య, డ్రైవర్ రాజు వాహనం నుంచి ఎగిరి రోడ్డుమీద పడ్డారు. తలకు బలమైన గాయాలై ఎస్ఐ ఇంద్రయ్య అక్కడికక్కడే మృతిచెందారు. రాజు చెట్లపొదల్లో పడటంతో కర్రలు, వాహనం ఇనుప చువ్వలు గుచ్చుకొని చనిపోయాడు. చాకచక్యంగా వాహనంలో సీటును పట్టుకొని కానిస్టేబుల్ మెట్టు శ్రీనివాస్ ప్రాణంతో బయటపడ్డారు. అయితే అతని కాలు, వెన్నుముక, తలకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్ తేరుకుని మరో ఎస్ఐ రమేష్‌కు



సమాచారం అందించగా హుటాహుటిన వెళ్లారు. అప్పటికే ఎస్ఐ, డ్రైవర్ మృతిచెందారు. కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అంబులెన్స్‌లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

1984 బ్యాచ్ కానిస్టేబుల్ ఇంద్రయ్య

హన్మకొండ మండలం పలివెల్పుల గ్రామానికి చెందిన బండారి ఇంద్రయ్య 1984లో తొలి పోస్టింగ్ నల్లబెల్లి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందారు. ఆ తర్వాత 2019లో మహబూబాబాద్ టౌన్ ఎస్ఐగా ప్రమోషన్ వచ్చింది. అక్కడ విధులు నిర్వర్తిస్తూ మహబూబాబాద్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ 2021 డిసెంబర్‌లో 317 జీవోలో జరిగిన బదిలీలపై ఏటూరునాగారం సెకండ్ ఎస్ఐగా వచ్చారు. ఇంద్రయ్యకు భార్య ఎలిశా, నలుగురు కుమారులు అవినాష్, అన్వేష్, అకిలేష్, నిఖిలేష్ ఉన్నారు. భార్యతో ఇంద్రయ్య ఇక్కడే ఉంటుండగా, కుమారులు పలివెల్పులలో నివాసం ఉంటున్నారు.

స్నేహితుడితో వచ్చి..

తాడ్వాయి మండలం కాటాపురం గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్, వ్యవసాయదారుడు అయిన చెట్టుపల్లి రాజు(23) తన స్నేహితుడు వంశీతో కలిసి ఏటూరునాగారానికి వచ్చారు. ఇదే క్రమంలో ఎస్ఐ ఇంద్రయ్యకు డ్రైవర్ అవసరం ఉండగా రాజును తీసుకెళ్లారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయాడు. రాజుకు భార్య రాజేశ్వరి, కుమార్తె ఐశ్వర్య, కుమారులు రేవంత్, జున్ను ఉన్నారు.

ప్రభుత్వంలో ప్రయివేటు వర్సిటీ బిల్లు

- అనుమతి ఉంటేనే చెల్లుబాటు : ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లు ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో ప్రాసెస్‌లో ఉందని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుమతి వస్తేనే ప్రయివేటు విశ్వవిద్యాలయం చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఒకవేళ అది రాకుంటే ప్రయివేటు వర్సిటీగా గుర్తింపు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అసెంబ్లీలో ఆమోదించిన ఐదు ప్రయివేటు విశ్వ విద్యాలయాల బిల్లును గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇటీవల తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. వాటిలో చదివే విద్యార్థుల పరిస్థితేంటని విలేకర్లు ప్రశ్నించగా... రాష్ట్ర ప్రభుత్వం వివరణ పంపించి ఆ బిల్లు ఆమోదించేలా కృషి చేస్తుందని లింబాద్రి చెప్పారు. ప్రభుత్వం, గవర్నర్ మధ్య ఈ విషయం ఉందన్నారు. అనుమతి వస్తుందనే కారణంతోనే ఆ ప్రయివేటు విశ్వవిద్యాలయాలు అడ్మిషన్లు తీసుకున్నాయని అన్నారు.

పౌష్టికాహార పంపిణీ సమర్థవంతంగా అమలు చేయాలి: మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిపోషణ ద్వారా చెంచు చిన్నారులకు పకడ్బందీగా పౌష్టికాహారాన్ని అందించాలని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. చెంచు చిన్నారుల్లో ఎదుగుదల లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు పూర్తిగా తగ్గాయనీ, మారు మూల ప్రాంతాల్లో అధికారులతో మరింత అవగాహన చర్యలు చేపట్టాలన్నారు. దీనికి కళ్యాణ లక్ష్మి పథకమే కారణమన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు వందశాతం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు సైతం అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తినివెళ్ళేవిధంగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వయసుకు తగ్గ ఎత్తు బరువు లేని పిల్లల విషయంలో బరువులు, ఎత్తులు సరిగ్గా ఉండేలా చూసి, బరువు తక్కువ ఉన్న పిల్లలకు మరింత పటిష్టమైన పౌష్టికాహారాన్ని అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్,గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు,మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి భారతి హోళికేరి పాల్గొన్నారు.

టీడీపీ కో-ఆర్డినేటర్ల నియామకం

నవతెలంగాణ - హైదరాబాద్

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం, ఇల్లెందు, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ కో-ఆర్డినేటర్ల(సమన్వయకర్తలు)ను తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నియమించారు. భద్రాచలం(ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఈసం శశిధర్, ఇల్లెందు (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ముద్రగడ వంశీ, నర్సంపేట్(జనరల్) అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా అడపా నర్సింగరావును నియామకం చేస్తూ మంగళవారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టీడీపీ పార్లమెంటు పరిశీలకులు రామచందర్‌రావు, మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర నాయకులు మండూరి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై హెచ్ఎండీఏకు వచ్చిన ఆదాయమెంత?

- మంత్రి కేటీఆర్, అర్వింద్‌కుమార్ చెప్పాలి : రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)పై హెచ్ఎండీఏకు వచ్చిన ఆదాయం ఎంత అనే దానిపై మంత్రి కేటీఆర్, ఎమ్ఏఅండ్‌యూడీ జనరల్ డైరెక్టర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ స్పష్టతనివ్వాలని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ టోల్ బిడ్డ్‌పై అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్‌పై ఏప్రిల్ 1 నుంచి 30 వరకు రోజు వారి ఆదాయం ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ బిడ్డింగ్‌పై మీడియా సమావేశం ఎందుకు పెట్టలేదు? రెండు పేజీల ప్రెస్‌నోట్‌కే ఎందుకు పరిమితం అయ్యారు? రూ.7272 కోట్లకు బిడ్డింగ్ వేస్తే రూ.7380 కోట్లకు అని ఎందుకు ప్రకటించారు? ఏప్రిల్ 11 నుంచి 27వ తేదీ వరకు ఏం జరిగింది? బేస్‌ప్రైజ్ ఎందుకు డిక్లేర్ చేయలేదు? అని ప్రశ్నించారు. బ్రేస్ ప్రైజ్ నిర్ణయించలేదంటేనే పెద్ద ఎత్తున కుంభకోణం జరిగినట్టేనని ఆరోపించారు. ఏడాదికి రూ.720 కోట్ల ఆదాయం వస్తుంటే..ప్రస్తుత కంపెనీకి ఏడాదికి రూ.246 కోట్లకు ఎలా ఇస్తారు? అని నిలదీశారు. ప్రస్తుతం టోల్ వసూలు బాధ్యత తప్పుకునే ఈగల్ కంపెనీకి రూ.517 కోట్లు కట్టాలని నోటీసులెలా ఇస్తారు? అని ప్రశ్నించారు. ప్రభుత్వమే టోల్ నిర్వహణ బాధ్యతను తీసుకుంటే రూ.18,950 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. టెండర్లు వేసిన హెచ్1,హెచ్2,హెచ్3 మూడూ కంపెనీలు ఒక్కటేనని పేర్కొన్నారు. దీనిపై సీవీసీకి వెళ్దామా? కోర్టుకు వెళ్లాలా అనే దానిపై త్వరలోనే నిర్ణయించుకుంటామని తెలిపారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్రలో సభలు, జాయినింగ్స్ కోసం ఖర్చుపెడుతున్నది ఐఆర్‌బీ సంస్థనేనా అనే అనుమానం కలుగుతున్నదని పేర్కొన్నారు.


పారిశుధ్య కార్మికులకిచ్చే గౌరవమిదేనా?

- మేం అధికారంలోకొస్తే రూ. 2వేలు పెంచుతాం : బండి

నవతెంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదేనా? వెయ్యి రూపాయల జీతం పెంపుతో వారికి ఏం ఒరుగుతుంది అని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వారికి రూ.2 వేల వేతనం పెంచుతామని ప్రకటించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పనతోపాటు ఠంచన్‌గా జీతాలు చెల్లిస్తామని హామీనిచ్చారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పారిశుధ్య కార్మికులకు దసరా, ఉగాది పండుగల సందర్భంలో బోనస్ ఇస్తామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలు, మున్సిపాల్టీల్లో సిబ్బందిని అదనంగా నియమిస్తామని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వమిస్తున్న శానిటేషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడంలో పారిశుధ్య కార్మికులదే కీలక పాత్ర అని వివరించారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా నిర్వహించడం చేతగాని ప్రభుత్వం అవసరమా? అని నిలదీశారు. తెలుగు మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్ పేపర్ ఇవ్వడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీ మృతి



నవతెలంగాణ-బోనకల్

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న తటుకునూరి కోదండ రామాచారి (60) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు లాగే మంగళవారం కూడా గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్ళాడు. పనులు చేస్తూనే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ మున్ని సహచర కూలీలు వెళ్లి పరిశీలించగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్, ఏపీవో బసవోజు కృష్ణకుమారి, ఎస్ఐ తేజావత్ కవిత సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవతెలంగాణ

బిజినెస్



ఎఐతో ఐబిఎం వేల ఉద్యోగులకు ముప్పు

- ఐదేండ్లలో 7,800 మందిపై వేటు
- ఆ కంపెనీ సిఇఒ వెల్లడి

న్యూయార్క్ : కృత్రిమ మేధతో అనేక రంగాల్లోని ఉద్యోగులకు పెను ప్రమాదం పొంచి ఉంది. వచ్చే ఐదేండ్లలో తమ సంస్థ దాదాపు 7,800 మంది ఉద్యోగులను తొలగించనుందని టెక్ దిగ్గజం ఐబిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) అరవింద్ కృష్ణ వెల్లడించారు. ఆ చోట కృత్రిమ మేధను ఉపయోగించుకోనున్నామన్నారు. మానవ వనరులను ఎఐ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. ఎఐతో దాదాపు 30 శాతం ఉద్యోగులపై వేటు వేయనున్నామని ఐబిఎం చీఫ్ పేర్కొన్నారు. ఖర్చులను తగ్గించు కోవడంలో భాగంగానే ఆయా కంపెనీలు ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఇప్పటికే ఐబిఎం పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. 4,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు జనవరిలో ప్రకటించింది. కొన్ని వ్యాపార విభాగాలకు పూర్తిగా స్వస్తి చెప్పింది. తాజా తొలగింపుల ప్రకటన మంగళవారం పరిశ్రమ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

వచ్చే ఐదేండ్లలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు కోటిన్నర ఉద్యోగాలు ఊడ్చుకుపోనున్నాయని వాల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సోమవారం ఓ రిపోర్టులో హెచ్చరించిన విషయం తెలిసిందే. దీన్ని వాస్తవం చేసేలా ఐబిఎం ప్రకటన చేయడంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తించింది. ఇప్పటికే అమెజాన్ కూడా తన మానవ వనరుల విభాగంలో ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఎఐని వినియోగించడానికి సన్నద్ధమవుతోంది. ఎఐ అమలులో నియంత్రణ చర్యలు ఉండాలని టెస్లా అధినేత ఎలన్ మస్క్, గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ బాస్ సత్యా నాదేళ్ల తదితరులు పేర్కొంటున్నప్పటికీ.. పోటాపోటీగా ఆయా టెక్ కంపెనీలు కృత్రిమ మేధపై విస్తృత ప్రయోగాలు చేస్తున్నాయి. మరోవైపు విధుల్లోకి కొత్త ఉద్యోగులను తీసుకోవడాన్ని ఐబిఎం నిలిపివేయనున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఆ కంపెనీ ఉన్నతాధికారులకు అర్వింద్ కృష్ణ ఇప్పటికే సూచనలు చేశారని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. మరోవైపు ఆర్థిక సేవల సంస్థ మోర్గన్ స్టాన్లీ మరోసారి దాదాపు ఐదు శాతానికి సమానమైన తమ 3,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించే అవకాశాలు ఉన్నాయని రిపోర్టులు వస్తున్నాయి. జూన్ ముగింపు నాటికే దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడనుందని సమాచారం.

ఎఐతో మహా ప్రమాదం : గూగుల్ మాజీ ఉన్నతాధికారి

కృత్రిమ మేధ వల్ల మానవాళికి పెను ప్రమాదం పొంచి ఉందని గూగుల్ మాజీ ఉన్నతాధికారి జెఫ్రీ హింటన్ హెచ్చరించారు. ఇంతక్రితం ఆయన గూగుల్ ఎఐ విభాగం బాధ్యతలను చూశారు. గత వారమే రాజీనామా చేసినట్లు ఆయన ఓ ఆంగ్ల పత్రికకు తెలిపారు. ఎఐ మానవాళిని ప్రమాదంలోకి నెట్టనుందన్నారు. ఎఐ ఇప్పటికిప్పుడు మనుషుల కంటే తెలివైనవి కాకపోయినప్పటికీ.. భవిష్యత్తులో చాలా శక్తివంతం అయ్యే అవకాశం ఉందన్నారు.

రేపటి నుంచి అమెజాన్ సమ్మర్ సేల్

న్యూఢిల్లీ : భారీ ఆఫర్లతో సమ్మర్ సేల్‌ను ప్రారంభిస్తున్నట్లు అమెజాన్ ఇండియా తెలిపింది. మే 4 నుంచి 8 తేదీల్లో ఈ క్యాంపెయిన్ ఉంటుందని వెల్లడించింది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కిరాణా సరుకులు, గృహోపకరణాలు తదితర ఉత్పత్తులపై గొప్ప తగ్గింపు ఆఫర్లను ఇవ్వనున్నట్లు పేర్కొంది. ప్రైమ్ సభ్యులకు మే 2 అర్ధరాత్రి నుంచే సేల్ అందుబాటులో ఉంటుందని తెలిపింది.

ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్ ధరల వెల్లడి

బెంగళూరు : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్‌ఎక్స్, విఎక్స్) ధరలను మంగళవారం ప్రకటించింది. ఐదు వేరియంట్లలో ఆవిష్కరించిన దీని ధరల శ్రేణిని రూ.23.79 లక్షల నుంచి రూ.25.43 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం కలర్స్‌కు అదనపు ధరలు వర్తిస్తాయని తెలిపింది. ఎకో, పవర్ డ్రైవ్ మోడ్స్‌లో 2.4 లీటర్ డీజిల్ ఇంజిన్‌ను 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో నూతన క్రిస్టాను ఆవిష్కరించింది. తమ డీలర్స్ వద్ద రూ. 50 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని ఆ కంపెనీ పేర్కొంది.

గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ దివాళా

- 3,4 తేదీల్లో సేవలు రద్దు




ముంబయి: బడ్జెట్ విమానయాన సంస్థ గోఫస్ట్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. వాడియా గ్రూప్ యాజమాన్యంలోని ఆ సంస్థ నిధుల కొరతతో రెండు రోజుల పాటు విమాన సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మే 3, 4 తేదీల్లో విమానాలను రద్దు చేశామని గోఫస్ట్ సిఇఒ కౌశిక్ ఖోనా మంగళవారం తెలిపారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ముందు స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియకు దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు. ఇది దురదృష్టకర నిర్ణయం అయినప్పటికీ కంపెనీ ప్రయోజనాల నిమిత్తం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)కు అందజేశామన్నారు. సంస్థలో దాదాపు 5 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గో ఫస్ట్ విమాన సంస్థకు 55 విమానాలు ఉన్నాయి. భారత విమానయాన మార్కెట్‌లో దాదాపు 7 శాతం వాటా కలిగి ఉంది.

నగరంలో రెండు యమహా 'బ్లూ స్క్వేర్' అవుట్‌లెట్లు

హైదరాబాద్ : ద్విచక్ర వాహన కంపెనీ ఇండియా యమహా మోటార్ (ఐవైఎం) హైదరాబాద్‌లో మరో రెండు బ్లూ స్క్వేర్ నూతన షోరూంలను తెరిచినట్లు ప్రకటించింది. ఏస్ మోటార్స్ బ్యానర్‌పై అత్తాపూర్‌లో ఒక్కటి, ఆర్‌సి పురంలో రాఘవేంద్ర మోటార్స్ సహకారంతో మరొక్కటి ఏర్పాటు చేసింది. ఇక్కడ యమహా ద్విచక్ర వాహనాలకు సంబంధించిన అమ్మకాలు, సర్వీసు, పరికరాలు తదితర సేవలను పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది.

కార్ల్ ఐకాన్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ గురి

- 10 శాతం పడిపోయిన షేర్లు



న్యూయార్క్ : అమెరికన్ బిలియనీర్ కార్ల్ ఐకాన్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ గురి పెట్టింది. ఇంధనం నుంచి ఫార్మా రంగాల్లో ఉన్న కార్ల్ ఐకాన్‌కు చెందిన ఐకాన్ ఎంటర్‌ప్రైజెస్ లోపాలను ఎత్తి చూపింది. దీంతో మంగళవారం ప్రీ ట్రేడింగ్‌లోనే ఆ కంపెనీ షేర్లు 10 శాతం పడి పోయాయి. ఐఇపి యూనిట్స్ విలువను ఆ కంపెనీ 75 శాతం ఎక్కువగా చేసి చూపిందని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. నికర ఆస్తి విలువ కంటే ఇటీవల ఐకాన్ 218 శాతం ప్రీమియం ట్రేడింగ్ అవుతోందని విమర్శించింది. ఆ సంస్థ పోంజీ తరహా ఆర్థిక విధానాన్ని కలిగి ఉందని తెలిపింది.

కాగా.. హిండెన్‌బర్గ్ అరోపణలపై ఐకాన్ ఎంటర్‌ప్రైజెస్ స్పందించలేదు. ఈ ఏడాది జనవరిలో అదాని ఎంటర్‌ప్రైజెస్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్‌తో అదాని గ్రూపు కంపెనీల మార్కెట్ మార్కెట్ కాపిటలైజేషన్ 100 బిలియన్ డాలర్లు తుడుచుకు పెట్టుకుపోయిన విషయం తెలిసిందే.

భద్రత మాకొద్దు

- సున్నితంగా తిరస్కరించిన రెజ్లర్లు
- పదోరోజు మల్లయోధుల ఆందోళన



నవతెలంగాణ-న్యూఢిల్లీ

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ (బిజెపి) పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలనే డిమాండ్‌తో న్యూఢిల్లీలో భారత అగ్రశ్రేణి రెజ్లింగ్ క్రీడాకారులు చేపట్టిన ఆందోళన పదో రోజుకు చేరుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా.. ఇప్పటివరకు బిజెపి ఎంపీని అరెస్టు చేయలేకపోవడానికి కారణం ఏంటని? లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి బయట స్వేచ్ఛగా తిరుగుతూ, భయభ్రాంతులకు గురి చేస్తుంటే కుస్తీ పట్టేందుకు ఎలా వెళ్లగలమని రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పది రోజులుగా భారత స్టార్ మల్లయోధులు జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నప్పటికి ప్రధానమంత్రి నరేంద్ర మోడి స్పందించటం లేదు. రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన భారతీయ జనతా పార్టీ ఎంపీని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే విమర్శలు వచ్చినా.. ఎటువంటి చలనం లేదు.

ఇక సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు భద్రత కల్పించేందుకు మంగళవారం దీక్ష స్థలి వద్దకు వచ్చారు. బజరంగ్ పూనియాకు ఇద్దరు.. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్‌లకు ఒకరు చొప్పున వ్యక్తిగత భద్రతా అధికారులను స్థానిక ఏసీపీ నియమించారు. భద్రత కోసం అధికారులు జంతర్‌మంతర్‌కు వచ్చినా.. రెజ్లర్లు సున్నితంగా తిరస్కరించారు. 'మేము మా సోదరులు, సోదరీమణులతో కలిసి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నాం. జంతర్‌మంతర్ వద్దే మాకు రక్షణ లేకుంటే మరో చోట ఎలా ఉంటుంది? మాకు ఎటువంటి భద్రత అవసరం లేదు' అని వ్యక్తిగత భద్రతా అధికారులను నిరాకరించారు.

ఇక న్యూఢిల్లీలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. వర్షానికి రెజ్లర్ల పరుపులు పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వం విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసింది. అయినా, రెజ్లర్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్‌తో ఆందోళనను మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు.

ఏఐకేఎస్ కిసాన్ మహాపంచాయత్

యూపీ ప్రభుత్వం, గ్రేటర్ నోయిడా అథారిటీ ఒప్పందాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

యూపీ ప్రభుత్వం, గ్రేటర్ నోయిడా అథారిటీ ఒప్పందాన్ని అమలు చేయాలని మంగళవారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులు గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీ ఎదుట మహాపంచాయత్ నిర్వహించారు. గ్రేటర్ నోయిడా అథారిటీ గేటు వద్ద గత ఎనిమిది రోజులుగా రైతులు నిరవధిక ధర్నా చేస్తున్నారు. ఈ ధర్నా ఎనిమిదో రోజు ఈ మహాపంచాయత్ నిర్వహించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ధర్నాను కొనసాగిస్తామని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని, గౌతమ్‌బుద్ నగర్‌లోని ప్రతి గ్రామంలోనూ విస్తరింపజేస్తామని రైతులు ప్రతిజ్ఞ చేశారు. ఈ మహా పంచాయతీలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ పోరాటాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ మహాపంచాయత్‌కు స్థానిక సీనియర్ కిసాన్ నాయకుడు జగదీష్ లంబర్దార్ అధ్యక్షత వహించారు. ఏఐకేఎస్ కోశాధికారి పి కృష్ణప్రసాద్, కేంద్ర కమిటీ సభ్యులు సభ్యులు పుష్పేంద్ర త్యాగి, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గౌతమ్ బుద్ నగర్ కిసాన్ సభ నాయకుడు రూపేష్ వర్మ, వీర్ సింగ్ నగర్, నరందర్ భాటి, బిజాందర్ తదితరులు కూడా ఈ పంచాయితీని ఉద్దేశించి ప్రసంగించారు. ఆజాద్ సమాజ్ పార్టీ, బెరోజ్‌గర్ కిసాన్ సంఘటన్, సమాజ్‌వాదీ పార్టీ, బీకేయూ స్థానిక నాయకులు కూడా పాల్గొని మహాపంచాయత్‌లో ప్రసంగించారు.

రైతులు డిమాండ్లు

1. ఒప్పందం ప్రకారం అభివృద్ధి చేసిన ప్లాట్లలో 10 శాతం రైతులకు కేటాయించాలి.
2. కొత్త చట్టం ప్రకారం గ్రామం సర్కిల్ రేటును నాలుగు రెట్లు పెంచాలి. చదరపు మీటరుకు రూ. 24,000 పరిహారం ప్రకటించాలి.
3. తిరస్కరించిన నివాసితుల కేసులు, పెండింగ్ కేసులను విచారించాలి. లీజు బ్యాంకు చర్యను వెంటనే తీసుకోవాలి.
4. అథారిటీ అన్ని రెసిడెన్షియల్ పథకాలలో 17.5 శాతం కిసాన్ కోటా అందించాలి.
5. రైతులతో 1997 ఒప్పందం ప్రకారం 10 శాతం జనాభాకు ప్లాట్లు ఇచ్చే విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి.
6. 120 చదరపు మీటర్ల కనీస ప్లాట్ సైజు విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి.
7. భూమి లేని కుటుంబాలకు పట్వారీ ఒప్పందం ప్రకారం 40 చదరపు మీటర్ల ప్లాట్లు ఇవ్వాలి.
8. స్వాధీన చట్టం, పరిపాలనా ఉత్తర్వుల ప్రకారం, తప్పనిసరి ఉపాధి విధానాన్ని అమలు చేయాలి.
9. బాధిత కుటుంబాలకు అధికార ప్రాంతంలో ఉచిత విద్య, చికిత్స సౌకర్యం కల్పించాలి.

విదేశీయులకు హక్కులు, పథకాలు ఉండవు

గౌహతి హైకోర్టులో కేంద్రం వాదనలు

గౌహతి : విదేశీయులుగా ప్రకటించిన వారికి సంక్షేమ పథకాలేవీ వర్తించవని, వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కేంద్రం గౌహతి హైకోర్టులో వాదనలు వినిపించింది. అసోంలో విదేశీయుడిగా ప్రకటించబడిన వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై గౌహతి కోర్టు విచారణ జరుపుతోంది. ఈ కేసులో కేంద్రం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఆర్‌కేడీ చౌదరి వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద మాత్రమే విదేశీయులకు రక్షణ లభిస్తుందని తెలిపారు. జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును ఈ అధికరణ కల్పిస్తోంది. విదేశీయులకు దేశంలోని భూములపై యాజమాన్య హక్కులేవీ ఉండవని చౌదరి స్పష్టం చేశారు. ఒకవేళ విదేశీయులకు అలాంటి ఆస్తులేవైనా ఉంటే అవి వారికి విక్రయించిన వారికి కాకుండా ప్రభుత్వానికే చెందుతాయని చెప్పారు. విదేశీయులుగా ప్రకటించిన వారి హక్కులు, ఆస్తులకు సంబంధించిన కేసు ఫిబ్రవరిలో కోర్టు ముందుకు వచ్చింది. మహమ్మద్ మైనుల్ హక్ అనే వ్యవసాయ కార్మికుడు వేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. హక్ అసోంకు చెందిన వ్యక్తిగా తనను తాను నిరూపించుకోలేక పోయాడని చెబుతూ ఒక ట్రిబ్యునల్ ఆయనను 2016లో విదేశీయుడిగా ప్రకటించింది. ట్రిబ్యునల్ తీర్పును హైకోర్టు సమర్థించింది. నాలుగేళ్ల తర్వాత ...సరిహద్దు పోలీసులు తనను అక్రమ వలసదారుగా గుర్తించారంటూ 2022లో హక్ మరోసారి ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతుండగానే హక్‌ను అరెస్ట్ చేశారు. దీంతో ఆయన మరోసారి హైకోర్టును ఆశ్రయించారు.

విచారణ సందర్భంగా గౌహతి కోర్టులో న్యాయమూర్తి బారువా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. విదేశీయులుగా ప్రకటించబడిన వారు దేశంలో కొంతకాలం ఉండాలంటే వారి పట్ల మానవీయంగా వ్యవహరించాలని సూచించారు. వారికి విద్యను కూడా అందించాలని, వారు దేశానికి మేలు చేస్తారని అనుకుంటే వారి సేవలను వినియోగించుకోవాలని అన్నారు

నేరస్తులకు శిక్షలు పడాలంటే.. ఫోరెన్సిక్ ఎవిడెన్సే కీలకం : డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

నేరస్తులకు కోర్టులలో శిక్షలు పడాలంటే ఫోరెన్సిక్ శాస్త్రీయ ఆధారాలే అత్యంత కీలకమని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధ్వర్యాన జరిగిన ఒక రోజు వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ అనే అంశంపై జరిగిన ఈ వర్క్ షాపులో డీజీపీ మాట్లాడుతూ.. వివిధ నేరాలలో సూక్ష్మమైన ఆధారాలను కనిపెట్టాలంటే ఫోరెన్సిక్ ఆధారాలే అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ముఖ్యంగా నేరం జరిగిన ప్రదేశంలో చిన్నపాటి ఆధారాన్నైనా ఒడిసి పట్టుకుంటే దాని ద్వారానే మొత్తం కేసు పరిష్కారం అవుతుందని , నేరస్తుడికి తప్పని సరిగా శిక్ష పడుతుందని అన్నారు. ఎఫ్ఎస్ఎల్ విభాగం ఇన్‌చార్జి , రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ మాట్లాడుతూ రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్‌లో పేరుకు పోతున్న కేసులను సత్వరమే పరిష్కరించడానికి అన్ని రకాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హత్యలు, లైంగికదాడి , దొంగతనాలు మొదలుకుని సైబర్ నేరాల వరకు వాటి ఆధారాల ను విశ్లేషించడంలో ఫోరెన్సిక్ విభాగం అత్యంత కీలకంగా పాత్ర నిర్వహిస్తున్నదని అదనపు డీజీ శిఖాగోయల్ అన్నారు. ఏడు వేలకు పైగా పెండెన్సిలో ఉన్న కేసులను ప్రస్తుతం రెండు వేల వరకు తీసుకు రావడం జరిగిందని అన్నారు. ఈ వర్క్ షాప్‌లో ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ హసీనా పర్వీన్ తో పాటు అనిత ఎంజెన్స్, అదనపు డైరెక్టర్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఐజీగా ఎం రమేశ్‌కు పదోన్నతి

రాష్ట్ర ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ డీఐజీ ఎం. రమేశ్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఐజీపీ గా మంగళవారం పదోన్నతి లభించింది. పదోన్నతి లభించాక ఆయనకు తిరిగి అదే పోస్టులో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వలస ఓటర్లు పట్టని కర్నాటక

- రాజకీయ నాయకుల ఉదాశీనత
- కనీస సౌకర్యాలు లభించక ఇబ్బందులు



బెంగళూరు : ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కర్నాటకకు వలస వచ్చిన వారి సంఖ్య లక్షలలోనే ఉన్నప్పటికీ వారి ఓటింగ్ హక్కుల గురించి పట్టించుకున్న వారే లేరు. వీరికి ఈ రాష్ట్రంలో కానీ, సొంత రాష్ట్రంలో కానీ ఓటు హక్కు లేదు. ఫలితంగా వీరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని ఎవరూ గుర్తించడం లేదు. కర్నాటకలో 65.45 లక్షల మంది వలసవాదులు జీవిస్తున్నారు. వీరికి తాగునీరు, గూడు, పారిశుధ్యం, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు అందుబాటులో లేవు. 'ఎన్నికలు రాగానే వివిధ పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం మా వద్దకు వస్తారు. రేషన్ కార్డులు ఇస్తామంటారు. ప్రభుత్వ పథకాలు కల్పిస్తామంటారు. అయితే వాస్తవానికి మాకు ఏ సాయమూ అందడం లేదు' అని కొల్‌కతా నుంచి వలస వచ్చిన 36 సంవత్సరాల ప్రియాంక వాపోయారు. ఆమె నగరంలో ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో నివసించే ఇతర వలస కార్మికులు కూడా కనీస సౌకర్యాలను డిమాండ్ చేస్తున్నారు. చాలా మంది వలసవాదులు తమ సొంత రాష్ట్రంలో ఓటు హక్కు ఉండాలని కోరుకుంటున్నారు. బొమ్మనహళ్లిలో ఉంటున్న బాబు అనే కార్మికుడు 'మా కుటుంబాలు అక్కడే ఉంటున్నాయి. సొంత రాష్ట్రంలోనే ఓటు హక్కును అట్టిపెట్టుకోవడం వల్ల మాకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి' అని చెప్పారు. అయితే కర్నాటకలో ఓటు హక్కు లేకపోవడంతో వీరికి ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించే విషయంలో రాజకీయ నాయకులు ఉదాశీనత ప్రదర్శిస్తున్నారు. బెంగళూరు నగరంలో ప్రధాన సమస్య అందుబాటు ధరలో గృహవసతి. ఇంటి అద్దెలు అధికంగా ఉండడం తో వాటిని కట్టలేక తరచూ ఇల్లు మారాల్సి వస్తోందని ప్రియాంక చెప్పారు. దీనివల్ల పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతోందని అన్నారు. పైగా విద్యా సంస్థలలో ప్రవేశం దొరకడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. ఇది ప్రియాంక ఒక్కరి సమస్య మాత్రమే కాదు. బెంగళూరు మహానగరంలో నివసిస్తున్న పలువురు వలసవాదులది. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు పొందడం కూడా చాలా దుర్లభమని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. ఓటరు కార్డు పొందేందుకు ఆమెకు రెండేండ్ల సమయం పట్టింది. అయితే జాబితా నుంచి ఆమె పేరును చాలాసార్లు తొలగించారు. తన పేరును తిరిగి చేర్చేందుకు ప్రియాంక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. సొంత రాష్ట్రంలో ఓటు హక్కు ఉన్న వారి పరిస్థితి మరోలా ఉంది. ఓటు వేసేందుకు వెళ్లాలంటే యజమాని సెలవు ఇవ్వడం లేదు. ఫలితంగా స్వ రాష్ట్రంలోనూ వారి ఓట్లు తొలగిస్తున్నారు. వార్డులు, గ్రామ పంచాయతీలలో స్థానికత సమాచారం అందుబాటులో లేకపోవడంతో వలసవాదులు ఓటు హక్కు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో ఆరు నెలల పాటు నివసిస్తూ, ఇక్కడే ఉండాలనుకునే వారికి చట్టబద్ధంగా ఓటు హక్కు కల్పించాల్సి ఉంటుందని మజ్దూర్ సంయోగి కేంద్రం సభ్యురాలు రోసీ అంటున్నారు. అలా కాకుంటే వారిని అక్రమంగా నివసిస్తున్న వారిగా పరిగణిస్తారని, అధికారుల వేధింపులు తప్పవని ఆమె చెప్పారు.

రాష్ట్ర విభజన పిటిషన్ల విచారణ అంత సులువు కాదు

- విచారణకు సుదీర్ఘ సమయం

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎం జోసెఫ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన పిటిషన్ల విచారణ అంత సులువు కాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎం జోసెఫ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన తీరును సవాల్ చేస్తూ తెలంగాణ వికాస కేంద్రంతో పాటు పలువురు మాజీ మంత్రులు, నాయకులు, సంఘాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బి.వి. నాగరత్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ల విచారణ అంత సులువు కాదని, సుదీర్ఘ సమయం తీసుకుంటుందని జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సమయం తక్కువగా ఉన్నందున వేసవి సెలవుల అనంతరం విచారణ చేపడతామని తెలిపారు. అనంతరం కేసుల విచారణను ఆగస్టు 22 నాటికి ధర్మాసనం వాయిదా వేసింది.

జస్టిస్ ఎల్. నాగేశ్వరరావుకు

ఎఐఎఫ్‌ఎఫ్ ముసాయిదా రాజ్యాంగాన్ని ఖరారు చేసే బాధ్యత



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ముసాయిదా రాజ్యాంగాన్ని ఖరారు చేసే బాధ్యత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టు అప్పగించింది. జులై 31కల్లా రాజ్యాంగ ముసాయిదా ఖరారు చేసి, నివేదిక రూపొందించే కసరత్తు పూర్తి చేయాలని ఆదేశించింది. ఏఐఎఫ్ఎఫ్ ఆఫీస్ బేరర్ల ఎన్నికలు జాతీయ క్రీడా కోడ్‌ను ఉల్లంఘించాయంటూ క్రీడాకారుడు, న్యాయవాది రాహుల్ మెహ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ రాజ్యాంగ సవరణ బాధ్యత వహిస్తున్న జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం సముచితమని భావిస్తున్నట్టు పేర్కొంది. జస్టిస్ నాగేశ్వరరావుకు చెల్లించాల్సిన ఫీజులు, ఖర్చులు ఏఐఎఫ్ఎఫ్ భరించాలని ఆదేశించింది. రూ.25లక్షలు జస్టిస్ నాగేశ్వరరావుకు ప్రాథమికంగా డిపాజిట్ చేయాలని ఏఐఎఫ్ఎఫ్‌ను ధర్మాసనం ఆదేశించింది.

వలస కార్మికులు నేరాలకు పాల్పడుతున్నారు

- గోవా సీఎం సావంత్

పనాజి : రాష్ట్రంలో జరుగుతున్న 90 శాతం నేరాలకు వలస కార్మికులే కారణమని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చెప్పారు. మేడే సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలోని ప్రతి వలస కార్మికుడు గుర్తింపు కార్డును కలిగి ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడిన తర్వాత వలస కార్మికులు సొంత ప్రాంతాలకు వెళుతున్నారని, దీంతో వారిని పట్టుకోవడం కష్టమవుతోందని అన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు గోవాలో నేరాలకు తెగబడుతున్నారని తెలిపారు. కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం ద్వారా నేరాలను నిరోధించవచ్చునని ఆయన చెప్పారు. విదేశీయులపై దాడులు చేస్తున్నారన్న కారణంగా వలస కార్మికులను అరెస్ట్ చేస్తున్న ఉదంతాలు రాష్ట్రంలో చోటుచేసుకుంటున్నాయి.

ఆ మత సంస్థలను నిషేధిస్తాం

- కర్నాటక కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక హామీ

బెంగళూరు : కర్నాటకలో తాము అధికారంలోకి వస్తే హిందూత్వ సంస్థ బజరంగ్‌దళ్, ముస్లిం సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఈ రెండు సంస్థలు శతృత్వాన్ని పెంచుతున్నాయని, మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయని విమర్శించింది. చట్టం, రాజ్యాంగం పవిత్రమైనవని, వాటిని వ్యక్తులు, సంస్థలు ఉల్లంఘించడాన్ని సహించరాదని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక తెలిపింది. తమకు అధికారం అప్పగిస్తే బీజేపీ ప్రభుత్వం చేసిన అక్రమ, ప్రజా వ్యతిరేక చట్టాలను సంవత్సరం లోగా రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగించే గృహయోజన, గృహలక్ష్మి, అన్నభాగ్య, యువనిధి, శక్తి పేరిట ఐదు పథకాలను కూడా ప్రకటించింది. కులగణన నివేదికను విడుదల చేస్తామని, ప్రస్తుతం 50 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 75 శాతానికి పెంచుతామని చెప్పింది. లింగాయతులు, ఒక్కలిగుల రిజర్వేషన్ కోటాను కూడా పెంచుతామని, అసెంబ్లీలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు పెంచుతామని, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని కూడా హామీ ఇచ్చింది. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణపై పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిషేధించిన విషయం తెలిసిందే.

జూన్ 1కల్లా రుణాల చెల్లింపు సంక్షోభంలో అమెరికా !

- కాంగ్రెస్‌కు తెలియచేసిన ఆర్థిక మంత్రి యెలెన్

వాషింగ్టన్ : దేశం రుణాలు తీసుకునే అధికారాన్ని చట్టసభ సభ్యులు పెంచకపోయినా లేదా సస్పెండ్ చేయకపోయినా, తద్వారా ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా మారే ప్రమాదాన్ని నివారించకపోయినా జూన్ 1వ తేది నాటికి అమెరికా తన రుణాలను చెల్లించడంలో విఫలం కావచ్చని ఆర్థిక శాఖ మంత్రి జానెట్ యెలెన్ సోమవారం కాంగ్రెస్‌కు తెలియచేశారు. ఈ మేరకు ప్రతినిధుల సభ, సెనెట్ నేతలకు లేఖ రాశారు. అమెరికా చట్టబద్ధంగా రుణాలు తీసుకునే అధికారంపై గల 31.4 ట్రిలియన్ల డాలర్ల పరిమితిని పరిష్కరించే దిశగా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుని అమెరికా రుణాల పట్ల గల పూర్తి విశ్వాసాన్ని పరిరక్షించాల్సిందిగా యెలెన్ కాంగ్రెస్ నేతలను కోరారు. అయితే అమెరికా వద్ద కచ్చితంగా నగదు ఎప్పుడైపోతుందనే తేది ఊహించడం సాధ్యం కాదని అన్నారు. "రుణ పరిమితి సంక్షోభంపై గతంలోనూ మనం పాఠాలు నేర్చుకున్నాం. రుణ పరిమితిని పెంచడానికి లేదా సస్పెండ్ చేయడానికి చివరి నిముషం వరకు వేచి వుండడం వల్ల వ్యాపార, వినియోగదారుల విశ్వాసానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని మనం తెలుసుకున్నాం" అని అన్నారు. దీనివల్ల అమెరికా క్రెడిట్ రేటింగ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. జూన్ మొదటికల్లా అమెరికా వద్ద నగదు నిల్వలు తరిగిపోయే ప్రమాదముందని కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం (సిబిఓ) కూడా సోమవారం హెచ్చరించింది. ఆర్థిక శాఖ తీసుకున్న అసాధారణ చర్యల ఫలితం కూడా మనం ముందు అంచనా వేసిన దానికన్నా చాలా త్వరగానే ముగుస్తోందని అన్నారు. ఫెడరల్ ప్రభుత్వ డిఫాల్ట్‌ను నివారించేందుకు అసాధారణ చర్యలు తీసుకోవడం ఆరంభించామంటూ జనవరిలో యెలెన్ కాంగ్రెస్ నేతలకు లేఖ రాశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- కార్మిక లోకానికి తరిగామి పిలుపు



శ్రీనగర్ : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు శ్రీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ వద్ద ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. ర్యాలీనుద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ తరిగామి మాట్లాడారు. తమ హక్కుల సాధన, పరిరక్షణ కోసం నిరంతరంగా పోరుబాటలో పయనించే కార్మికులకు విప్లవ అభినందనలు తెలియచేశారు. కార్మిక వర్గం ఇన్నేళ్ళుగా సాధించిన వాటిని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకోవడానికి ప్రస్తుత పాలక పక్షం ప్రయత్నిస్తోందని తరిగామి విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి బదులుగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం అను సరించే విధానాలతో సామాన్యుల జీవనోపాధులు దెబ్బతింటున్నాయన్నారు. సవాలుకరంగా పరిణమిస్తున్న ఇటువంటి పరిస్థితుల్లో తమ హక్కుల పరిరక్షణ కోసం, జాతీయాస్తులను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గంలో విస్తృత ఐక్యత అవసరమని అన్నారు. సిఐటియు నేత మహ్మద్ అఫ్జల్ పారీ మాట్లాడుతూ, పెన్షన్, పిఎఫ్, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలను దశాబ్దాలుగా పోరాటం సాగించి సాధించుకున్నామని అన్నారు.